ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥ 140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్), హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 09, సంచిక: 280 | బుధవారం | 09-09-2026 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ఆ ఎమ్మెల్సీలు అరెస్టు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత, అసభ్య వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను, బి. నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. తాతా మధును న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసం నుంచి, నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసం నుంచి పోలీసులు తీసుకెళ్లారు. అనంతరం విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.స్పీకర్ ఓఎస్‌డి పొల్లేపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డి


# సస్పెన్షన్



- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల పర్యావసానం
- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు అసెంబ్లీ తీర్మానం
- దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు : మంత్రి దామోదర్ రాజ నర్సింహ

**వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు శాసనమండలి నుంచి ఆ ఇద్దరు బిఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటన**

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని శాసనమండలి వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని వ్యాఖ్యలపై శాసనసభ చర్చించి బాధ్యులైన ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్ కు పంపించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం తిరిగి సమావేశమైన శాసనమండలిలో శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనసభ తీర్మానం మేరకు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్‌ఎస్ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి ని సభ నుంచి సస్పెండ్ చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అంతకు ముందు కాంగ్రెస్ సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్‌ఎస్ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సభలో కూర్చోడానికి అర్హతలేదని, వెంటనే వారిని సభ నుంచి సస్పెన్షన్ చేయాలని కోరారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు, సభా నిబంధనల ఉల్లంఘన, అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రభుత్వం తీవ్రం గా పరిగణించింది. ఇందుకు బిఆర్ ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చైర్మన్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

### మధు, నవీన్ రెడ్డిపై చర్యలకు అసెంబ్లీ తీర్మానం

శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, ఎన్.నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానించింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డి ఈనెల 7వ తేదీన శాసనసభ ప్రాంగణంలోని గేట్ నంబర్ 3 సమీపంలో శాసనసభాపతిని ఉద్దేశించి అత్యంత అవమానకరంగా, కించపరిచేలా చేసిన దూషణలను ఈ సభ తీవ్రంగా ఖండిస్తుంది. ఈమేరకు మంగళవారం సాయంత్రం శాసనసభలో మంత్రి సి.దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రవేశపెట్టగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బలపర్చగా, కాంగ్రెస్, ఎంఐఎం, సిపిఐ బలపరచడంతో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిజెపి తరువాయి 8లో

## ‘నా తల్లిని అన్నారు.. నీ తల్లిని కాదు’

**హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ఆగ్రహం**



తెలంగాణ శాసనసభ రెండో రోజు సమావేశాలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ ఆవరణలో బిఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలు రెండో రోజు కూడా సభలో దుమారం రేపాయి. సభ మంగళవారం ఉదయం సమావేశం కాగానే అసెంబ్లీ తరువాయి 8లో

## వ్యక్తికి కాదు... మొత్తం చట్టసభకు

# ఘోర అవమానం



- బిఆర్‌ఎస్ సభ్యుల వ్యాఖ్యలు, ప్రవర్తన యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవేదన

ప్రజాపక్షం/హైదరాబాద్:

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బిఆర్‌ఎస్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని,మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. స్పీకర్ పట్ల అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్‌ఎస్ పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా, హరీశ్‌రావు స్పీకర్‌తో సంవాదానికి దిగారని, మార్షల్స్ లేకపోతే స్పీకర్ వద్దకు వెళ్ళి ఏం చేసేవారో అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంపై, తెలంగాణ ఆత్మగౌరవంపై, సామాజిక సమానత్వంపై దాడి చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విచ్ఛిన్నకర శక్తులను, అవమానాలకు పాల్పడే, ఆత్మగౌరవంపై దాడి చేసే బిఆర్‌ఎస్‌ను శాసనసభలో, రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ ప్రజలు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని కోరారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపై సభ హక్కుల ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో మంగళవారం ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తూ భట్టి విక్రమార్క మాట్లాడారు. బిఆర్‌ఎస్ తమ పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మర్చిపోలేదనడానికి ఈ సంఘటనే సజీవ నిదర్శనమన్నారు. అధికారం తరువాయి 8లో

## అసెంబ్లీలో బూతుల సంస్కృతికి

# చరమగీతం పాడాలి

- చొక్కాలు విప్పి ఘర్షణలకు దిగడం శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తుంది
- సిపిఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు
- ‘లా మేకర్స్ కాస్తా లా బ్రేకర్స్‌గా మారుతున్నారు’ అని ఆవేదన

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభలో వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు, బూతుల సంస్కృతికి చరమగీతం పాడాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు కోరారు. సభలో చోటుచేసుకున్న ఘటనలు తీవ్రంగా బాధించాయని, ఇలాంటి ఘటనలు తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో పరాకాష్టకు చేరాయని అన్నారు. వ్యకిని, వ్యక్తిత్వ హననానికి పాల్పడడానికి ఎవరికీ హక్కులేదన్నారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్య వ్యాఖ్యలకు సంబంధించి మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు తరువాయి 8లో

## తెలంగాణ తల్లులందరికీ కెసిఆర్ క్షమాపణ చెప్పాలి

అక్బరుద్దీన్ ఒవైసి



ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపైన ఆ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ స్పీకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర తల్లులందరికీ క్షమాపణ చెప్పాలని సూచించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పోలీసులపైన కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను కూడా ఆవేశంలో నోరు జారినప్పుడు క్షమాపణ చెప్పానని, తన వల్ల ఎక్కడైనా తప్పు జరిగితే క్షమాపణ కోరుతానని,తాను క్షమాపణ చెప్పినంత మాత్రాన చిన్నతనం కాదని అక్బరుద్దీన్ తెలిపారు. కాగా ‘22ఎ అంశంపైన చర్చించేందుకు ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వడం లేదంటూ బిజెఎల్‌పి సభ నుంచి వాకౌట్ చేసింది.

## మండలి చైర్మన్ ఛాంబర్ ముందు

# బిఆర్‌ఎస్ ధర్నా

- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మళ్లీ ఉద్రిక్తత
- తాతా మధును అడ్డుకున్న మార్షల్స్.. బిఆర్‌ఎస్ సభ్యులతో తోపులాట



ప్రజాపక్షం/హైదరాబాద్

శాసన సభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలను శాసన మండల చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు చైర్మన్ ఛాంబర్ ఎదుట ధర్నాకు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను అన్యాయంగా సస్పెన్షన్ చేశారని వారు పేర్కొన్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మార్షల్స్ కలుగచేసుకుని వారిని బయటికి పంపించివేశారు. అక్కడి నుంచి బిఆర్‌ఎస్ సభ్యులు తాతామధు, నవీన్‌కుమార్‌రెడ్డి, తరువాయి 8లో

**మహిళా ఎమ్మెల్యేల పట్ల**

## పోలీసుల దురుసు ప్రవర్తన

- మాకు స్పీకర్‌పై పూర్తి గౌరవం ఉంది : హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని బిఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బాధ్యులపై ఇప్పటి వరకు చర్యలు తరువాయి 12లో

# కెసిఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి

- క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ డప్పులతో కాంగ్రెస్ నిరసన
- తీవ్ర ఉద్రిక్తత, నాయకుల అరెస్టు
- బారీకేడ్లు తొలగిస్తూ చొచ్చుకెళ్ళేందుకు యత్నించిన డిసిసి అధ్యక్షుడు అంక్షారెడ్డి
- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాపక్షం/గజ్వేల్

అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫాంహౌజ్‌ను ఆ పార్టీ శ్రేణు లు డప్పు చప్పులతో ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి తీవ్ర గాయాలు కాగా, తరువాయి 8లో






# ఉద్యోగాలపై హామీలు ఏమయ్యాయి?

- నిరుద్యోగ సమస్యను పట్టించుకోరా?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధ్వజం
- 12 ఏళ్ల మోదీ పాలనలో యువతకు దక్కిందేమిటి?
- ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా
- యాదగిరిగుట్టలో ఘనంగా ప్రారంభమైన ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు
- లక్ష్మీ నర్సింహ ఫంక్షన్ హాల్ నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ

ప్రజాపక్షం/ యాదాద్రి / యాదగిరిగుట్ట

దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చకపోగా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఎఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల మంగళవారం ప్రారంభమయ్యాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో నెల్లికంటి సత్యం మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగాలు, పోరాటాలు చేశారని, తరువాయి 12లో

# ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

కొనుగోలుకు చేసేందుకు ఆ దేశ ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ నుంచి పెద్ద మొత్తంలో నాణ్యమైన బియ్యం కొనుగోలు చేసే ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆసక్తి చూపిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమారరెడ్డి ఫిలిప్పీన్స్ వ్యవసాయశాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి.టు లారెల్ జూనియర్‌తో సమావేశమెయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో భారీ స్థాయిలో వరి సాగు జరుగుతోందని, పెద్ద మొత్తంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి తరువాయి 12లో

# పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**సెప్టెంబర్ 16 వరకు అవకాశం.. 7,437 పోస్టులకు నియామకాలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పోలీసు నియామక బోర్డు (టిఎస్‌ఎల్‌పిఆర్‌బి) మరో అవకాశం కల్పించింది. వివిధ శాఖల్లో 7,437 ఉద్యోగాల భర్తీకి చేపట్టిన నియామక ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 16 వరకు పొడిగించింది. ఈ మేరకు బోర్డు ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు సెప్టెంబర్ 16, 2026 బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పోలీసు, ఎస్‌పిఎఫ్, ఫైర్, విపత్తు నిర్వహణ, సివిల్ డిఫెన్స్, ప్రిజన్స్ శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి తరువాయి 8లో

# దేశ రాజధానిలో భద్రత ఎక్కడ?

దేశ రాజధాని అంటే కేవలం ప్రభుత్వ భవనాలు, పార్లమెంటు, రాయబార కార్యాలయాలు, అధికార కేంద్రాలు ఉన్న నగరం కాదు. దేశంలోని ప్రతి పౌరుడు తాను సురక్షితంగా జీవించగలిగే నగరంగా కూడా దానికి ఒక ప్రత్యేకమైన ప్రతీకాత్మక విలువ ఉంటుంది. అందుకే ఢిల్లీలో జరిగే ఒక హత్య, ఒక సామూహిక దాడి, ఒక మహిళపై దాడి, ఒక విద్యార్థిపై హింస వంటి ఘటనలను సాధారణ నేరాలుగా చూడడానికి వీల్లేదు. అవి రాజధాని నగరంలోని శాంతిభద్రతల స్థితిని ప్రశ్నించే సంఘటనలు. తన ఇంటి బయట కొందరు వ్యక్తులు పెద్దగా అరుస్తూ, మద్యం సేవిస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని అభ్యంతరం చెప్పడమే మణిపూర్ రాష్ట్రానికి చెందిన 54 ఏళ్ల సంగీతకారుడు విక్రమ్ సింగ్ ప్రాణాలను బలిగొన్న దారుణ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం, కిలోకరిలోని తన నివాసం నుంచి బయటకు వచ్చిన ఆయనపై కొందరు డెలివరీ కార్మికులు, ధాబా సిబ్బంది దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరిన ఆయన మరణించారు. ఈ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి, ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఒక పౌరుడు తన ఇంటి బయట జరుగుతున్న శబ్దం, మద్యం సేవించడం, అల్లరిపై అభ్యంతరం చెప్పడం సహజమైన ప్రతిస్పందన. దానికి సమాధానం వాగ్వాదం కావచ్చు, పోలీసులకు ఫిర్యాదు కావచ్చు. కానీ సమూహంగా దాడిచేసి ఒక మనిషి ప్రాణం తీసే స్థాయికి హింస చేరితే అది వ్యక్తిగత గొడవ పరిధిని దాటుతుంది. సమాజంలో చట్టం పట్ల ఉన్న గౌరవం ఎంతవరకు క్షీణించిందన్న ప్రశ్నను అది ముందుకు తెస్తుంది. ఢిల్లీని క్రైమ్ క్యాపిటల్‌గా అభివర్ణిస్తూ కేంద్ర హోంశాఖ, ఢిల్లీ పోలీసుల పనితీరుపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాలి. ఇక్కడ కాంగ్రెస్ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడడానికి వీల్లేదు. దేశ రాజధానిలో సాధారణ పౌరుడికి తన ఇంటి ముందు కూడా భద్రత లేదా? అనే ప్రశ్నపై చర్చ జరిగి తీరాలి. ఢిల్లీ నగరంలో నేరాలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాలు, వీధి హింస, దోపిడీలు, వాహన నేరాలు, అక్రమ నిర్మాణాలు, సామూహిక ఘర్షణలు, ఆన్లైన్ మోసాలు వంటి అనేక సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నేరం జరిగిన వెంటనే పోలీసులు స్పందించాలి. కానీ ఆధునిక నగర పోలీసింగ్ అంటే కేవలం ఘటన జరిగిన తర్వాత నిందితుడిని పట్టుకోవడం కాదు. నేరం జరగకుండా నిరోధించడం, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, స్థానిక ప్రజలతో నిరంతర సంబంధం కలిగి ఉండటం, నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, ఫిర్యాదులపై వేగంగా స్పందించడం కూడా దాని బాధ్యత. దేశ రాజధానిలో ఈ బాధ్యత మరింత పెద్దది. ఢిల్లీ పోలీసుల పరిపాలనా నియంత్రణ సాధారణంగా రాష్ట్ర పోలీసుల మాదిరిగా పూర్తిగా ఢిల్లీ ప్రభుత్వ పరిధిలో ఉండదు. కేంద్ర హోంశాఖకు ఢిల్లీ పోలీసులపై కీలకమైన పరిపాలనా బాధ్యత ఉంది. అందువల్ల శాంతిభద్రతలపై జరిగే చర్చ రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా సంస్థాగత జవాబుదారీతనం వరకు వెళ్లాలి. పోలీసుల వద్ద సిబ్బంది సరిపోతున్నారా? రాత్రి వేళల్లో గస్తీ ఎంత ప్రభావవంతంగా ఉంది? ఫిర్యాదులపై స్పందన సమయం ఎంత? అత్యంత కీలక ప్రాంతాల్లో స్థానిక నిఘా ఎలా ఉంది? పాత నేరస్తులపై పర్యవేక్షణ ఎలా జరుగుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఢిల్లీలోని వలస జనాభా. దేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రం నుంచి ప్రజలు విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం రాజధానికి వస్తారు. ఈ నగరం అనేక భాషలు, సంస్కృతులు, సామాజిక నేపథ్యాల ప్రజలకు నిలయం. అదే సమయంలో వివక్ష కూడా రోజురోజుకూ పెరుగుతున్నది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు ఢిల్లీలో తమ కు వివక్ష ఎదురవుతోందని అనేక సందర్భాల్లో చెబుతూ వచ్చారు. విక్రమ్ సింగ్ మణిపూర్‌కు చెందిన వ్యక్తి కావడం వల్ల ఈ అంశం ప్రాతీయ కోణాన్ని సైతం ఆవిష్కరిస్తున్నది. అయితే ప్రతి నేరాన్ని వెంటనే ప్రాంతీయ లేదా జాతి వివక్షతో అనుసంధానించడం కూడా సరికాదు. దర్యాప్తు పూర్తయ్యే వరకూ ఉద్దేశాన్ని ఊహించకూడదు. కానీ ఒక వ్యక్తి తన భాష, ప్రాంతం, రూపం, సామాజిక నేపథ్యం కారణంగా అవమానం లేదా హింస ఎదుర్కొనే అవకాశం ఉందనే భయం కూడా నగర భద్రతలో భాగమే. ఢిల్లీలో నివసించే ఈశాన్య భారతీయులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, విద్యార్థులు వంటి వర్గాలు పోలీసులపై విశ్వాసంతో ఫిర్యాదు చేయగల వాతావరణం ఉండాలి. చట్టం అందరికీ సమానంగా పనిచేస్తుందన్న నమ్మకం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఒక పౌరుడు నేరానికి గురైన తర్వాత న్యాయం పొందుతాడన్న విశ్వాసం ఉంటే చట్టబద్ధమైన మార్గాలను ఆశ్రయిస్తాడు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనే భావన పెరిగితే ప్రజలు తమ చేతుల్లోకే న్యాయం తీసుకునే ప్రమాదం పెరుగుతుంది. విక్రమ్ సింగ్ ఘటనలో కనిపించిన మూక హింస ఇదే కారణంగా మరింత కలవర పెడుతోంది. ఇలాంటి ఘటనలను తేలికగా చూడకూడదు. వ్యక్తుల మధ్య గొడవలో ఒకరు మరొకరిపై దాడి చేయడం ఒక రకమైన నేరం. పలువురు కలిసి ఒక వ్యక్తిని చుట్టుముట్టి కొట్టడం మరోస్థాయి ప్రమాదం. గుంపులో వ్యక్తిగత బాధ్యత మసకబారుతుంది. అందరూ కొట్టారు అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి హింసను ప్రారంభ దశలోనే పోలీసులు అడ్డుకోవాలి.

నేరం జరిగిన తర్వాత కొంతమంది అధికారులను సస్పెండ్ చేయడం కంటే, ముందే ప్రమాదాన్ని గుర్తించి చర్యలు తీసుకునే సంస్థాగత సంస్కృతి నెలకొనడం అవసరం. ఒక ప్రాంతంలో తరచూ గొడవలు జరుగుతున్నాయంటే దానికి కారణాలను గుర్తించాలి. ఒక ప్రాంతంలో మహిళలు పదేపదే ఫిర్యాదు చేస్తున్నారంటే అక్కడ భద్రతా ఏర్పాట్లు మార్చాలి. విద్యార్థులు లేదా వలస కార్మికులు నిర్దిష్ట ప్రాంతాల్లో అసురక్షితంగా భావిస్తే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిగణించాలి. నేరాల గణాంకాలు సైతం రాజకీయ నినాదాలుగా మారకుండా, విధాన నిర్ణయాలకు ఉపయోగపడాలి. ఏ నేరం పెరుగుతోంది? ఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది? బాధితుల వయస్సు, లింగం, సామాజిక నేపథ్యం ఏమిటి? కేసుల దర్యాప్తు ఎంతకాలం పడుతోంది? శిక్షలు ఎన్ని వస్తున్నాయి? ఫిర్యాదులలో ఎంత శాతం కేసులుగా నమోదవు తున్నాయి? ఈ సమాచారం ఆధారంగా పోలీసింగ్ వ్యూహాన్ని మార్చాలి. అప్పుడు దేశ రాజధానిలో భద్రతపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. రాజకీయ నాయకుల నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఘటనలు జరిగిన తర్వాత ఇచ్చే హామీలు మాటల్లో కాకుండా, ప్రతి పోలీస్ స్టేషన్లో, ప్రతి వీధిలో, ప్రతి రాత్రి గస్తీలో, ప్రతి ఫిర్యాదుపై స్పందనలో కనిపించాలి.అదే ఢిల్లీ నిజమైన రాజధాని గౌరవాన్ని కాపాడే మార్గం.



## భారత్-చైనా సైన్యాలు.. తొలి ఉన్నత స్థాయి కమాండర్స్ ఫ్లాగ్ చర్చలు

**భారత్, చైనా సైన్యాలు ఈ వారం అరుణాచల్ ప్రదేశ్ సెక్టార్‌లోని సరిహద్దుకు ఇరువైపులా రెండు విడతల్లో తమ తొలి ఉన్నత స్థాయి కమాండర్ల ఫ్లాగ్ చర్చలు జరిపాయి. గత నెల బీజింగ్‌లో జరిగిన ప్రత్యేక ప్రతినిధుల చర్చలలో కుదిరిన తీర్మానానికి అనుగుణంగా ఈ చర్చలు జరిగాయి. జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో స్పెషల్ రిప్రజెంటేటివ్స్ (ఎస్ఆర్) చర్చలు జరిపారు. ఈ చర్యలు సరిహద్దుల నిర్ధారణ, సరిహద్దుల మధ్య సహకారాన్ని కొనసాగించడం, అలాగే, వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసి) వెంబడి శాంతిని కాపాడటంపై దృష్టిని సారించాయి.**

– విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్



## తెలంగాణ పొద్దు పొడుపు మన కాళోజీ

దేశ భాషల్లో తెలుగు భాష కడు తియ్యన. తెలుగు భాషలో ప్రాంతీయ మట్టి వాసనలు, శ్రమజీవుల ఆత్మీయ కలయికతో పలు రకాల యాసలు పుట్టుకొచ్చాయి. తెలంగాణ ప్రాంతం శతాబ్దాలుగా పలు రాచరిక పాలనలు, ముఖ్యంగా నిజాం పాలనతో ఇక్కడి ప్రజల తెలుగు భాషలో ఉర్దూ, హిందీ, పర్షియన్, కన్నడ, మరాఠీ పదాలు మిళితమై ఈ భాష విలక్షణ రూపం దాల్చడం విశేషం. తెలంగాణ తెలుగు భాష, యాస, అందుకోని పలుకుబడులు ఇక్కడి జనుల జీవన విధానాలతో మమేకమై తియ్యదనాన్ని, అమాయకత్వాన్ని సంతరించుకున్నాయి. ఈ ప్రాంత ప్రజల సంస్కృతి, వారసత్వం, చారిత్రక వైభవం, పరాయి భాషా పదాల చేరికతో తెలంగాణ తెలుగుకు ప్రత్యేక సుగంధాలు అద్దబడ్డాయి.

**తెలంగాణ భాషా దినోత్సవం – 2026 :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ప్రముఖ తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా 09, సెప్టెంబర్ రోజున తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం ఓ అద్భుత ఆచారంగా మారింది. కాళోజీ 100వ జయంతి సందర్భంగా 2014 నుంచి ఆయన జయంతి రోజు తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 29 ఆగష్టు రోజున తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారని మనకు తెలుసు. తెలంగాణ పొద్దుపొడుపు కాళోజీ. తెలంగాణ తెలుగు భాష అస్తిత్వం నిలపడానికి కాళోజీ చేసిన కృషి మరువలేనిది. 09, సెప్టెంబర్ 1914 రోజు రంగారావు రామాబాయమ్మలకు కర్ణాటకలో జన్మించిన కాళోజీ నారాయణ రావు కుటుంబం వరంగల్ మడికొండలో స్థిరపడిన ఒక నడిచే తెలంగాణ తెలుగు నిఘంటువు. ఒక కవన శిల్పి. రాజకీయ చైతన్య ప్రజాకవి. నిర్భయంగా భాషతో వాతలు పెట్టిన ప్రజావాది. పుట్టుక, చావు నీది జీవితం అంతా దేశానిది అన్న తెలంగాణ ఉద్యమ కెరటం. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలంతో గళమెత్తిన ధీరుడు. తెలంగాణ శ్రమజీవుల పక్షపాతి, మహా వైతాళికుడు మన కాలేజీ. స్వాతంత్ర్య సమరయోధుడు. తెలంగాణ ఉద్యమకారుడు.

**బహుభాషావేత్త ప్రజాకవి కాళోజీ :**

అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి అన్న కాళోజీ కలం అక్షరాలకు ఆవేశం పుట్టించిన తీరు అనన్యసామాన్యం. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం పొందిన బహుభాషావేత్త మన కాళోజీ. రాజకీయ వ్యంగ్య కవిత్వం, తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆచారవ్యవహారాలు, ఆగ్రహం, పరాయి పాలకుల వ్యతిరేకి అయిన కాళోజీ తన రచనలను ఆయుధాలుగా సాధించడంలో దిట్ట అని నిరూపించుకున్నారు. హైదరాబాద్, హన్మకొండల్లో చదివి ఉస్మానియా నుంచి న్యాయపట్టా పొందారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. 1940లో రుక్మిణీబాయిని వివాహం చేసుకున్నారు. పి.వి నర్సింహారావుతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తల్లి చనిపోయిన తర్వాత అన్న ఉర్దూ కవి కాళోజీ రామేశ్వరరావు పెంపకంలో ఎదిగారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నిక అయ్యారు.

**విశిష్ట పురస్కారాల సుగంధ మాల :**

సాహితీవేత్తగా కాళన్న చేసిన పలు రచనల్లో నా గొడవ, ఇదీ నా గొడవ, జీవన గీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, బాపు బాపు బాపు, కాళోజీ కథలు లాంటివి ముఖ్యమైనవి. కాళోజీ నారాయణ రావు జీవితం తెలంగాణ ప్రజలకే అంకితం. ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ పద్మ విభూషణ్(1992), తామ్రపత్రి పురస్కారం(1972), ఎపి ప్రభుత్వ అనువాద పురస్కారం (1969), బూర్గుల రామకృష్ణారావు మెమోరియల్ పురస్కారం (1981), తెలంగాణ ప్రజలకే ప్రేమగా ప్రజా కవి బిరుదు, పలు సాహితీ సంఘాల పురస్కారాలు, కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్(1992), రామినేని/గాడిచర్ల పౌండేషన్ అవార్డు, గురజాడ అవార్డు (1996), మద్రాస్ కళాసాగర్ పురస్కారం (1996) లాంటివి ఎన్నో కాళోజీ చేతుల్లోకి చేరి మురిసిపోయాయి.

'హింస తప్పు రాజ్య హింస మరీ తప్పు అంటూ సామాన్యుడే నా దేవుడు' అన్న కాళోజీ 13 నవంబర్ 2002 రోజు తుది శ్వాస విడిచారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు ప్రతిగా ప్రభుత్వం వరంగల్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, హనుమకొండలో సమావేశ మందిరానికి కాళోజీ కళాక్షేత్రం అని పేరు పెట్టడం జరిగింది.

**(09 సెప్టెంబర్ తెలంగాణ భాషా దినోత్సవం శుభ సందర్భంగా)**

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఎల్ నినోతో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్ నినో తో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే, దీని ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాదు. గ్రామీణ ఉపాధిపై, పశుసంపదపై, తాగునీటి లభ్యతపై, విద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే సాగు దెబ్బతింటుంది. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది. విద్యుత్ కొరత పరిశ్రమల ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గితే గ్రామీణ ఆదాయం తగ్గుతుంది. గ్రామీణ కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. దాని ప్రభావం తయారీ రంగం నుంచి సేవా రంగం వరకు విస్తరిస్తుంది. చివరికి ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. అందువల్ల వాతావరణ మార్పులను కేవలం పర్యావరణ సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఏర్పడింది. భారత్ వంటి వ్యవసాయాధారిత దేశంలో ఆహార ద్రవ్యోల్బణం మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. సాధారణ కుటుంబం నెలవారీ ఖర్చులో అత్యధిక భాగం ఆహారానికే వెచ్చిస్తుంది. బియ్యం, పప్పులు, వంటనూనె, కూరగాయలు, పాలు, గుడ్లు, పండ్ల ధరలు పెరిగితే మధ్యతరగతి కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయి. పేద కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. వారు ఇతర ఖర్చులను తగ్గించుకోవచ్చు కానీ, ఆహారాన్ని పూర్తిగా తగ్గించుకోలేరు. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది. రెపో రేటు స్థిరంగా ఉన్నా, ఆహార ధరలు పెరిగితే సామాన్యుడికి ఆ స్థిరత్వం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఇక్కడే ద్రవ్య విధానం పరిమితులు స్పష్టంగా కనిపిస్తాయి. రిజర్వు బ్యాంకు తన వద్ద ఉన్న సాధనాలతో మార్కెట్‌లో నగదు లభ్యతను నియంత్రించగలదు. రుణాల ఖర్చును ప్రభావితం చేయగలదు. ద్రవ్యోల్బణ అంచనాలను నియంత్రించడానికి ప్రయత్నించగలదు. కానీ పంటలు పండించడం దాని చేతిలో లేదు. నిల్వ గిడ్డంగులు నిర్మించడం దాని బాధ్యత కాదు. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఉపాధి కల్పించడం వంటి బాధ్యతలు ప్రభుత్వాలపై ఉంటాయి. అందువల్ల ద్రవ్య విధానం, ప్రభుత్వ ఆర్థిక విధానం పరస్పరం అనుసంధానమై పనిచేయకపోతే ఆశించిన ఫలితాలు రావు.

ఇదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా మరో అనిశ్చిత దశలోకి అడుగుపెడుతోంది. అమెరికా, యూరప్, చైనా వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి మందగించడం, అంతర్జాతీయ వాణిజ్య విధానాలలో మార్పులు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల అస్థిరత, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నాయి. గతంలో కొవిడ్ మహమ్మారి ప్రపంచానికి ఒక పాఠం నేర్పింది. ప్రపంచీకరణ ఎంత బలంగా ఉన్నప్పటికీ, ఒక సంక్షోభం వచ్చినప్పుడు సరఫరా గొలుసులు ఎంత వేగంగా దెబ్బతింటాయో ప్రపంచం చూసింది. ఇప్పుడు అదే ప్రమాదం వాతావరణ మార్పులు, యుద్ధాలు, వాణిజ్య ఆంక్షల రూపంలో మళ్లీ కనిపిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో భారతదేశం కేవలం వడ్డీ రేట్లపైనే ఆధారపడకుండా భవిష్యత్తు ఆర్థిక సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలి. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశం ముందున్న అతిపెద్ద సవాలు ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి వడ్డీ రేట్లను అమాంతం పెంచితే పెట్టుబడులు తగ్గుతాయి. పరిశ్రమలు విస్తరణ ప్రణాళికలను వాయిదా వేస్తాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల భారం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. మరోవైపు వడ్డీ రేట్లను తక్కువగా ఉంచితే మార్కెట్‌లో నగదు ప్రవాహం పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించడమే కేంద్ర బ్యాంకుకు అత్యంత క్లిష్టమైన బాధ్యత. అందుకే రిజర్వు బ్యాంకు ప్రస్తుతం వేచి చూసే విధానాన్ని అవలంబించింది. అంతర్జాతీయ పరిస్థితులు, ఆహార ధరలు, ఇంధన వ్యయం, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తూ భవిష్యత్తు నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే ద్రవ్యోల్బణ నియంత్రణ బాధ్యతను పూర్తిగా రిజర్వు బ్యాంకుపైనే వదిలేయడం సమంజసం కాదు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర మరింత కీలకం. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం తప్ప మరో మార్గం లేదు. సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, వర్షపు నీటి సంరక్షణను గ్రామస్థాయిలో విస్తరించడం, సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాల అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణ వంటి చర్యలు అత్యవసరం.

ఎల్ నినో వంటి పరిస్థితులు తరచూ సంభవిస్తున్న ప్రస్తుత కాలంలో వ్యవసాయాన్ని పాత పద్ధతులకే పరిమితం చేస్తే ఆహార భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఉత్పత్తి పెరిగినా రైతుకు తగిన ధర రాకపోవడం, వినియోగదారుడు అధిక ధర చెల్లించడం భారత వ్యవసాయ రంగంలోని మరో వైరుధ్యం. దీనికి ప్రధాన కారణం సరఫరా గొలుసులో ఉన్న లోపాలు. దేశంలో ఇప్పటికీ పంటల కోత అనంతరం భారీ స్థాయిలో ఆహార నష్టం జరుగుతోంది. తగిన గిడ్డంగులు లేకపోవడం, శీతల నిల్వ వ్యవస్థలు పరిమితంగా ఉండటం, రవాణా సదుపాయాల లోపం, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి సమస్యలు ధరలను అస్థిరంగా మారుస్తున్నాయి. కాబట్టి ద్రవ్యోల్బణ నియంత్రణలో భాగంగా గిడ్డంగుల నిర్మాణం, కోల్డ్ చైన్ వ్యవస్థ విస్తరణ, వ్యవసాయ లాజిస్టిక్స్ ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకునే విధానం కూడా సమయోచితంగా ఉండాలి. కొరత ఏర్పడిన తరువాత చర్యలు తీసుకోవడం కంటే, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం. ఏ పంట ఉత్పత్తి తగ్గే అవకాశముందో ముందుగానే అంచనా వేసి, అవసరమైతే దిగుమతులపై సకాలంలో నిర్ణయం తీసుకోవాలి. అవసరం లేని సందర్భాల్లో ఎగుమతులపై ఆంక్షలు విధించడం లేదా అకస్మాత్తుగా విధానాలు మార్చడం రైతు, వ్యాపారి, వినియోగదారులందరికీ అనిశ్చితిని పెంచుతుంది. విధానాలలో స్థిరత్వం కూడా ధరల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశం మరో ముఖ్యమైన అంశంపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలి. అది ఇంధన భద్రత. దేశం ఇప్పటికీ ముడి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడుతోంది.


ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం జరిగినా, సముద్ర రవాణా అంతరాయం ఏర్పడినా, చమురు ధరలు పెరిగినా దాని ప్రభావం భారత మార్కెట్‌పై వెంటనే కనిపిస్తుంది. రవాణా వ్యయం పెరుగుతుంది. ఎరువుల తయారీ ఖర్చు పెరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది. చివరకు ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. కాబట్టి సౌరశక్తి, పవనశక్తి, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాలు వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమే కాదు, ద్రవ్యోల్బణ నియంత్రణ కోసం కూడా అవసరమైన ఆర్థిక వ్యూహం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంభవించే భవిష్యత్తు సంక్షోభాలను కూడా తక్కువ అంచనా వేయరాదు. వాతావరణ విపత్తులు, భౌగోళిక ఘర్షణలు, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలు, సాంకేతిక ఆధిపత్య పోటీ, సరఫరా గొలుసుల అంతరాయాలు, ప్రభుత్వ రుణభారం పెరగడం వంటి అంశాలు కలిసి కొత్త తరహా ఆర్థిక సంక్షోభాలకు దారితీయవచ్చు.

2008 ఆర్థిక సంక్షోభం ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థ బలహీనతను బయటపెట్టింది. కోవిడ్ మహమ్మారి ప్రపంచ సరఫరా వ్యవస్థ ఎంత సున్నితంగా ఉందో నిరూపించింది. రాబోయే సంక్షోభాలు ఈ రెండింటికంటే భిన్నంగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల పాత అనుభవాలతోనే కొత్త సమస్యలను ఎదుర్కోవడం సాధ్యం కాదు. అందుకే దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన రక్షణ కవచం అవసరం. విదేశీ మారక నిల్వలను పటిష్టంగా ఉంచడం, ప్రభుత్వ ఆర్థిక లోటును అదుపులో ఉంచడం, బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలను తగ్గించడం, దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాలు, ఎరువులు, ఔషధ ముడి పదార్థాలు వంటి వ్యూహాత్మక రంగాల్లో దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడం అత్యవసరం. ఆర్థిక భద్రత అంటే కేవలం బ్యాంకుల్లో డబ్బు ఉండటం కాదు. అవసరమైన సమయంలో దేశానికి అవసరమైన వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం కూడా కావాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలే భారత ఉపాధికి వెన్నెముక. వీటిని బలోపేతం చేయకుండా ఆర్థిక వృద్ధి సమ్మిళితంగా ఉండదు. చౌక రుణాలు ఇవ్వడం ఒక్కటే కాదు, సాంకేతిక పరిజ్ఞానం అందించడం, ఎగుమతి అవకాశాలు కల్పించడం, డిజిటల్ మౌలిక వసతులు మెరుగుపరచడం, చెల్లింపుల జాప్యాన్ని తగ్గించడం వంటి సంస్కరణలు కూడా సమాంతరంగా అమలవాలి. అలాగే నైపుణ్యాభివృద్ధిపై పెట్టుబడులు పెంచకుండా యువతకు ఉపాధి కల్పించడం అసాధ్యం. పేదరిక నిర్మూలనకు కూడా ఆర్థిక వృద్ధి ఒక్కటే సరిపోదు. వృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరాలి. ప్రభుత్వ విద్య బలపడాలి. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరగాలి. పోషకాహార కార్యక్రమాలు సమర్థంగా అమలవ్వాలి. మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరగాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు విస్తరించాలి. ఆదాయ అసమానతలను తగ్గించే విధానాలు అమల్లోకి రావాలి. అప్పుడే ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కూడా కనిపిస్తుంది.

ఆర్‌బిఐ ఈసారి కూడా రెపో, రివర్స్ రెపో రేట్లను యథాతథంగా కొనసాగించడం ప్రస్తుత పరిస్థితుల్లో వివేకవంతమైన నిర్ణయమే కావచ్చు. అది మార్కెట్లకు స్థిరత్వాన్ని అందించవచ్చు. రుణగ్రహీతల కు తాత్కాలిక ఊరటనివ్వవచ్చు. కానీ అదే సమయం లో విధాన నిర్ణేతలకు ఒక హెచ్చరిక కూడా. ముందు న్న సవాళ్లు వడ్డీ రేట్లతో మాత్రమే పరిష్కరించగలవి కావు. ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన దిగుమతులపై ఆధారపడటం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, సాంకేతిక మార్పు లు, ఉపాధి సంక్షోభం వంటి అనేక అంశాలు సమష్టిగా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయబోతున్నా యి.

ఏనుగు వేంకటేశ్వరరావు

ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా తట్టుకోవాలంటే పంట మార్పిడి విధానం ఒక్కటే మార్గమన్న రీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. కానీ, ఇతరత్రా చర్యలు, ముందస్తు జాగ్రత్తలు కూడా అత్యవసరం. ఇప్పటికీ ఎండాకాలమే కొనసాగుతున్నట్టు కనిపిస్తోంది. కాలంకాని కాలంలో, తీవ్రమైన వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. విష జ్వరాలు వేధిస్తున్నాయి. కొవిడ్ కంటే భయానకమైన పరిస్థితులు తలెత్తడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి. సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజలను ఎల్‌నినో ప్రభావం నుంచి, దేశాన్ని ఆకలి కేకల నుంచి రక్షించాలి.




## 'ఆకలి' తగ్గినా.. ఆహార భద్రత ఎక్కడ?

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వెలువడిన 'ది స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషియన్ ఇన్ ది వరల్డ్' (ఎస్ఒఎఫ్ఐ) 2026 నివేదిక ప్రపంచ ఆహార భద్రతపై పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నివేదికను అనుసరించి, ప్రపంచవ్యాప్తంగా ఆకలి వరుసగా మూడో ఏడాది తగ్గింది. 2022లో 8.6 శాతంగా ఉన్న పోషకాహార లోపం 2025 నాటికి 7.8 శాతానికి తగ్గింది. అయినప్పటికీ ప్రపంచంలో 64.5 కోట్ల మంది ఇప్పటికీ తగినంత ఆహారం పొందలేకపోతున్నారు. అంతకంటే పెద్ద సమస్య ఏమిటంటే, సుమారు 269 కోట్ల మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఈ నివేదికలో అత్యంత ముఖ్యమైన పరిణామం ఆఫ్రికాకు సంబంధించినది. చరిత్రలో తొలిసారిగా ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్యలో ఆఫ్రికా ఆసియాను అధిగమించింది. ఆఫ్రికాలో సుమారు 30.9కోట్ల మంది, అంటే జనాభాలో 20 శాతం మంది ఆకలిని ఎదుర్కొంటున్నారు. ఆసియాలో ఈ సంఖ్య 29.2 కోట్లు, అంటే 6 శాతంగా ఉంది. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2030 నాటికి ప్రపంచంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో సుమారు 56 శాతం మంది ఆఫ్రికాలోనే ఉంటారని అంచనా. ఆఫ్రికాలోని ఘర్షణలు, పేదరికం, వాతావరణ మార్పులు, ఆహార ధరల పెరుగుదల ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. సూడాన్, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో వంటి దేశాల్లో యుద్ధాలు వ్యవసాయ ఉత్పత్తిని, సరఫరా వ్యవస్థలను దెబ్బతీశాయి. ఇంధనం, ఎరువుల ధరలు పెరగడం కూడా రైతులపై ఒత్తిడిని పెంచింది. ఆహారం అందుబాటులో ఉండటం ఒక్కటే ఆకలిని నిర్మూలించదు. ప్రజలు తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, గింజలు వంటి పోషక పదార్థాలు లేకపోతే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం కాదు. 2025లో ఆరోగ్యకరమైన ఆహారం కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక వ్యక్తికి రోజుకు కనీస వ్యయం 4.28 డాలర్ల 'పర్చేసింగ్ పవర్ పారిటీ'(పిపిపి)కి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం దీనికి ప్రధాన కారణం. ప్రపంచ జనాభాలో 32.7 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోయారు. ఆఫ్రికాలో ఈ సమ స్య మరింత తీవ్రంగా ఉంది. అక్కడ 66.6 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదు. పిల్లలు, మహిళల ఆహార వైవిధ్యం కూడా ఆందోళన కలిగిస్తోంది. 6– 23 నెలల వయసున్న పిల్లల్లో కేవలం 30.8 శాతం మందే కనీస ఆహార వైవిధ్యాన్ని పొందుతున్నారు. 15–49ఏళ్ల మహిళల్లో ఈ నిష్పత్తి 62.7 శాతంగా ఉంది. అంటే దాదాపు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరికి తగినంత వైవిధ్యమైన ఆహారం అందడం లేదు. రక్తహీనత, తక్కువ జనన బరువు, ఎదుగుదల లోపం, బాల్య స్థూలకాయం వంటి సమస్యలను 2030 నాటికి తగ్గించాలనే ప్రపంచ లక్ష్యాలు కూడా ప్రస్తుత వేగంతో సాధించే పరిస్థితిలో లేవు. అందుకే వ్యవసాయ విధానాలు కేవలం బియ్యం, గోధుమ వంటి ప్రధాన ధాన్యాల ఉత్పత్తిపైనే దృష్టి పెట్టకుండా పప్పు లు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి పోషక ఆహార ఉత్పత్తిని పెంచాలి. కోత తర్వాత నిల్వ, శీతలీకరణ, రవాణా వంటి మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేయాలి. కాగా, మన దేశం ఆహార విధానంలో మార్పు అవసరాన్ని ఈ నివేదిక వల్ల స్పష్టమవుతోంది. బియ్యం, గోధుమల ఉత్పత్తి, పంపిణీపై నిర్మించిన ఆహార భద్రతను ఇప్పుడు పోషక వైవిధ్యంతో అనుసంధానించాలి. పండ్లు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు వంటి పోషక ఆహారాల ధరలు సాధారణ కుటుంబాలకు అందుబాటులో ఉండేలా సరఫరా వ్యవస్థలను మెరుగుపరచాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షాధార వ్యవసాయానికి తగిన రక్షణ కల్పించాలి.



( అసెంబ్లీ మీడియా పాయింట్ )

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అసభ్య ప్రవర్తన : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా పోలీసుల ఎదుట చొక్కాలు విప్పి బిఆర్ఎస్ ఎంఎల్ఎలు అసభ్యకరంగా ప్రవర్తించారని, ఇదే నేర్పారా బిఆర్ఎస్ ఎంఎల్ఎలకు కెసిఆర్ అని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కెటిఆర్, హరీశ్‌రావు ఉద్దేశపూర్వకంగానే వారి పార్టీ ఎంఎల్ఎలను సమర్థించే పనులు చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు కావాలనే దళిత సమాజాన్ని అవమానపరస్తున్నారన్నారు. స్పీకర్ తల్లిని అవమానించిన ఎంఎల్‌సి తాతా మధును సభ నుంచి డిస్మిస్ చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బల్మూరి వెంకట్ స్పష్టంచేశారు.

## స్పీకర్‌కు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి : విప్ ఆది శ్రీనివాస్



ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి అసెంబ్లీ స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ గేటు వద్ద మొన్న జరిగిన ఘటనపై ఇప్పటివరకు కెసిఆర్ విచారణ వ్యక్తం చేయలేదన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులను తోసి వేశారన్నారు. పైగా కట్టు కట్టించుకొన్న ఓ బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఈరోజు చూస్తే ఎలాంటి గాయం లేదన్నారు. కేవలం సానుభూతి పొందడానికే బిఆర్ఎస్ వాళ్ళు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

## సమాజం తలదించుకొనేలా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు : విప్ రామచంద్రు నాయక్



సభ్యసమాజం తలదించుకొనే విధంగా మొన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఎంఎల్‌ఎ,విప్ రామచంద్రు నాయక్ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ఆరాచకాలు, అక్రమాలు, అవినీతి చేసి మళ్లీ ఇప్పుడు అధికారం పోయి అల్లర్లకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. దళిత సామాజిక వర్గాన్ని అవమానపరిచేవిధంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ పట్ల దురుసుగా మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలని కోరారు.

## ప్రజల ఇబ్బందులపై చర్చ జరగాలి : బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్



అసెంబ్లీలో రాష్ట్ర భవిష్యత్తు మీద, ప్రజల ఇబ్బందుల మీద చర్చ జరగాలని బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో కెసిఆర్ చేసిన అక్రమాలను కాంగ్రెస్ కాపాడుతున్నదన్నారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ జరపడం లేదన్నారు. 22ఎ భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెండింగ్ డిఎ బకాయిలు, పిఆర్‌సిల మీద, రైతాంగం సమస్యలపై చర్చ జరగాలని కోరారు.

## తెలంగాణ అస్తిత్వానికే ప్రమాదం తెచ్చుకొన్నట్టే : ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



కెసిఆర్ చావు కోరుకోవడమంటే తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం తెచ్చుకొన్నట్టేనని బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎర్రవల్లిలో కెసిఆర్ ఇంటి దగ్గర వెయ్యి డప్పులతో దాడి చేస్తాం, ఆయన చావు కోరుకొంటామని షాద్‌నగర్ ఎంఎల్ఎ వీర్నపల్లి శంకర్ వ్యాఖ్యానించారని, అది సిఎం రేవంత్ రెడ్డి అన్నట్టేనని ఆయన పేర్కొన్నారు. ఎంఎల్ఎ శంకర్‌పై కేసు నమోదు చేయాలని డిజిపిని కోరుతున్నామన్నారు. అసెంబ్లీకి రావాల్సిన కొందరు ఎమ్మెల్యేలు ఎర్రవల్లిలోని కెసిఆర్ ఇంటిపై దాడి చేయాలని మకాం వేసినట్టు సమాచారం ఉన్నదన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే కెసిఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోవాలని వేముల సవాల్ చేశారు.

## మా గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నారు : బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద



కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన ఘోరంగా విఫలమైంది కనుకే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఎంఎల్ఎ కెపి వివేకానంద పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగాలని, అందుకు బిఆర్ఎస్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా చేసే ప్రయత్నం చేస్తూ, కేసులు పెడుతున్నారన్నారు. సాటి మహిళలను అవమానపరిచే విధంగా మంత్రి సీతక్క మాట్లాడుతున్నారన్నారు. మొన్న ఘటనపై స్పష్టత ఇస్తామంటే మైక్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ తిడితే కెసిఆర్ బహిరంగంగా ఖండించారని గుర్తుచేశారు. మహిళా ఎంఎల్ఎల పట్ల సిఎం దురుసుగా మాట్లాడుతున్నారని, ఆయన మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పోలీసులను అడ్డంపెట్టుకొని రెచ్చగొడుతున్నారు : ఎంఎల్ఎ కోవా లక్ష్మి



కొంతమంది కాంగ్రెస్ ఎంఎల్ఎలు పోలీసులను అడ్డం పెట్టుకొని కావాలనే రెచ్చగొడుతున్నారని ఎంఎల్ఎ కోవా లక్ష్మి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆడవాళ్ల దగ్గర మగ పోలీసులను, మగవాళ్ల చుట్టూ ఆడ పోలీసులను పెట్టారు, ఇది అసెంబ్లీలో చరిత్ర లేదన్నారు. మొన్న జరిగిన ఘటనపై విచారణ చేసుకోండి, వీడియోలు కూడా ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి కెసిఆర్ పైన బూతు పురాణాలు మాట్లాడుతున్నారని, ఇప్పుడు సిఎంగా కెసిఆర్ వున్నారా? అంటూ ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డికి చేతగాకపోతే తప్పుకోండి కెసిఆర్ పాలన చేస్తారని పేర్కొన్నారు.

## దోపిడీ బయటపెడతామనే సభకు రానిస్తలేరు : బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



ప్రజల ఆస్తులను దోచుకోవడానికే భూభారతి తెచ్చారని, దానిపై చర్చ జరపడం ఇష్టంలేక వారి దోపిడీని బయటపెడతామని తమను సభకు రాకుండా అడ్డుకొంటున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌పై దాడికి సిఎం రేవంత్ రెడ్డి పోలీస్ ఎస్కార్ట్ ఇచ్చి మరీ పంపిస్తున్నారన్నారు. ఇంటెలిజెన్స్‌కు తెలియకుండా సిఎం పనిచేస్తున్నారని, చాలా మంది అధికారులు చేతులెత్తుస్తున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ పై దాడికి వెళ్లే వారిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాము అధికారంలోకొచ్చిన తర్వాత చర్యలుంటాయని పేర్కొన్నారు.

### స్పీకర్‌ను బెదిరించేలా మాట్లాడటం

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల గురించి మంగళవారం రెండోరోజు కూడా చర్చ జరిగింది. చర్చలో శాసనసభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, బిఆర్ఎస్ సభ్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానాన్ని బెదిరించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సభలో బిఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ సభను ఏ విధంగా నడపాలనే దానిపై స్పీకర్‌ను నిర్దేశిస్తూ, ఇలా చేయొద్దు, అలా చేయొద్దు అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ వ్యవస్థను బెదిరించేలా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారాన్ని ఏదో అనుకుంటే లేదా భావిస్తే అన్న చర్చకు తావులేదని, ఏం జరిగిందనేది వీడియోల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తుందన్నారు. ఉన్నతమైన స్పీకర్ వ్యవస్థపై జరిగిన దాడి వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. చట్టసభ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే నివేదిక కోరిందని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను పక్కన పెట్టాలంటున్న బిఆర్ఎస్ నేతలు, స్పీకర్ పట్ల బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించాలన్నారు. మహిళా సభ్యుల అంశాన్ని చూపిస్తూ స్పీకర్‌పై జరిగిన అవమానాన్ని విస్మరించాలని కోరడం సరైంది కాదన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు.

**ముందు క్షమాపణ చెప్పాలి : అడ్లూరి లక్ష్మణ్**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండటాన్ని బిఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. స్పీకర్ తల్లిని అవమానించిన అంశంపై కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించినట్లేనన్నారు. దళితుడిని సిఎం చేస్తామని చెప్పి, మాట తప్పారని, ద్రోహం చేశారని అన్నారు. ఏనాడైనా కెసిఆర్ అంబేద్కర్ వర్ధంతికి వచ్చారా? అని ప్రశ్నించారు. ఆనాడు సంపత్ కుమార్ ఏం తప్పు చేశారని ఆయనపై నిషేధం విధించారని నిలదీశారు. మహిళలను ముందు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ జాతి స్పీకర్ పక్షాన నిలుస్తుందన్నారు. బిఆర్ఎస్ ముందుగా స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ ఓ పోలీసు అధికారి గల్లా పట్టి కొట్టారని, హరీశ్ రావు మహిళా అధికారుల ముందు షర్ట్ విప్పారని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించి ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

**మహిళలను రాజకీయాలకు వాడొద్దు : సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎమ్మెల్యే తాతా మధు వ్యాఖ్యాలకు కెసిఆర్ నైతిక బాధ్యత వహించి, సభకు వచ్చి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలను రాజకీయ ప్రయోజనాల కోసం ముందుకు నెట్టారని ఆరోపించారు. మహిళా పోలీసు అధికారుల ఎదుట బిఆర్ఎస్ నేతలు అనుచితంగా ప్రవర్తించారని, మహిళా పోలీస్ అధికారుల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా? అని ప్రశ్నించారు. డ్యూటీలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ దేవాలయం లాంటిదని, అలాంటి చోట గందరగోళానికి తావు ఉండకూడదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికి తీయాలని ఆయన కోరారు. బిఆర్ఎస్ మహిళా నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. కవితను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

**22ఎ భూములపై చర్చ జరపాలి : ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

సభలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి 22ఎ నిషేధిత భూముల అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులు, భూ యజమానులను ప్రభావితం చేస్తున్న ఈ అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎప్పుడు చర్చ చేపడుతుందో స్పష్టత ఇవ్వాలని కోరారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ బిఎసి సమావేశంలో 22ఎ అంశంపై స్వల్పకాలిక చర్చ చేపడుతామని నిర్ణయం తీసుకున్నామని, సమగ్రంగా చర్చ జరుపుతామని తెలిపారు.

### నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో

## ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదు

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభను తాను ఎల్లప్పుడూ అత్యంత ప్రజాస్వామ్యయుతంగా నడిపించానని, అయితే శాసనసభాపతి స్థానాన్ని అవమానించిన ఘటనపై సభలో మాట్లాడిన మాజీ మంత్రి హరీష్ రావు క్షమాపణ చెబుతారని భావిస్తే, ఆయన అసలు విషయాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడారని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులను చూడలేదని, ఈ ఘటనతో రాష్ట్రమంతా అట్టుడుకుతోందని పేర్కొన్నారు. అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో స్పీకర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గతంలో కెసిఆర్ వ్యవహరించినట్లుగా తాము నియంతృత్వంగా వ్యవహరించలేదని, విపక్ష సభ్యులపై వెంటనే అనర్హత వేటు కూడా వేయలేదని స్పీకర్ అన్నారు. బిఆర్ఎస్ మహిళా సభ్యులపై జరిగిన ఘటన ఆరోపణలను కూడా నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చారు. అయితే అసెంబ్లీ వద్ద కెటిఆర్, పాడి కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డిలు పోలీసులపై భౌతిక దాడికి దిగినట్లు స్పష్టంగా కనిపించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీ కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధించలేదని, 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వంలో అసెంబ్లీ రూపొందించిన నిబంధనలనే ఇప్పుడు తాము అమలు చేస్తున్నామని, టీషర్టులపై నినాదాలు ఉండటం వల్లే వాటిని సభలోకి అనుమతించలేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల కంటే ముందే ప్రతిపక్ష నేతలకు మర్యాదపూర్వకంగా ఫోన్ చేసే సంప్రదాయాన్ని తాను పాటిస్తున్నానని, ఆ మేరకు తాను మాజీ సిఎం, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావుకు కూడా ఫోన్ చేశానని, ఆరోగ్యం బాగుంటే సభకు హాజరవుతానని ఆయన చెప్పారని స్పీకర్ వెల్లడించారు. సభ గౌరవాన్ని కాపాడేందుకు ఎవరిపైనైనా కఠిన చర్యలు తీసుకునే పూర్తి రాజ్యాంగబద్ధ అధికారాలు స్పీకర్‌కు ఉంటాయని, అయినా తాము వెంటనే అలాంటి చర్యలు చేపట్టలేదని ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ అదానీ చిత్రాలున్న దుస్తులతో పార్లమెంటుకు వెళ్లిన విషయం తాను చూడలేదన్నారు.

### ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు..

## కెసిఆర్ వ్యూహంలో భాగమే

### టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కించపరిచేలా ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు చేయడం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వ్యూహంలో భాగమేనని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. తాతా మధు మాట్లాడింది బిఆర్ఎస్ స్క్రిప్ట్ అని, వ్యూహం రూపొందించి ఆయనను రంగంలోకి దించారని విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో మంగళవారం మహేశ్ కుమార్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ తాతా మధు వ్యాఖ్యలను కెసిఆర్ ఇప్పటి వరకు ఖండించకపోవడం ఆ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. కెసిఆర్ కంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే సామాజిక స్పృహ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. పదేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ దళిత స్పీకర్‌ను అవమానించినా ఖండించలేదని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. మహిళలు లేకుండానే కేబినెట్ నడిపిన కెసిఆర్‌కు సామాజిక న్యాయం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. పదేళ్లలో కెసిఆర్ ఎప్పుడూ అంబేద్కర్‌కు దండ వేయలేదని ఆరోపించారు. దళితుడైన స్పీకర్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే కారణంతోనే కెసిఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌లో ఉండటం చూడలేదని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించారని, రాజయ్యను అర్ధరాత్రి బర్తరఫ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దళితులకు అత్యున్నత పదవులు కల్పించామని తెలిపారు.


**త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల వడపోత పూర్తయిందని, రెండు మూడు రోజుల్లో పేర్లు ఖరారయ్యే అవకాశం ఉందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఖమ్మం–నల్గొండ–వరంగల్, హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు చెరో నాలుగు పేర్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రెండో నియోజకవర్గాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 22ఏ అంశాన్ని సమూలంగా సమీక్షించి సవరించాలని సిఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి కొండా సురేఖతో రెండోసారి వివాదాన్ని ముగించుకోవాలని తానే సూచించానన్నారు. తాను మంత్రి పదవి కోరుకోలేదని, ఇప్పటివరకు ఎవరూ తనను అడగలేదని మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలన్నదే కాంగ్రెస్ నేతలందరి ఆకాంక్ష అని ఆయన తెలిపారు.

### తాతా మధు వాఖ్యలపై శాసన మండలిలో

# రెండో రోజు వాడీ వేడి చర్చ








**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసన సభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వాఖ్యలపై శాసనమండలిలో రెండో రోజు కూడా వాడివేడిగా చర్చ జరిగింది. సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్‌ల అంశంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటన చేశారు. దీంతో సభలో ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు అసలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల వివరణ తీసుకోకుండానే ఎలా అరెస్ట్ చేస్తారని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిపై వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దౌర్జన్యం నశించాలని బిఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం ముందు నిరసన వ్యక్తం చేశారు. సభ వాయిదా పడే వరకు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. దళితులను అవమానించే సంస్కృతిని దేశ చరిత్రలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దళితుల పట్ల బిఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేక వైఖరినే అవలంబిస్తోందని పేర్కొన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు అడుగడుగునా మహిళలు, దళితులను అవమానపరుస్తున్నారని మండిపడ్డారు. సోమవారం జరిగిన సంఘటన బాధాకరమని, స్పీకర్ తల్లిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సభను కించపరచడమేనని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. తాతా మధు స్పీకర్‌పై చేసిన వాఖ్యలను ఒక వ్యక్తిపై కాకుండా, సభాపతి పదవికి అవమానం జరిగినట్లు భావించి పార్టీలకతీతంగా స్పీకర్‌కు మద్దతు తెలపాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెనుకబడిన జాతులకు చట్ట సభల్లో కనీసం మాట్లాడే అవకాశం కూడా బిఆర్ఎస్ ఇవ్వదని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్పీకర్‌పై తాతామధు చేసిన వాఖ్యలు యావత్ దళిత సమాజాన్ని, సభను అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ సభతో పాటు సభ్యులు ప్రజాస్వామ్యం గౌరవాన్ని పెంపొందించేలా ప్రవర్తించాలని సూచించారు. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ద్వారా బడుగు, బలహీన వర్గాల వర్గాలకు చెందిన వ్యక్తులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం బిఆర్ఎస్ నేతలకు మింగుడు పడడం లేదని విమర్శించారు. స్పీకర్‌పై తాతా మధు చేసిన వాఖ్యలు వంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే తాతా మధు సభ్యత్వం రద్దు చేయడంతో పాటు శాఖపరమైన చర్యలు చేపట్టాలని చైర్మన్‌ను కోరారు.

**బిఆర్ఎస్ తీరుపై మంత్రి సీతక్క ఫైర్..**

శాసనమండలిలో బిఆర్ఎస్ సభ్యుల వ్యవహారశైలిపై రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను దూషించిన వారిని సభ నుంచి బహిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. సభకు నైతిక విలువలు, సంప్రదాయాలు ఉన్నాయని, వాటిని సభ్యులంతా గౌరవించాలని సూచించారు. మహిళా పోలీసులపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అసభ్యంగా చేతులు వేసి నెట్టివేశారని సీతక్క ఆరోపించారు. ఈ వ్యవహారంపై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హరీష్‌రావు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. "ఏం.. స్పీకర్‌ను కొడతారా? నిన్న దూషించారు.. నేడు కొడతారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టి రాజకీయాలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ భూతులు మాట్లాడే వారిని సమర్థించే సంస్కృతి బిఆర్ఎస్ పార్టీది అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కొదండరాం మాట్లాడుతూ సోమవారం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని చైర్మన్‌ను కోరారు. తాతా మధు చేసిన వాఖ్యలు ఒక వ్యక్తి మీద కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలని అన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని అభివర్ణించారు.

## పోలీసుల వైఖరిపై కూడా చర్యలు

### బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాతా మధు, నవీన్‌రెడ్డి దాడిల ఘటన వ్యవహారంలో తప్పు చేసిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ శాసన మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి రెండు వర్గాలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరు తప్పు చేసినా వారిని రక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బిజెపి తరఫున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు తోసివేయడం, చీర లాగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం**
PIU డివిజన్, నల్లగొండ.
"షార్ట్ టెండర్ ప్రకటన"
Lr.No.: D3/Tenders/08/2026-27/DPRENLG తేదీ: 05.09.2026
నల్లగొండ జిల్లా, PIU నల్లగొండ డివిజన్ పరిధిలోని నల్లగొండ పట్టణంలో, మొత్తం **రూ.74.73 లక్షల** అంచనా వ్యయంతో చేపట్టే (9) పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించడమైనది. **దరఖాస్తుకు చివరి తేదీ:** 15.09.2026, **టెండర్ షెడ్యూల్స్ జారీ తేదీ:** 16.09.2026, **టెండర్ స్వీకరణ మరియు తెరిచే తేదీ:** 17.09.2026. మరిన్ని వివరాలకు **సంప్రదించవలసిన చిరునామా:** DPRE PIU నల్లగొండ కార్యాలయం, (ZPP కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, నల్లగొండ టౌన్.
సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్,
P.I.U.,:: నల్లగొండ.
DIPR R.O. No. : 9481-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.
షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-22/CMC/PTC-C-46/2026-27, తేది: 08.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ /ఇసివి | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- | --- |
| షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-22/CMC/PTC-C-46/ 2026-27, తేది: 08.09.2026 | 1 సంఖ్య - 20 మీ. x 10 మీ. కొలతలు మరియు 1.32 మీ. లోతు కలిగిన పోర్టబుల్ నీటి ట్యాంక్ సరఫరా మరియు ఏర్పాటు. | రూ. 15.00 లక్షలు | 08.09.2026 మ.3.00 గం.లకు | 11.09.2026 మ.3.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్ - 46. ఫోన్ నెం. 7331189492 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46,
ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 9530-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నార్సింగి సర్కిల్-45, ఎస్ఎల్‌పి జోన్ : సిఎంసి
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
NIT. No. 26/EE/CIR-45/SLPZ/CMC/1-1/2026-27 తేది: 08.09.2026

| NIT No. | పని కేటగిరి | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
| --- | --- | --- | --- | --- |
| 26/EE/CIR-45/ SLPZ/CMC/1-1 /2026-27, తేది: 08.09.2026 | ఎస్‌డబ్ల్యూఎం పని | రూ. 26.00 లక్షలు | 09.09.2026 మ.3.00 గం.లకు, 12.09.2026 ఉ.10.30 గం.ల వరకు | ఇఇ, సర్కిల్-45, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9063816949 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-45,
సిఎంసి.
DIPR R.O. No. : 9598-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కల్వకుర్తి**
నాగర్‌కర్నూల్ జిల్లా.
టెండర్ నోటీసు నెం: E1/KLKY/TENDER NOTICE-08/2026-27, తేదీ: 08.09.2026
కల్వకుర్తి మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాల మేరకు, సాధారణ నిధులు మరియు ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద వివిధ పనుల కోసం 'ఇ-ప్రొక్యూర్‌మెంట్' ప్లాట్‌ఫారమ్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.
'ఇ-ప్రొక్యూర్‌మెంట్' నోటీసు

| క్ర.సం. | పని పేరు | అంచనా వ్యయం (లక్షలలో) |
| --- | --- | --- |
| 1. | 2026-27 సాధారణ నిధి కింద కల్వకుర్తి మున్సిపాలిటీలో మటన్ మార్కెట్ షట్టర్ల నిర్వహణ, మరమ్మతులు మరియు షట్టర్ల లోపల నేల (bed) ఏర్పాటు పనులు. | 10.00 లక్షలు |
| 2. | 2026-27 సాధారణ నిధి కింద కల్వకుర్తి మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన వర్షపు నీటి కాలువల నుండి పూడిక తీత పనులు. | 5.00 లక్షలు |
| 3. | ప్రత్యేక అభివృద్ధి నిధి కింద నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డు నెం. 07లో వైశ్య శ్మశానవాటికకు ప్రహరీగోడ మరియు వేదిక నిర్మాణం. | 5.00 లక్షలు |
| 4. | ప్రత్యేక అభివృద్ధి నిధి కింద నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డు నెం. 09, సంజాపూర్‌లో ప్రజల వినియోగం కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం. | 5.00 లక్షలు |

| | | |
| --- | --- | --- |
| 1. | మొత్తం పనులు | నాలుగు |
| 2. | అంచనా విలువ | రూ. 25.00 లక్షలు |
| 3. | బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 09.09.2026 ఉదయం 11:30 గంటలకు |
| 4. | బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 18.09.2026 సాయంత్రం 5:00 గంటలకు |

మరిన్ని వివరాలను "www.eprocurement.gov.in" అనే ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు. **బిడ్లను ఆహ్వానిస్తున్న అధికారి:** కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం; సెల్ నెం. 9110540243, 7330690590.
సం/- కమిషనర్
కల్వకుర్తి మున్సిపాలిటీ
DIPR R.O. No. : 9559-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

# కాంగ్రెస్‌లో పదవుల కోసం నేతల పట్టు

నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు
ఊహించని సుధారాణికి
'కుడా' చైర్‌పర్సన్ నియామకం



**ప్రజాపక్షం/హనుమకొండ:** కాంగ్రెస్‌లో పదవుల కోసం నేతలు పట్టు పడుతున్నారు. ఓటరు సమగ్ర జాబితా సవరణ పూర్తికాగానే పదవులను భర్తీ చేస్తామని ప్రకటించడంతో ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులతో పాటు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్ల పదవుల్లో తమకు ఈ దఫా అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం రెండున్నర ఏళ్లు పూర్తి కావడంతో ఇప్పటివరకు పదవుల కోసం చూస్తున్న నేతలు కొత్తగా భర్తీ చేసే నామినేటెడ్ పోస్టులలో తమకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ నేతల ద్వారా పదవుల కోసం పైరవీలు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమకు అనుకూలమైన వారికి పదవులు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పార్టీ కోసం పదేళ్ల పాటు పనిచేసిన నేతలు ప్రభుత్వం ఏర్పడగానే నామినేటెడ్ పదవులు వస్తాయని ఆశించారు. నేతల మీద నమ్మకం పెట్టుకున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు మంత్రి పదవులు, ఒక విప్‌తో పాటు ప్రభుత్వ సలహాదారు, ఆరు కార్పొరేషన్ చైర్మన్ల పదవులు ఉమ్మడి జిల్లా నేతలను వరించాయి. జిల్లాస్థాయిలో మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ సంస్థల చైర్మన్ పదవులలో కొంత మంది నేతలకు అవకాశం ఇచ్చారు. రాష్ట్రస్థాయి పదవులతో పాటు జిల్లా స్థాయిలో కీలకమైన మార్కెట్ కమిటీలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు, డైరెక్టర్లను భర్తీ చేయనున్నారు. ఇప్పటికే వీటికి సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, సీనియర్ నేతలు ఆయా నియోజకవర్గాలకు అనుగుణంగా పదవుల కోసం పేర్లను సిఫారసు చేశారు. నామినేటెడ్ పదవుల్లో తమ అనుచరులకు అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కూడా 90కి పైగా ఉన్నాయి. వీటన్నింటిని భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టడంతో ఎక్కువ మంది నేతలు పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యే వర్గం వారే కాకుండా అసమ్మతి నేతలు పోటీ పడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమ వర్గం వారికే సిఫారసు చేసి మిగతా వారిని పట్టించుకోవడం లేదని అధిష్టానం దృష్టికి తీసుకవెళ్లారు. పార్టీ కోసం పనిచేసేవారికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.


**కాంగ్రెస్‌లో ఎవరికి వారే ప్రయత్నాలు..**

ఉమ్మడి జిల్లా నుంచి మూడో మంత్రి పదవిని ఆశించిన ఎమ్మెల్యేలు ఆ అవకాశం లేకపోవడంతో కార్పొరేషన్ చైర్మన్లు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పదవులపై దృష్టి పెట్టారు. ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్న కొండా సురేఖ మంత్రిగా బర్తరఫ్‌కు గురయ్యారు. ఆమె స్థానంలో పలువురు ఎమ్మెల్యేలు తమ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక రాష్ట్రస్థాయి కీలక కార్పొరేషన్‌లు అయిన సివిల్ సప్లై, ఆర్టీసీ చైర్మన్ పదవులపై దృష్టి పెట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఒక్కరిద్దరు ఎమ్మెల్యేలు రాష్ట్ర సలహాదారు పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి పదవులు రాని నేతలు ఈ దఫా కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల పరిధిలో పదవుల కోసం సీనియర్లు పోటీ పడుతున్నారు. ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వాలని కోరుతున్నారు.

**'కుడా' చైర్ పర్సన్‌గా సుధారాణి నియామకం**

ఉమ్మడి జిల్లాలోని కుడా, డీసీసీబీ అధ్యక్షుల పదవుల కోసం పోటీపడుతుండగా ఊహించని విధంగా మాజీ మేయర్ గుండు సుధారాణికి అవకాశం లభించింది. కొండా సురేఖ మంత్రిగా ఉద్వాసనకు గురికావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన గుండు సుధారాణిని కుడా చైర్ పర్సన్‌గా నియమించారు. ఇక గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తమకు నామినేటెడ్‌లో అవకాశం ఇవ్వాలని సీనియర్ నేతలు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ గా పని చేసిన ఇనగాల రెండోవిడత అవకాశం ఇవ్వాలని కోరినా దక్కలేదు. సామాజిక సమీకరణాలకు అనుగుణంగా నియామకాలు జరుగుతున్నాయి. డీసీసీబీ, కార్పొరేషన్ చైర్మన్ వంటివి కీలకమైనవి కావడం, నిధులు ఖర్చు పెట్టే అవకాశం ఉండటంతో ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. ఒకేసారి సీనియర్ నేతలంతా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తుండటంతో ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు సీఎం, పీసీసీసీ అధ్యక్షుని దృష్టికి తీసుకువెళ్తున్నారు. సమస్యను పరిష్కరించేందుకు త్వరగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. త్వరలో జరిగే పోస్టుల భర్తీలో ఎవరికి అవకాశం వస్తుందో ఎవరికి చైర్మన్ పదవులు వస్తాయో తేలే అవకాశం ఉంది.

## సభాధ్యక్ష స్థానంలో హుందాగా సభను నడిపిన కడియం



**ప్రజాపక్షం/జనగామ:** మాజీ మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా, ఎంపిగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం శాసన సభలో స్పీకర్ హోదాలో కూర్చొని సభను హుందాగా నిర్వయించడం అందరిని అకట్టుకుంది. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరి సభను నిర్వహించే అవకాశం వచ్చిన నేపథ్యంలో తన అనుభవంతో చాకచక్యంగా నిర్వయించారు. సభా నియమావలికి కట్టుబడి ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యులకు తగిన సమయాన్ని ఇస్తూ సభను ఎంతో గౌరవ ప్రధంగా నడిపించారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహ బిఆర్ఎస్ నాయకులుతాత మధు, నవీన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బిఆర్ఎస్ నాయకుల ప్రవర్తనకు బాధ్యత తీసుకొని కేసీఆర్ క్షమాపన చెప్పాలని ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. మాజీ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా తన అనుభవాన్ని రంగరించి సభాధ్యక్ష సాథనంలో సామర్థ్యం, క్రమశిక్షణతో ఉత్తమ పార్లమెంటేరియన్‌ను సభను నిర్వయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, పలువురు మంత్రులు, ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

## కలెక్టర్లకు సమ్మె నోటీసు అందించిన మిల్లర్ల సంఘం



**ప్రజాపక్షం/ములుగు:** కేఎంఎస్ 2025–26 ఫ్రెష్ సీజన్‌ను సంబంధించి రైస్ మిల్లులపై ప్రభుత్వం చేపడుతున్న ఫిజికల్ వెరిఫికేషన్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైస్ మిల్లర్లు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ఫిజికల్ వెరిఫికేషన్‌లో షార్ట్ ఫాల్ కనిపిస్తే 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ విధించడం వలన మిల్లర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు బాదం ప్రవీణ్ తెలిపారు. సార్టెక్స్ ప్రక్రియ, తొమ్మిది నెలల పాటు ధాన్యం నిల్వ ఉండడంతో తేమ, బరువు తగ్గడం, డిస్కలర్, డ్యామేజ్ వంటి కారణాలతో ధాన్యం బియ్యం మధ్య సుమారు 10 శాతం వేరియేషన్ ఏర్పడుతోందని పేర్కొన్నారు. నష్టపోయిన ధాన్యాన్ని లిక్కర్, ఇథనాల్ పరిశ్రమలకు విక్రయించి ఇచ్చే మొత్తంతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను చెల్లిస్తున్నామని వివరించారు. ఈ పరిస్థితుల్లో షార్ట్‌ఫల్ పేరుతో పెనాల్టీలు విధిస్తే రాష్ట్రంలోని రైస్ మిల్లులు మూతపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిజికల్ వెరిఫికేషన్ నిలిపివేయకపోతే మిల్లింగ్, ప్రభుత్వానికి బియ్యం డెలివరీలను నిలిపివేస్తామని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం ఏకగ్రీవంగా తీర్మాణించగా, అందులో భాగంగా ములుగు కలెక్టర్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. అక్టోబర్ 30 వరకు మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేసి బియ్యం డెలివరీలు చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ల సంఘం జనరల్ సెక్రటరీ సహోదర్‌రెడ్డి, కోశాధికారి మోహన్, అసోసియేషన్ సభ్యులు, మిల్లర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గూండాల్లా ప్రవర్తించారు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** శాసన సభ గేటుముందు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు గూండాలను మైమరిపిస్తోందని టిపిసిసి ఎస్‌టి సెల్ రాష్టర కోఆర్డినేటర్ గుగులోతు వెంకట్‌నాయక్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మదర్ తెరిసా సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పిలుపుమేరకు తెలంగాణ శాసనసభ స్పీకర్‌ను బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు అవమానించడంతో దానికి నిరసనగా, పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం,ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంట్‌నాయక్‌తోపాటు పలువురు వక్తలు మాట్లాడుతూ సోమవారం శాసనసభ గేటు ముందు బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నల్ల టీ షర్టులు ధరించి శాసనసభలోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా దానికి పోలీసులు అడ్డు చెప్పడంతో రెచ్చిపోయిన టిఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు వీధి గుండాల్లాగా మహిళా శాసనసభ్యులను ముందుకు నెడుతూ పోలీసులపై తిరగబడుతూ పోలీసుల గల్లాలు బట్టి నెట్టి వేస్తూ అనైతికంగా ప్రవర్తించారని ఆరోపించారు. అంతేకాకుండా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు ని వారి తల్లిని అవమాన పరుస్తూ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు యావత్ తెలంగాణ సమాజం తల దించుకునేలా ఉందని అన్నారు. తెలంగాణ డిప్యూటీ సీఎంగా ఉన్న రాజయ్యను ఎలాంటి కారణం లేకుండా తొలగించి అవమానానికి గురి చేశారని, అంతేకాకుండా బట్టి విక్రమార్క, రవీంద్ర నాయక్, కడియం శ్రీహరి, కొండా సురేఖ లాంటి సీనియర్ ప్రజాప్రతినిధులను అవమానపరిచిన చరిత్ర గల పార్టీ బి ఆర్ ఎస్ పార్టీఅని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాస్ గౌడ్, ఎడ్ల రమేష్ ,ఒడి అరుణ్, శ్రీనివాస్, భూక్య లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 01/10/2026 నాటికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేసేందుకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ సర్ 2026 ప్రక్రియకు సంబంధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు గడువును 17/08/2026 నుంచి 07/10/2026 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. గతంలో ఈ గడువు 16/09/2026తో ముగియాల్సి ఉండేదని తెలిపారు. అదేవిధంగా నోటీసుల జారీ, క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియ 17/08/2026 నుంచి 05/11/2026 వరకు కొనసాగుతుందని తెలిపారు. గతంలో ఈ ప్రక్రియకు 15/10/2026 వరకు గడువు ఉండేదని పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితా 09/11/2026న ప్రచురించనున్నట్లు తెలిపారు. గతంలో తుది జాబితా ప్రచురణకు 19/10/2026 తేదీగా నిర్ణయించినప్పటికీ, తాజాగా దానిని 09/11/2026కు మార్చినట్లు వెల్లడించారు. 01/10/2026 నాటికి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హత కలిగిన పౌరులందరూ ఈ పొడిగించిన గడువును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు తమ పేరు ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడం, ఇప్పటికే ఉన్న వివరాల్లో మార్పులు, చేర్పులు లేదా అవసరమైన సవరణలు చేసుకునేందుకు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్ల జాబితాను సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు.

## అక్రమ కేసులు ఎత్తివేయాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మాజీ ఎమ్మెల్యే ఇంటిపై పనిచేస్తూ భవన నిర్మాణ కార్మికులు భూముల వీరన్న మరియు రాజస్థాన్ వలస కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మరణించగా నాడు న్యాయం చేయాలని అడిగితే అక్రమంగా మాజీ ఎమ్మెల్యే కేసులు పెట్టించిన కేసులో మంగళవారం సిపిఐ. ఏఐటియుసి, కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి నేతలు కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ మాట్లాడుతూ అక్రమంగా మాజీ ఎమ్మెల్యే కేసులు పెట్టించాడని, కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నాడు పోరాటం చనిపోయిన కార్మికులకు న్యాయం చేయమని అడిగి ఆందోళన చేస్తే అక్రమంగా కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని లేకపోతే ఆందోళన చేస్తామని డిమాండ్ చేశారు. కోర్టుకు హాజరైన వారిలో శంకర్, పెద్దులు, ఇంద్రారెడ్డి, చంద్రమౌళి, బిక్షపతి, దాసు, రవి, మధు, యాకయ్య కోర్టుకు హాజరైనవారిలో ఉన్నారు.

## దళిత, ఆదివాసీల హక్కుల కోసం సమష్టి పోరాటం

ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్:** దళితులు, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, సంక్షేమం కోసం పార్లమెంట్‌లోనూ, వెలుపలా సమష్టిగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎంపీలు నిర్ణయించినట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. న్యూఢిల్లీలోని ఇందిరా భవన్ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ వర్గాలను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. దళితులు, ఆదివాసీలపై దాడులు పెరుగుతున్నా.. వారి సంక్షేమానికి కేటాయించే నిధులను తగ్గించడం ఆందోళనకరమన్నారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ఎన్డీఏ ప్రభుత్వం సవతి తల్లి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో ఎస్సీ, ఎస్టీ సమస్యలను పార్లమెంట్‌లో బలంగా లేవనెత్తడంతో పాటు.. అవసరమైతే ప్రజల మధ్యకు వెళ్లి పోరాటం చేస్తామని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

**హల్ద్వానీ ఘటనపై ఆగ్రహం**

మల్లికార్జున ఖర్గే పర్యటన అనంతరం హల్ద్వానీలో చోటుచేసుకున్నట్లు వెల్లడైన 'శుద్ధీకరణ' ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించింది. ఇది దళితుల ఆత్మగౌరవానికే కాకుండా సమానత్వం, గౌరవం, అంటరానితనం నిర్మూలన వంటి రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.ఘటనకు బాధ్యులపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆర్ఎస్ఎస్, ఇతర మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ అంశంపై రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి సంయుక్త వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీల గౌరవం, హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఎంపీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు.

## రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి: అదనపు కలెక్టర్



**ప్రజాపక్షం/వరంగల్:** జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె. కిషోర్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెన్నారావుపేట మండలం తిమ్మరాయునిపహాడ్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు జరిగిన సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు, లోపాలకు తావులేకుండా నిబంధనల ప్రకారం పకడ్బందీగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వే పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే ప్రక్రియను నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ రీసర్వే లో సంబధిత శాఖల అధికారులు, సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం

శాస్త్రీయ అధ్యయనాలు, భద్రతా ప్రమాణాల
సమగ్ర పరిశీలన అనంతరమే నిర్ణయం
కలెక్టర్ బోర్ఖడే సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పాలంపేట ప్రత్యేక అభివృద్ధి ప్రాధికార సంస్థ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటాపూర్ మండల పరిధిలో చేపడుతున్న ఓపెన్‌కాస్ట్ మైనింగ్ పనుల వలన కాకతీయ రుద్రేశ్వర రామప్ప దేవాలయానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఏర్పాటుకు నిరభ్యంతర ధృవీకరణ పత్రం మంజూరు అంశాలపై కమిటీ సభ్యులతో సమగ్రంగా చర్చించారు. ఓపెన్‌కాస్ట్ మైనింగ్‌కు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల అధికారులు తమ పరిధిలోని అభిప్రాయాలను వెల్లడించారు. రామప్ప దేవాలయ పరిరక్షణ, పర్యావరణం, శాస్త్రీయ అధ్యయనాలు, నిరంతర పర్యవేక్షణతో పాటు సంబంధిత నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై విస్తృతంగా చర్చించారు. సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేశామని, అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సింగరేణి భూపాలపల్లి జిఎం రాజేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ జిఎం జి దేవేందర్, పర్యావరణ విభాగం జిఎం పి సైదులు, ఎక్స్‌ప్లోరేషన్ జిఎం పంకజ్ కులశ్రేష్ఠ, దేవాలయ శాఖ సహాయ కమిషనర్ ఆర్ సునీత, పురావస్తు శాఖ సహాయ సంచాలకురాలు బి గంగాదేవి, భారత పురావస్తు సర్వేక్షణ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్లు అజిత్, ఎంఎస్, వంశీకృష్ణ జ్యోతి, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ప్రతినిధులు జె శ్రీధర్‌రావు, ఆచార్య ఎ పాండురంగారావు, పాలంపేట సర్పంచ్ సిహెచ్ రాజు, జిల్లా పంచాయతీ అధికారి కె వెంకయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి రజని, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం శివాజీ, ఇరిగేషన్ ఈఈ నారాయణ, వెంకటాపూర్ తహసీల్దారు గిరిబాబు, ఎంపిడిఓ రాజు, సంబంధిత అధికారులు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోదాంలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లాకు సంబంధించి సుబేదారి రెడ్ క్రాస్ సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మంగళవారం అదనపు కలెక్టర్ ఎన్. రవి, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు.భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టే త్రైమాసిక తనిఖీలో భాగంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత, స్ట్రాంగ్‌రూమ్‌ల పరిస్థితి, స్ట్రాంగ్ రూముకు వేసి ఉన్న సీళ్లను క్షుణ్ణంగా కలెక్టర్ పరిశీలించారు. భద్రతకు సంబంధించిన రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా నిరంతర నిఘా వ్యవస్థలో భాగంగా గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలు పకడ్బందీగా అమలుకు చర్యలు చేపట్టాలని తెలిపారు.స్ట్రాంగ్‌రూమ్‌ల సీళ్లు, తాళాలు, ప్రవేశ–నిష్క్రమణ విధానం, సీసీ కెమెరాల నిఘా వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలలో కాంగ్రెస్ పార్టీ నుండి ఈ.వి. శ్రీనివాసరావు, బీఆర్ఎస్ నుండి బి. ప్రవీణ్ కుమార్, బిజెపి నుండి నర్మెట శ్రీనివాస్, టిడిపి నుండి కుసుమ శ్యాంసుందర్, వైఎస్ఆర్సిపి నుండి నాగబెల్లి రజినీకాంత్, బీఎస్పీ నుండి అంబాల ప్రశాంత్, సయ్యద్ ఫైజుల్లా, సిపిఎం నుండి జి. వెంకట్, పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/గణపురం:** విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఏఐటియూసి నాలుగవ తెలంగాణ రాష్ట్ర మహాసభలు డిమాండ్ చేశాయి. కరీంనగర్‌లో జరుగుతున్న మహాసభల్లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ హెచ్...64 చెల్పూర్ కేటిపిపి రీజినల్ కమిటీ అధ్యక్షుడు కోల శ్యామ్ ఆధ్వర్యంలో పలు తీర్మాణాలను ప్రవేశపెట్టారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని, వారి సర్వీస్ నిబంధనలు, సీనియారిటీ, పదోన్నతులు, ఉద్యోగ భద్రతకు స్పష్టత కల్పించాలని కోరారు. ఈ మేరకు తీర్మాణ పత్రాన్ని ఆర్టిజన్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజుకు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విద్యుత్ సవరణ చట్టం....2025ను ఉపసంహరించుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది. విద్యుత్ రంగంలో ప్రయివేటీకరణను ప్రోత్సహించే విధానాలను విడనాడి ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాలని కోరింది. కార్మికుల హక్కుల పరిరక్షణకు అన్ని సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చింది. కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరింత ఐక్య ఉద్యమాలు చేపడతామని కెటిపిపి రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిగినేని ధర్మారావు తెలిపారు.

## డిబిటి ప్రక్రియను వేగవంతం చేయాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజా రెడ్డి

**ప్రజాపక్షం/ వరంగల్ :** జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన మెడికల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, లక్ష్యాల సాధన, ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సమీక్షించారు. ముఖ్యంగాక్షయ నియంత్రణ కార్యక్రమంలో పెండింగ్ కేసుల గుర్తింపు, చికిత్స, కేసుల నమోదు, ఫాలోఅప్‌ను మెరుగుపరచాలని సూచించారు. పోషకాహార సహాయానికి సంబంధించిన డిబిటి ప్రక్రియను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో ప్రయోజనం అందేలా చూడాలని ఆదేశించారు. అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు తమ పరిధిలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమగ్రంగా పర్యవేక్షించాలని సూచించారు. క్షయవ్యాధి అనుమానితుల ఎక్స్ రే స్క్రీనింగ్ సేవలకు సంబంధించిన ఆన్‌లైన్ అప్‌డేట్లు సక్రమంగా చేయాలని ఆదేశించారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఐడిఎస్‌పి కార్యక్రమంలో రోజువారీ డేటా ఎంట్రీ, వ్యాధుల పర్యవేక్షణ, నివేదికలను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణ కొరకు జ్వర సర్వేలు, అవసరమైన నమూనాల సేకరణ, నివేదికలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అసంక్రమిక వ్యాధుల కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా స్క్రీనింగ్‌ను వేగవంతం చేసి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స అందించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలను వంద శాతం నమోదు చేయాలని, నాలుగు ఎఎన్‌సి చెక్ అప్‌లు చేయించాలి. ప్రభుత్వ ప్రసవాలు, సాధారణ ప్రసవాలను పెంచాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ ట్రాన్స్‌పోర్ట్ సేవలకు 102 వాహనం వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు మెరుగైన సమయానుకూలమైన వైద్య సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, డిపిఓ అర్చన, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్న కుమార్, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, జిల్లాలోని అందరు వైద్య అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వం బకాయిలు విడుదల చేయాలి

ప్రైవేటు విద్యా సంస్థల బంద్‌కు సంఘీభావం

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజీత్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేసి విద్యార్థుల చదువులు సాగేలా సహకరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.షాహిద్ అధ్యక్షతన రజబ్ అలీ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఏడేళ్లుగా రూ.11వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, ఇది విద్యార్థుల చదువులపై ప్రభావం చూపుతోందన్నారు. బకాయిల కోసం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు చేపట్టనున్న బంద్‌కు ఎఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు, సంఘీభావం ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా బకాయిల విడుదలకు చొరవచూపకుంటే విద్యార్థుల చదువులు అంధకారంలో పడతాయని, వారు చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, మర్మం ఉమామహేశ్వర్ జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్యామల హాసిని స్వరాంజలి సాత్విక తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్యను పరిష్కరించండి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సలాం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** త్రీటౌన్ ప్రాంతంలో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మహ్మద్ సలాం కోరారు. మంగళవారం సిపిఐ ఖమ్మం త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్ స్వగృహంలో ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహ్మద్ సలాం మాట్లాడుతూ త్రీటౌన్ ప్రాంతంలో మంచినీళ్లు రాక వారం రోజులు గడుస్తున్నా పట్టించుకునే వారు లేరన్నారు. కార్పొరేటర్ల పదవీ కాలం ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ల పాలనలో సమస్యలను పరిష్కరించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో కమిషనర్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్ మాట్లాడుతూ వర్షాలు వచ్చినప్పుడు త్రీటౌన్ ప్రాంతంలోని పొట్టి శ్రీరాములు రోడ్డు, కాల్వొడ్డు, శివాలయం నుంచి వ్యవసాయ మార్కెట్ మధ్య గల ప్రధాన రహదారి పై వరద, మురుగు నీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సహాయ కార్యదర్శులు భూక్యా రవీందర్, నామా విజయ్‌కుమార్, యర్రా ఉపేందర్, నిమ్మల శ్రీను, ఆకుల రమేష్, దామళ్ల రాము, నూనె నందు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి

సిపి సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** గణేష్ మండపాల ఏర్పాటు, నిర్వాహణకు ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు ముందస్తుగా 'పోలీస్ పోర్టల్ టిఎస్‌పోలీస్ జివోవి.ఇన్' ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ సూచించారు. తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్ 2026లో గణేష్ విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన, ఉరేగింపునకు సంబంధించిన ఆన్‌లైన్ అప్లికేషన్ అందుబాటులో ఉంచమన్నారు. మండపాల వివరాలు ముందుగానే ఆన్‌లైన్‌లో పొందుపరచడం వలన ప్రాంతాలవారిగా అవసరమైన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన మార్గాల ప్రణాళిక, భద్రతా చర్యలు సమర్ధవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. గణేష్ నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసుశాఖకు నిర్వాహకులు పూర్తి సహకారం అందించాలని పోలీసుకమిషనర్ కోరారు.



## దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.దేవి మానస

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** దివ్యాంగులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ)కార్యదర్శి పి.దేవి మానస తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో ప్రభుత్వ దివ్యాంగ బాలుర వసతి గృహంలో దివ్యాంగుల కోసం న్యాయ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి పి.దేవి మానస పాల్గొని దివ్యాంగులకు అందుబాటులో ఉన్న చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగజన్ కౌశల్ వికాస్ పథకం ద్వారా నైపుణ్యాభివృద్ధి అవకాశాలను, దివ్యాంగజన్ రోజ్ ఘర్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ద్వారా దివ్యాంగులకు కల్పించిన హక్కులు, రక్షణలు, సమాన హక్కుల అవకాశం గురించి వివరించారు. దివ్యాంగుల విద్యా , ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సామాజిక భద్రతకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన దివ్యాంగులు తమ హక్కులను తెలుసుకుని సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, డిఎల్ఎస్ఎ ప్యానెల్ న్యాయవాదులు, సిబ్బంది, దివ్యాంగులు పాల్గొన్నారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుపై ఎఎఐ కసరత్తు

ప్రతిపాదిత స్థలాల్లో రెండో రోజూ సాంకేతిక పరిశీలన

తిమ్మంపేట పరిశీలనలో కలెక్టర్ అంకిత్ శ్రీ





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు కసరత్తు వేగం పుంచుకుంది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా(ఎఎఐ) సాంకేతిక బృందం రెండు రోజులుగా జిల్లాలోని ప్రతిపాదిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తోంది. మంగళవారం ములకలపల్లి మండలం తిమ్మంపేటలో జరుగుతున్న పరిశీలనను కలెక్టర్ అంకిత్ ఎఎఐ బృందంతో కలిసి పర్యవేక్షించారు. సీతంపేట సుజాతనగర్ దుమ్ముగూడెం చాప్రాళ్లపల్లి దమ్మపేటపాల్వంచ పెనగడప ప్రాంతాలను ప్రతిపాదిత స్థలాలుగా గుర్తించారు. ఆయాప్రాంతాల్లో భూమి స్వభావం ఎత్తుపల్లాలు కొండలు అటవీ ప్రాంతాలు నీటి ప్రవాహ మార్గాలు రహదారులు రైల్వేమార్గాలు విద్యుత్ లైన్లు రన్‌వే దిశ విమానాల అప్రోచ్ మార్గాలను బృందం పరిశీలించింది. గతంలో సుమారు 667 ఎకరాల విస్తీర్ణాన్ని పరిశీలించినప్పటికీ రన్‌వే అప్రోచ్ ప్రాంతం ఇతర అనుబంధ సౌకర్యాల కోసం అదనపు భూమి అవసరంపై కూడా అధ్యాయనం సాగుతోంది. రైలుమార్గాలు, చిన్నపాటి కొండలు అటవీ ప్రాంతాలు నీటి ప్రవాహ మార్గాలు విమానాశ్రయ నిర్మాణంపై చూపే ప్రభావాన్ని సాంకేతికంగా అంచనా బృందం అంచనా వేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్నది ప్రాథమిక సాంకేతిక పరిశీలన మాత్రమేనని ఏ ప్రాంతాన్ని తుది విమానాశ్రయ స్థలంగా ఎంపిక చేయలేదని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎఎఐ సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక పర్యావరణ భౌగోళిక అంశాలు సంబంధిత శాఖల అనుమతులు భవిష్యత్ అనుసంధానం తదితర అంశాల ఆధారంగా తుదినిర్ణయం తీసుకోనున్నారు. పరిశీలనలో గుర్తించిన అంశాలను ఎఎఐ సభ్యుల కలెక్టర్‌కు వివరించారు. అసరమైన రెవెన్యూ సర్వే అటవీ రహదారులు రైల్వే భౌగోళిక వాతావరణ సమాచారాన్ని ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ) బృంద సభ్యులకు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

### భూముల రీ సర్వే మూడు రోజుల్లో పూర్తి చేయాలి

భూముల రీ సర్వేను మూడు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పాల్వంచ మండల పరిధిలోని భోజ్యా తండా సర్వే నెం.77లో జరుగుతున్న సర్వే పనులను ఆయన మంగలవారం పరిశీలించారు. రోవర్ పరికరాలతో భూముల చుట్టు కొలతలు హద్దులు విస్తీర్ణాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. భోజ్యా తండాలో మొత్తం 458 ఎకరాల్లో రీ సర్వే చేపట్టాల్సి ఉండగా ప్రస్తుతం 88 ఎకరాల్లో పనులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు పట్టాలు పాస్‌పుస్తకాలు రిజిష్టేషన్ పత్రాలు అందించి భూమి హద్దులను చూపిస్తూ రీ సర్వేకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దారా ప్రసాద్, సర్వేయర్లు వెంకన్న కళ్యాణ్ మధు వంశీ కవిత జిపిఓ రాధా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి

దళిత నేత గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు కాంగ్రెస్ నేతల ఆగ్రహం



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** దళిత నేత, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తాతా మధును వెంటనే పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. దళిత నాయకుడిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఇలాంటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సునీల్, గ్రామ సర్పంచ్ కేస్లీ, సీనియర్ నాయకులు గుమ్మడి శ్రీను, దామోదర్, అచ్చం నాగరాజు, శ్రీరాములు, వినయ్, గాంధీ, యాకూబ్, ఏలియా తదితరుల తోపాటు పలువురు యువకులు పాల్గొన్నారు.

## కేసు పెడతారట!

'ప్రజాపక్షం'కు పిట్ట బెదిరింపులు

**ప్రజాపక్షం/ఖమ్మం :** మీ వార్తలపై కేసులు పెడతాం. న్యాయస్థానాలకు లాగుతామంటూ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కొందరు 'ప్రజాపక్షం' విలేకరులను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు. మంగళవారం నాటి ప్రజాపక్షం సంచికలో ఎక్సైజ్ అసోసియేషన్ పేరుతో వసూళ్ల దందా అనే వార్తను ప్రచురించడం జరిగింది. ఇటీవల ఎక్సైజ్ శాఖలో అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. దీనికి బాధ్యతల విషయంలో పోటీ రావడంతో ఎన్నికలు కూడా నిర్వహించారట. మొత్తంగా అసోసియేషన్ బాధ్యతల్లోకి వచ్చిన ఇద్దరు ఎక్సైజ్ ఉద్యోగులు మద్యం దుకాణ యజమానుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ బలవంతపు వసూళ్ల విషయాన్ని కొందరు మద్యం వ్యాపారులు ప్రజాపక్షానికి తెలియజేయడంతో దీనిపై వార్త ప్రచురించడం జరిగింది. బుధవారం దీనికి సంబంధించి ఆ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజాపక్షం విలేకరులకు ఫోన్ చేసి వార్త ఎలా రాశారు. మీ మీద కేసు పెడతామంటూ బెదిరింపులకు దిగారు. మా దగ్గర ఆధారాలు ఉన్నాయి అనగానే 'అన్న' అంటూ సంబోధించడం మొదలుపెట్టారు. ఎక్సైజ్ అసోసియేషన్ పేరుతో జరిగిన ఈ వసూళ్లకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరపాల్సి ఉంది. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఏమి చేసినా చర్యలు ఉండవన్న భావన బలపడింది. ఇటీవల బూర్గంపాడు ఘటన తర్వాత ఎక్సైజ్ శాఖకు సంబంధించిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈ క్రమంలో జరిగిన ఈ వసూళ్ల దందాకు సంబంధించి ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మద్యం వ్యాపారులు కోరుతున్నారు.



## నిబద్ధతగల కమ్యూనిస్టు బక్కిరెడ్డి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/చింతకాని :** పార్టీ ఇచ్చిన పిలుపు తూచా తప్పకుండా అమలు చేసే అవులూరి బక్కిరెడ్డి నిబ్బద్ధత గల కమ్యూనిస్టు అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. కోమట్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు అవులూరి బక్కిరెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా సోమవారం రాత్రి బక్కిరెడ్డి స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కోమట్లగూడెం అభివృద్ధిలో బక్కిరెడ్డి పాత్ర ఎనలేనిదన్నారు. నిత్యం ప్రజాసమస్యలే ఎజెండాగా పనిచేసేవాడన్నారు. పార్టీ కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందుల్లో ఉంటే వారిని వెంటబెట్టుకుని నాయకుల వద్దకు తీసుకువచ్చి వారి సమస్యలు పరిష్కరించేవాడన్నారు. బ్రతికినంతకాలం ఎర్రజెండాని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడటానికి బక్కిరెడ్డి పాత్ర ఎనలేనిదన్నారు. మాజీ సర్పంచ్ వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డికి ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్ళేవాడన్నారు.పార్టీ గ్రామశాఖ కార్యదర్శిగా, మండలకార్యవర్గ సభ్యులుగా పార్టీ ఎదుగుదలకు చేసిన కృషి మరువలేనిదన్నారు. బక్కిరెడ్డి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వ్యవసాయకార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేముల జానకిరాములు, శాఖ కార్యదర్శి అవులూరి రామిరెడ్డి, నాయకులు వేమిరెడ్డి కృష్ణారెడ్డి, అవులూరి పెద్దరామిరెడ్డి, శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు అవులూరి వెంకట్రామిరెడ్డి, రాయల పెద్ద శ్రీను, నాగభూషణం, బక్కిరెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి : ఎస్‌పి రోహిత్‌రాజ్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గణేష్ ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లఘిస్తే చర్యలు తప్పవని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భక్తి శ్రద్దలతో సోదర భావంకతో శాంతియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరగాలన్నారు. ప్రజల భధ్రత, శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం వాటిల్లకుండా ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మండపాల నిర్మాణం, మైక్ వంటి వాటిపై ముందుగా పోలీస్ అనుమతి తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ రూపొందించిన పోర్టలో సంబంధిత వివరాలు నమోదు చేయాలని తెలిపారు.

## వెబ్ డెవలపర్ పోస్టులకు ఆరుగురు ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** బెంగళూరు కేంద్రంగా నడపబడుతున్న ప్రముఖ సంస్థ అశ్రిత్ గ్రూప్‌లో ఎస్‌బిఐటి కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు వెబ్ డెవలపర్లుగా ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ లేఆఫ్‌ల కాలంలో కూడా తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. దొరికిన అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి.ధాత్రి మాట్లాడుతూ ఈ కామర్స్ విభాగంలో అశ్రిత ఫ్రెష్, అశ్రిత్ ఇన్ఫోటెక్, సన్‌టెక్ సోల్యూషన్ వంటి ఐటి, అనుబంధ సంస్థల గ్రూపుగా కలిగిన అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం తమ కళాశాలకు గర్వకారణమన్నారు. వెబ్ డెవలపర్ నియామకాలకు గాను మొదట ఆన్‌లైన్ అస్సెస్‌మెంట్, టెక్నికల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కర్షన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ద్వారా ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షికాదాయం రూ.3.8 లక్షల నుంచి రూ.4.5 లక్షలు అందుతుందని వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ప్రిన్సిపాల్ డా॥ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 2019లో స్థాపించబడి ఐటి, బిజినెస్ సోల్యూషన్ ఈ కామర్స్ వంటి విభాగాల్లో సేవలు అందిస్తున్న అశ్రిత్ గ్రూప్‌లో తమ విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. తమ కళాశాలలో నిరంతరం కోడింగ్, అప్టిట్యూడ్, ఎంప్లాయబిలిటి స్కిల్స్ పై అందిస్తున్న శిక్షణ ఉద్యోగాల సాధనకు తోడ్పాడుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అశ్రిత్ గ్రూప్ సిఈవో ఎన్. ఫారూఖ్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. పల్లవి, సీనియర్ హెచ్‌ఆర్ ఆర్. సంకీర్తన, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో ఎన్. సవిత, జి. ప్రభాకర్ పాల్గొన్నారు.


## వైఎఫ్ మహాసభకు తరలిన యువత




**ప్రజాపక్షం/ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర మహాసభకు ఖమ్మం నుంచి పెద్ద సంఖ్యలో యువకులు వెళ్లారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు ఈనెల 8, 9, 10 తేదీల్లో యాదాద్రిలో జరుగుతున్న విషయం విధితమే. ఖమ్మం జిల్లా నుంచి బయలుదేరిన బస్సును ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నానబాల రామకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్‌ఓ డాక్టర్ డి.రామారావు



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** క్లినికల్ ఎసాబ్లిష్‌మెంట్ చట్టం నిబంధనలను ఉల్లంఘించే ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్‌హోమ్‌లు, స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.రామారావు హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని యలమద్ది ఆసుపత్రిని డిఎంహెచ్‌ఓ డాక్టర్ డి.రామారావు హెచ్చరించారు. మంగళవారం ఖమ్మం నగరంలోని యలమద్ది ఆసుపత్రిని డిఎంహెచ్‌ఓ డాక్టర్ డి రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు, చికిత్స పొందుతున్న రోగుల కేస్‌షీట్లు, వైద్య నివేదికలను పరిశీలించారు. అనంతరం స్కానింగ్ సెంటర్ రికార్డులు, ఫారమ్ ఎఫ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు, చేయించుకునే వారు చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారు, చేయించుకునే వారు చట్టపరంగా శిక్షార్హులని పేర్కొన్నారు. ఈ విషయాన్ని తెలియజేసే హెచ్చరిక బోర్డులను ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లలో రోగులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల పేర్లు, విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ నంబర్లు, అందుబాటులో ఉండే సమయాలను రిసెప్షన్ వద్ద డిస్‌ప్లే బోర్డులపై స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనల ప్రకారం సేకరణ, కలర్ కోడింగ్, డిస్పోజల్ చేయాలని, నిబంధనల ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రైవేట్ ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నిర్దేశించిన నిబంధనలు, ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ రామారావు సూచించారు. సరైన అనుమతులు లేకుండా లేదా అర్హత లేని సిబ్బందితో వైద్యసేవలు అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజారోగ్యంతో చెలగాటమాడే ఆసుపత్రులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతామని డిఎంహెచ్‌ఓ తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా వైద్యశాఖ అధికారులు, సిబ్బంది సాయి కృష్ణ, ఒఎస్, ఆసుపత్రి తరుపున డాక్టర్ రాజేష్, మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన సురేష్ పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు జరిపితే కఠిన చర్యలు

పోలీస్ కమిషనర్ సునిల్‌దత్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** బాల్యవివాహాలు జరిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వాటిని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టిసారించాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కూసుమంచి మండలం బోడు తండా, తల్లాడ మండలం అన్నారుగూడెం, వైరా మండలం తాటిపూడి, గన్నవరం, సత్తుపల్లి మండలం బేతుపల్లి, కామేపల్లి మండలం బాసిత్‌నగర్, బోనకల్ మండలం పెద్ద బీరవాల్లి తోపాటు ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం ఎనిమిది బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు సకాలంలో జోక్యం చేసుకుని వాటిని నిలువరించారని తెలిపారు. అదేవిధంగా 12 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, ప్రజలు, ఉపాధ్యాయులు, సంభందిత శాఖల అధికారులు పోలీసుశాఖకు సహకరించాలని సునిల్‌దత్ కోరారు. నిబంధనలకు విరుద్ధంగా బాల్యవివాహాలు జరుపుతున్నట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదని చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మోడిఫైడ్ సైలెన్సర్లు ధ్వంసం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా శబ్ధ కాలుష్యాన్ని సృష్టిస్తున్న మోడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించే ద్విచక్రవాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అడిషనల్ డిసిపి భోజా రామానుజం ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం స్థానిక పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో అడిషనల్ డిసిపి రామానుజం, ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్‌లు సమక్షంలో ఇటీవల ద్విచక్రవాహనదారుల నుంచి స్వాధీనం చేసుకున్న మోడిఫైడ్ సైలెన్సర్‌లను రోడ్డు రోలర్ తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులకు రామానుజం పలు సూచనలు చేశారు. వాహనదారులు కంపెనీ ఇచ్చిన ఒర్జినల్ సైలెన్స్‌ర్లను వినియోగించేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సైలెన్స్‌ర్లు మార్చినట్లు గుర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో 1654 బుల్లెట్ సైలెన్స్‌ర్లను తొలగించి ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఆర్ ఎసిపి సుశీల్‌సింగ్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

## బీడీ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయాలి

మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతి



**ప్రజాపక్షం/జగిత్యాల :** బీడీ కార్మికుల సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేశారు.బీడీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అందాల్సిన సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని యూనియన్ నాయకులు మంత్రిని కోరారు. ప్రభుత్వం కార్మికులు, మహిళల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఓ ప్రకటనలో తెలిపారు.యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు భూమేశ్వర్,గౌరవ అధ్యక్షుడు భూమన్న, ఉపాధ్యక్షురాలు అరుణక్క,సహ కార్యదర్శి అనురాధ,ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## పకడ్బందీగా డిజిటల్ క్రాప్ సర్వే

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** డిజిటల్ క్రాప్ సర్వేను ప్రతీ వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.వ్యవసాయ శాఖ పనితీరుపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. డిజిటల్ క్రాప్ సర్వే, యూరియా సరఫరా, సేంద్రియ వ్యవసాయం, పంటల సాగు విస్తీర్ణం, రైతులకు అందుతున్న వ్యవసాయ సేవలు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి తమ పరిధిలో సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించి, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని అన్నారు.డిజిటల్ క్రాప్ సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు ఏ పంటను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ క్రాప్ సర్వేలో ఎలాంటి తప్పులు,పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు.పంటల సాగు పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ నీటి లభ్యత, నేల స్వభావం, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఒకే పంటపై ఆధారపడకుండా రైతులకు లాభదాయకమైన పంటలపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతులతో నిరంతరం అందుబాటులో ఉంటూ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ తదితర అంశాలపై సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, రైతులకు అందుతున్న సేవల అమలును మండలాల వారీగా నిరంతరం పర్యవేక్షించాలని, లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల కు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని,వ్యవసాయ రంగ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది,పాల్గొన్నారు.

'నామాపూర్'లో ఏడు ఎకరాల్లో

## రైతు ఆయిల్ పామ్ సాగు

15 టన్నులు.. రూ. 3,45,000 లక్షల ఆదాయం

కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం /ముస్తాబాద్:** ఏడు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటి దాదాపు నాలుగు ఏండ్ల తరువాత 15 టన్నులు దిగుబడితో రూ.3,45,000 ఆదాయం పొందారు ముస్తాబాద్ మండలం నామాపూర్ కు చెందిన రైతు అరవెల్లి చంద్రశేఖర్ రావు. దాదాపు నాలుగు ఏండ్ల క్రితం మొక్కలు నాటి సస్య రక్షణ చర్యలు చేపట్టి మంచి దిగుబడి సాధించి.. ఇప్పుడు మరో రెండు ఎకరాల్లో మామిడి, నిమ్మ తోటలు సాగు చేస్తున్నారు. ఈ ఆదర్శ రైతు వ్యవసాయ క్షేత్రానికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం వెళ్లి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో మొక్కలు, దిగుబడిని పరిశీలించి..మరో పంట ఎప్పుడు చేతికి వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో ఆయిల్ పామ్ వేశారు? మొక్కలు ఎక్కడి నుంచి తీసుకున్నారు? డ్రిప్ ఇరిగేషన్.. సస్య రక్షణ చర్యలు, పెట్టుబడి.. ఆదాయం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వం సబ్సిడీ పై అందించే మొక్కలు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏడీఏ ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీఓ లచ్చాలు తదితరులు ఉన్నారు.

## ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యుడిగా శనిగరపు ఎన్నిక

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కరీంనగర్ జిల్లాలో ఎఐటియుసి నాలుగవ రాష్ట్ర మహాసభల జరిగిన నాలుగో మహాసభల్లో రెండోసారి గోదావరిఖని కి చెందిన శనిగరపు చంద్ర శేఖర్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికైన సందర్భంగా ఎఐటియుసి నగర సమితి నాయకులు అబ్దుల్ కరీం, రెడపాక లక్ష్మి ణ్, నాంసాని శంకర్, కలికోట సతీష్ కు మార్, షేక్ మసూద్ లు శుభాకాంక్షలు తెలిపారు.తన ఎన్నికలకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, కేం ద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4కోడ్‌లపై ఉద్యమిస్తానని,44చట్టాలని కొనసాగించే దాక పోరాటా లు చేస్తామని, కార్మిక చట్టాలు కార్మిక హక్కులు ఉద్యోగ భద్రత ఉపాధి హామీకై ఎఐటియుసితో కలిసి ఉద్యమాలు చేపడతామని అన్నారు.

## కార్మికుల్లో ఉనికి కోల్పోతామనే.. అక్కసుతో గుర్తింపు సంఘంపై విమర్శలు

ఎఐటియుసి కేంద్ర నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఎఐటియుసి, ఆర్ ఎల్ సి సమక్షంలో ఆగస్టు 27న యాజమాన్యంతో చేసుకున్న చారిత్రాత్మక ఒప్పందంపై పలు కార్మిక సంఘాలు కార్మికుల్లో ఉనికి కోల్పోతామనే అక్కసుతో విమర్శలు చేస్తున్నాయని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, కే. వీరభద్రం విమర్శించారు. జూన్ 8న యాజమాన్యానికి 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇవ్వడం వల్లే 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని, ఇలాంటి చారిత్రాత్మక ఒప్పందంపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను, నాయకులుకిశోర్,జలపతి,పెద్దెల్లి శంకర్,ఎల్.రమేష్, అంజయ్య,అజీం,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బిఆర్ఎస్

స్పీకర్‌ను అవమానించిన తాత మధు ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్



**ప్రజాపక్షం/గంగాధర :** అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ అన్నారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాత మధు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.అత్యున్నత పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాత మధు ఎమెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వారి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో తప్పుడు సంకేతాలు తీసుకెళ్తాయని పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకులు స్పీకర్‌కు తక్షణమే క్షమాపణ చెప్పడంతోపాటు వారి బుద్ధిని సరి చేసుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుమల్ల మనోహర్, ప్రధాన కార్యదర్శి రోమాల రమేశ్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిరుత మంగ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ముద్దం నగేశ్, సర్పంచ్‌లు వేముల భాస్కర్, లింగాల లింగయ్య, బాసవేని శ్రీనివాస్, పడాల భాగ్యలక్ష్మి రాజన్న, కోలేపాక కవిత, మల్లేశం, గుండవేని మమత తిరుపతి, ఆరే శ్రీజ, దానే అనసూర్య ఓ దెలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచమల్ల భాస్కర్, బైరిశెట్టి సంపత్, కోలేపాక స్వామి, గుజ్జుల బాపు రెడ్డి, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, కుమారస్వామి, పలువురు ఉప సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పారదర్శకంగా భూముల రీసర్వే



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం సోమనపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రీసర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రీసర్వే ద్వారా అనేక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉన్నందున, భూముల సర్వేలో అత్యంత ఖచ్చితత్వం పాటించాలని సూచించారు. రీసర్వే చేపట్టే ముందు రైతులకు ముందస్తు సమాచారం అందించడంతోపాటు, వారి సమక్షంలోనే సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి భూమి హద్దులను, కోఆర్డినేట్లను ఖచ్చితంగా గుర్తించి నమోదు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున నమోదులో ఎలాంటి పొరబాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వే పూర్తయిన అనంతరం ప్రతి రైతుకు వారి భూమికి సంబంధించిన మ్యాప్‌ను ఖచ్చితమైన కోఆర్డినేట్లతో అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీసర్వే ప్రక్రియను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలన్నా రు. 'సర్', రీసర్వే ప్రక్రియలను సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరి స్తూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ తహసీల్దారు ప్రసాద్, సోమనపల్లి సర్పంచి గుంట బాపు, సర్వేయర్లు, అధికారులు ఉన్నారు.

## నీట్ 2006 పరీక్షకు గట్టి బందోబస్తు

పరీక్షా కేంద్రం వద్ద 163 సెక్షన్
జిల్లా కలెక్టర్ హైమావతి


**ప్రజాపక్షం/సిద్దిపేట :** ఎన్‌టిఎయుజిసి నీట్ సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జాతీయ అర్హత పరీక్షను సజావుగా నిర్వహించేందుకు గట్టి బందోబస్తు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. బిఎన్ఎస్ 2023లోని సెక్షన్ 163 కింద ఉత్తర్వుల జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కే. హైమావతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందూరు ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్న యుజిసి నీట్ పరీక్షకు భద్రతా ఏర్పాట్లు , ఇతర అవసరమైన ఏర్పాట్లను చేయడం జరిగిందని, పరీక్ష సజావుగా, ప్రశాంతంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించేందుకు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు, ప్రజలు పరీక్ష నిర్వహణలో ఉద్దేశపూర్వకంగా జోక్యం చేసుకోకుండా ఉండేందుకు బిఎన్ఎస్ సెక్షన్ 163 నిబంధనలను అమలు చేయడం జరిగిందని అన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఇందూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, పొన్నాల గ్రామం, సిద్దిపేట (అర్బన్) మండలం పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు ఒకచోట గుమికూడడం నిషేధం.కర్రలు, కత్తులు, ఆయుధాలు, లాఠీలు లేదా ఇతర హానికరమైన ఆయుధాలు/పరికరాలు తీసుకురావడం నిషేధం. అదేవిధంగా, పరీక్షా కేంద్రం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఉన్న అన్ని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, సైబర్ కేఫ్‌లు మొదలైనవి పరీక్ష జరిగే సమయంలో అంటే 9, 10 తేదీలలో మూసివేయాలనీ తెలిపారు. ఈ ఆంక్షలు 09, 10 తేదీలలో ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 7:30 గంటల వరకు లేదా పరీక్ష పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని ప్రజల ప్రజలు ఈ ఆంక్షల ప్రకారం సహకరించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం

**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సూచనతో మంగళవారం అంతర్గాం మండల కేంద్రములో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేపట్టిన భారీ నిరసన కార్యక్రమం హోరెత్తింది. ఎమ్మెల్సీ తాతా మధు దళిత శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానించడాన్ని నిరసిస్తూ, అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగం కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి మానవహారంగా ఏర్పడి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్ పై ఇష్టానుసారంగా మాట్లాడటం దారుణమని, తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు

మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్:** ప్రజా ప్రతినిధులు, సమాజానికి రక్షణ కల్పిస్తున్న పోలీసులపైనే బిఆర్ఎస్ దాడులు చేస్తుండగా, నిన్న అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటన సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేసిందని గజ్వేల్ మా జీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఎర్రవల్లి శివారులో జ రిగిన తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మీడియాతో మా ట్లాడారు. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమా ర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధుసూదన్ ఎమ్మెల్సీ సభ్య త్వం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.ప్రాయశ్చిత్తం కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ఫాం హౌజ్ వద్ద డప్పు మో తలతో నిరసన తెలిపినట్లు చెప్పారు. కేసీఆర్ బయటకు వచ్చి ప్రజా సమస్యలు పరిష్కరించడం తోపాటు అసెంబ్లీకి హాజరుకావాలని వివరించారు.

## ఇవిఎం గోదాం తనిఖీ

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లో ఉన్న ఈవీఎం గోదాంను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మంగళవారం తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, గోదాం భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలను ఎన్నికల సంఘానికి పంపిస్తున్నట్లు తెలిపారు.ఈవీఎంలు, వీవీప్యాట్‌ల భద్రతకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై కూడా ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం ఈవీఎం గదులు, వీవీప్యాట్ గదుల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.జిల్లా అదనపు కలెక్టర్ లత, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి,వివిధ రాజకీయ పార్టీ నాయకులు,ఎన్నికల సిబ్బంది,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ రోడ్ నిర్మించాలి

సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, సిపిఐ నగర కార్యదర్శి కే కనకరాజ్ డిమాండ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శివాజీ నగర్ శాఖ ఆధ్వర్యంలో కొత్త కూరగాయల మార్కెట్ సమీపంలో అసంపూర్ణంగా ఉన్న సిసి రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంతాన్ని సిపిఐ శ్రేణులు సందర్శించడం జరిగింది.రామగుండం నియోజకవర్గంలో కానీ కార్పొరేషన్‌లో గాని అభివృద్ధికి ఆమడు దూరంలో పనులు జరుగుతున్నాయని ఆరోపించారు. గోదావరిఖని ప్రాంతంలోని ప్రజలందరికీ ప్రత్యక్షంగా కూరగాయల మార్కెట్ కు రాకపోకలు ప్రతిరోజు ఉన్న సందర్భంలో ఈ రోడ్డు అసంపూర్తిగా ఉండటం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఉన్నటువంటి రోడ్లను ధ్వంసం చేసి నూతన రోడ్లు నిర్మిస్తామని చెప్పి వెళ్ళిపోతున్నారు తప్ప గత 1 సంవత్సరం కాలంగా ఈ రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలువ ఉండడం వల్ల ప్రజలు అనారోగ్య పాలిన పడే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కుండీలు చాంబర్లు ఆరు నెలలు కాకముందుకే ధ్వంసమైన పద్ధతి చూస్తే ఎంత నాణ్యతతో నిర్మించారు స్పష్టంగా అర్థమవుతుందని విమర్శించారు.800 కోట్లు తెచ్చి రామగుండాన్ని అభివృద్ధి చేస్తున్నానని ప్రగల్భాలు పలుకుతున్న ఎమ్మెల్యే, మేయర్ ఒక్కసారి ఆకాశం నుండి భూమి మీదకు వచ్చి కింద చూస్తే వాళ్ళు చేసే అభివృద్ధి కళ్ళకు కనబడుతుంది అని చెప్పి దుయ్యబట్టారు. కొత్తకూరాల మార్కెట్ దగ్గర ఉన్న అసంపూర్ణ సిసి రోడ్డును వెంటనే నిర్మించడంతోపాటు కార్పొరేషన్ లో ఇప్పటివరకు అభివృద్ధి పేరుతో ధ్వంసం చేసిన సిసి రోడ్డులన్నీ వెంటనే నిర్మాణం చేయకపోతే మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. సిపిఐ నాయకులు రేణిగుంట్ల ప్రీతం, పోతరాజు నాగరాజు,సాధుల శివ,షేక్ చాంద్,సదానందం,పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌కు సహకరించాలి

సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌కు న్యాయవాదులు సహకరించాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల న్యాయవాదులు కౌన్సెలింగ్ ద్వారా పార్టీలను రాజీకి ప్రోత్సహించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించడం వల్ల కోర్టుల్లో పెండింగ్ కేసుల భారం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి,ఏపీపీ చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, ఏజీపీ అబ్దుల్ హాఫీజ్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.




## నేటి నుండి రైస్ మిల్లుల బంద్ చేస్తున్నాం

జిల్లా రైస్ మిల్లర్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి చందు, చింతరాజు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రభుత్వం, అధికారులు అవలంబిస్తున్న విధానాలకు బాధగా నేటి నుండి రైస్ మిల్లులను బందు చేస్తున్నామని సిద్దిపేట జిల్లా రైస్ మిల్లర్స్ అండ్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అర్బన్, రూరల్ సంఘాల అధ్యక్షులు కొమురవెల్లి చంద్రశేఖర్, చింత రాజులు తెలిపారు.గతంలో ఏ సీజన్‌కు సంబంధించిన బియ్యాన్ని ఆ సీజన్లోనే డెలివరీ చేసేవారమని, కాని గత మూడు సంవత్సరాల నుండి ఎఫ్‌సిఐ వారు స్థలం చూపెట్టకపోవడంతో బియ్యాన్ని డెలివరీ చేయలేకపోతున్నామని, దీంతో మిల్లర్ల ను డిఫాల్టర్లుగా చిత్రీకరించి 25 శాతం పెనాల్టీ, 12 శాతం వడ్డీ విధించడం సరికాదన్నారు. 2025 26 రబీ సీజనుకు బాయిల్డ్ బియ్యం 2,90,000 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చి, 1,10,000 మెట్రిక్ టన్నుల ధాన్యం డెలివరీ చేయగా, ఇప్పుడు అధికారులు, ప్రభుత్వం మాకు బాయిల్డ్ రైస్ వద్దు, రా రైస్ మాత్రమే ఇవ్వాలని ఒత్తిడి చేయడం సరికదన్నారు. ఆ వడ్లను రా రైస్ గా మారిస్తే పెద్ద మొత్తంలో బియ్యం రావని అన్నారు. 2019 20 నుండి సివిల్ సప్లై నుండి మిల్లింగ్ చార్జీలు, ట్రాన్స్పోర్ట్, ఇతర చార్జీలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో మిల్లర్లు అందరూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత కొన్ని రోజులుగా సివిల్ సప్లై, విజిలెన్స్, ఇంటలిజెన్స్ వారు మిల్లులను తనిఖీ చేస్తూ, ధాన్యం షార్ట్ ఫాల్ ఉన్నదని కేసులు పెడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా 100 మందిపై కేసులు పెట్టారని అన్నారు. మిల్లర్లు ఎలాంటి అవకతవకలు చేయలేదని, ధాన్యాన్ని బియ్యం గా మారుస్తున్నప్పుడు షాట్ పాల్ అవుతుందని అన్నారు. తమకు మూడు నెలల అవకాశం ఇస్తే తమ దగ్గర ఉన్న ధాన్యాన్ని అధికారులు వెనక్కి తీసుకపోవాలని, షార్ట్ ఫాల్ ఉన్న ధాన్యానికి సీజన్ల వారీగా ఎమ్మెస్పీ రేటును చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. మిల్లులకు తాళాలు వేసి అధికారులకు ఇస్తామని, వారు ఎప్పుడు వచ్చినా ధాన్యాన్ని వెనక్కి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రభుత్వం కొత్తగా ఎస్ఓపి యాప్‌ను తెచ్చిందని, అధికారులు రైస్ మిల్లుల కు వచ్చి ధాన్యాన్ని లెక్కించి ఆ యాప్ లో అప్లోడ్ చేయనున్నట్లు తెలిపారు. అధికారులకు, ప్రభుత్వానికి తాము సహకరిస్తామని అన్నారు. మహిళ మండల వారికి 20 రైస్ మిల్లులు ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. తాము వచ్చే వానాకాలం ధాన్యాన్ని దించుకోమని, రెండు నెలల ముందే ప్రభుత్వానికి, అధికారులకు చెబుతున్నామని, కానీ తమ మిల్లులను కిరాయికి తీసుకొని ధాన్యాన్ని దించుకోవడానికి సహకరిస్తామని అన్నారు. తమకు జరుగుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైస్ మిల్లులను బందు చేస్తున్నామన్నారు.సంఘం నాయకులు కాశీనాథ్, బుచ్చయ్య, బాలకిషన్, విష్ణుమూర్తి, శివకుమార్, పాల్గొన్నారు.

## కబ్జా కోరల్లో కళాకారుల భూమి



**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని లలిత కళా సమితి భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సమితి ప్రతినిధులు ఆరోపించారు. భూమి చుట్టూ గోడ నిర్మించి కార్యకలాపాలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.భూమి రికార్డులు, సర్వే నంబర్, హద్దులను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పరిశీలించి వాస్తవాలను తేల్చాలని కోరారు. ఆక్రమణలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకుని భూమిని కాపాడాలని డిమాండ్ చేశారు.అధికారులు స్పందించకపోతే ఉన్నతాధికారులను ఆశ్రయిస్తామని, అవసరమైతే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## శరవేగంగా బుల్లెట్ రైలు పనులు

### కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్

**న్యూఢిల్లీ:** తొలి బుల్లెట్ రైలు త్వరలోనే పట్టాలెక్కబోతోంది. బుల్లెట్ రైలుకు సంబంధించి ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్టు వివరాలను మంగళవారం వెల్లడించారు. పనులు ఊహించిన దానికంటే వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాదినాటికి సూరత్ బిలిమోరా మధ్య మొదటి సెక్షన్‌ను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. అలాగే వాపీ సూరత్ సెక్షన్ సివిల్ నిర్మాణ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 508 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న ఈ హైస్పీడ్ కారిడార్ పనులు సెప్టెంబరు 2017లో ప్రారంభించారు. ఇది మహారాష్ట్ర, గుజరాత్, దాద్రా అండ్ నాగర్ హవేలీ మీదుగా సాగుతుంది. ప్రయాణికుల సదుపాయం కోసం ఈ మార్గంలో ముంబై, థానే, విరార్, బోయిసర్, వాపీ, బిలిమోరా, సూరత్, భరూచ్, వదోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి స్టేషన్లు నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్ల డిజైన్లను ఆయా నగరాల స్థానిక సంస్కృతి, గుర్తింపు ప్రతిబింబించేలా, ఆధునిక ఆర్కిటెక్చర్, మల్టీమోడల్ కనెక్టివిటీతో తీర్చిదిద్దుతున్నారు. రైలు పట్టాలపైనే కాకుండా, వాహనాల తయారీ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. టెస్టింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొదటి కోచ్ ఇప్పటికే సిద్ధమైంది. గం.కు 320 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించే ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే... అహ్మదాబాద్ నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం 2 గంటల 58 నిమిషాలకు తగ్గిపోతుంది. తాజా అంచనాల ప్రకారం ఈ కారిడార్‌లో మొదటి పూర్తిస్థాయి బుల్లెట్ రైలు సర్వీస్ ఆగస్టు 2027లో ప్రారంభం కానుంది.

## సత్యనికేతన్ ఘటనపై సిపిఐ ఆందోళన

### బాధితులకు పరిహారం, బాధ్యులపై చర్యలు, విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్ వద్ద భవనం కూలిన ఘటనపై సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు భారీ పరిహారం ప్రకటించాలని, ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఢిల్లీలోని అన్ని విద్యార్థి వసతిగృహాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని, ప్రతి డీ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ పి.సంతోశ్‌కుమార్, సిపిఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వర్ష్నీ, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ సత్య నికేతన్ భవన ప్రమాద స్థలాన్ని సందర్శించి... సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారిని వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు 24 గంటలూ అందుబాటులో ఉండి బాధిత కుటుంబాలకు సహకరిస్తున్నారని నేతలు తెలిపారు. ఈ ఘటన నిర్మాణ భద్రత, నియంత్రణ వ్యవస్థల్లో లోపాలను ఎత్తిచూపుతోందని వారు పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారికి తగిన పరిహారం అందించడంతో పాటు వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలోని అన్ని పీజీలు, హాస్టళ్లు, విద్యార్థుల వసతి గృహాలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించి, ప్రమాదకర భవనాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం, అవినీతి, నిబంధనల ఉల్లంఘన, నిర్మాణ లోపాలు, నియంత్రణ సంస్థల వైఫల్యాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడీపీలో కనీసం 6 శాతం కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసింది. కష్టపడి డీలో ప్రవేశం పొందిన విద్యార్థులు అధిక అద్దెలు చెల్లించి అసురక్షిత పీజీల్లో ఉండాల్సిన పరిస్థితి రాకూడదని, సురక్షిత వసతి, విద్య కల్పించడం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేసింది.

## అమిత్ షా నేతృత్వంలో నేర రాజధానిగా ఢిల్లీ

### సంగీతకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ ఆగ్రహం




**న్యూఢిల్లీ :** మణిపూర్‌కు చెందిన ఒక సంగీతకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెరుగుతున్న ఈ అరాచకాన్ని అరికట్టడానికి హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని మంత్రిత్వ శాఖ ఏం చేస్తోందని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఈ ఘటనపై త్వరితగతిన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కిలోకారి గ్రామంలోని తన అపార్ట్‌మెంట్ బయట కొందరు డెలివరీ సిబ్బంది, ధాబా ఉద్యోగులు మద్యం సేవిస్తూ గట్టిగా అరుస్తుండగా వారిని వారించినందుకు, వారు తనపై దాడి చేయడంతో 54 ఏళ్ల మణిపురి సంగీతకారుడు సి. విక్రమ్ సింగ్ మరణించారు. ఈ కేసులో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేయగా, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడు చోంగ్థమ్ విక్రమ్ సింగ్ జీ, తన ఇంటి బయట శబ్దాన్ని తగ్గించమని కొందరిని అడగడానికి కిందకు వెళ్లారు. అందుకు గాను ఆయనను కొట్టి చంపారు' అని మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. తన సొంత దేశ రాజధానిలో, తన ఇంటి ముందే ఒక తండ్రి హత్యకు గురయ్యారని ఆయన అన్నారు. ఇలాంటి అనేక ఘటనల తర్వాత ఢిల్లీలోని ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రతి కుటుంబం నేడు ఒకే ప్రశ్న అడుగుతోందని, తాము ఇక్కడ సురక్షితంగా ఉన్నామా? అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ఈశాన్య ప్రాంత ప్రజలపై పెరుగుతున్న ఈ అరాచకాన్ని అరికట్టడానికి షా నేతృత్వంలోని హోం శాఖ, ఢిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనపై త్వరితగతిన విచారణ జరగాలని, దోషులను శిక్షించాలని ఉద్ఘాటించారు. అలాగే విక్రమ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడైన సింగ్‌ను ఒక మూక నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం బిజెపి పాలనలో నెలకొన్న పూర్తి అరాచకానికి మరో భయంకరమైన నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. హోం మంత్రి అమిత్ షా పాలనలో ఢిల్లీ 'నేరాల రాజధాని'గా మారిందని ఆరోపించారు. 'విద్యార్థులకు భద్రత లేదు. మహిళలు ప్రతిరోజూ అఘాయిత్యాలను ఎదుర్కొంటున్నారు. ఈశాన్య భారతదేశ ప్రజలు వివక్షను ఎదుర్కొంటున్నారు. దళితులు, ఆదివాసులు, మైనారిటీలు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారు. హోం మంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఢిల్లీ నేరాలకు రాజధానిగా మారింది. జాతీయ రాజధానిలో ఏటా అత్యధిక స్థాయిలో నేరాలు నమోదవుతున్నాయని ఎన్‌సిఆర్‌బి నమోదు చేస్తోంది' అని ఖర్గే అన్నారు. మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి న్యాయం జరగాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మోదీ ప్రభుత్వ అసమర్థత వల్ల మణిపూర్ ప్రజలు తమ రాష్ట్రంలోనూ, వెలుపలా బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ నడిబొడ్డున మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడిని అత్యంత దారుణంగా హత్య చేయడం జాతీయ స్థాయి అవమానమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. 'కొంత మందిని శబ్దం తగ్గించమని కోరినందుకే ఆయనను దారుణంగా కొట్టి చంపేశారు. పరిస్థితి ఇంతలా దిగజారిందా? కనీసం తమ ఇంటి ముంగిట కూడా ఒక యువ తండ్రికి భద్రత లేదా? న్యాయం జరగాలి' అని ఆమె 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'ఈ హత్యకు పాల్పడిన వారిపై ఢిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇది దేశ రాజధాని, మన నగరంలో హింస అదుపు లేకుండా చెలరేగడాన్ని మనం అనుమతించలేం. విక్రమ్ జీ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. న్యాయం కోసం జరిగే పోరాటంలో మేము మీకు అండగా ఉంటాం' అని ప్రియాంకా గాంధీ అన్నారు.

## అనర్హులను టీచర్లుగా నియమించొద్దు: సుప్రీం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టంచేసింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా... ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలు పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### జెఎస్ఎస్‌సి-సిజిఎల్ పరీక్షలో అవకవతకలు

## మరో వ్యక్తిని అరెస్టు చేసిన సిఐడి

**రాంచీ :** జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్‌సి) నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్' (సిజిఎల్) పరీక్షలో జరిగిన అక్రమాలకు సంబంధించి, రాష్ట్ర పోలీసుల క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఒక అధికారి తెలిపారు. బిహార్‌లో జరిగిన ఈ అరెస్టుతో కలిపి, 2023లో జరిగిన సిజిఎల్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి రాష్ట్ర దర్యాప్తు సంస్థ ఇప్పటివరకు 11 మందిని అదుపులోకి తీసుకుంది. ఈ అక్రమాలపై గత నెలలో రాంచీలో ఉద్యోగార్థులు పలు రోజుల పాటు నిరసనలు తెలిపారు. బిహార్‌లోని పాట్నా జిల్లా, నెవారా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన రాజన్ కుమార్‌ను సోమవారం సిఐడి అరెస్టు చేసిందని ఆ అధికారి పేర్కొన్నారు. నిందితుడు పలువురు జెఎస్ఎస్‌సి–సిజిఎల్ అభ్యర్థులను పశ్చిమ బెంగాల్‌లోని నియమత్‌పూర్‌లో ఉన్న ఒక హోటల్‌కు తీసుకెళ్లి, పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలను వారికి కంఠస్థం చేయించాడు అని ఆయన చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా పలువురు అభ్యర్థులు అక్రమ ప్రయోజనం పొందారని, వారిలో కొందరు పరీక్షలో విజయం సాధించారని ఆ అధికారి తెలిపారు. ఈ కేసులో ఇంతకు ముందు అరెస్టు అయిన 10 మందిలో నలుగురు జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులే ఉన్నారు. ప్రధాన నిందితుడు అభయ్ తివారీతో పాటు అతని భార్య, సోదరుడిని కూడా సిఐడి అదుపులోకి తీసుకుంది. ఉద్యోగార్థుల నిరసనల నేపథ్యంలో, జెఎస్ఎస్‌సి–సిజిఎల్ 2023తో సహా పలు నియామక పరీక్షలను రద్దు చేస్తున్నట్లు జార్ఖండ్ ప్రభుత్వం ఆగస్టు 17న ప్రకటించింది. అయితే, ఉద్యోగం కోల్పోతామనే ఆందోళనతో విజేతలైన అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. పరీక్షలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై జార్ఖండ్ సిఐడికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది.

## ఐవి ద్రవాలు తీసుకునేందుకు జారంగే అంగీకారం

### 11వ రోజు కొనసాగిన నిరాహారదీక్ష



**జాల్నా :** మరాఠా రిజర్వేషన్ల ఉద్యమకారుడు మనోజ్ జారంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారానికి 11వ రోజుకు చేరుకుంది. అయితే ఆయన ఆరోగ్యం క్షీణించింది. రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పడిపోవడంతో, ఆయన ఐవి ద్రవాలను తీసుకోవడానికి అంగీకరించారని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా అంతర్వాలి సార్తి గ్రామంలో నిరసన చేపట్టిన జారంగే, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, ఎమ్మెల్యే ప్రసాద్ లాడ్ ఫోన్ కాల్స్ చేసిన తర్వాత తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో చికిత్సకు అంగీకరించారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుండే ఆయన డిమాండ్లపై పని ప్రారంభిస్తుందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని ఆ నాయకులు ఉద్యమకారుడికి హామీ ఇచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆగస్టు 29న తన తాజా నిరాహార దీక్షను ప్రారంభించిన జారంగే, మరాఠా వర్గానికి ఓబిసి కేటగిరీ కింద రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్, సతారా గెజిట్ రికార్డుల అమలుతో పాటు, అర్హులైన మరాఠా వర్గీయులకు కున్బీ కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయాలని ఆయన కోరుతున్నారు. వాడిగోద్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శుభమ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం, జారంగే రక్తంలో చక్కెర స్థాయి 66 ఎంజి/డిఎల్‌కు పడిపోయింది. ఆయన బరువు 52 కిలోల నుండి 45 కిలోలకు తగ్గింది. ఉదయం 7 గంటల వరకు ఆయనకు నాలుగు బాటిళ్ల ఐవి ద్రవాలను అందించారు. పుణె, థానే, నాసిక్, ముంబయి వంటి ప్రధాన జిల్లాల నుండి మరాఠాలు సెప్టెంబర్ 12న అంతర్వాలి సార్తి వద్ద భారీ సంఖ్యలో సమావేశం కావాలని ఆ ఉద్యమకారుడు సోమవారం పిలుపునిచ్చారు.

## పినరయ్ విజయన్, వీణపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

### డిజిపికి ఇడి లేఖ

**కొచ్చి/న్యూఢిల్లీ :** కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్)కు సంబంధించిన లంచం ఆరోపణ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి,అల్లుడు పి.ఎ. మహమ్మద్ రియాస్, మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేరళ డిజిపికి లేఖ రాసినట్లు అధికారిక వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ కేసులో తమ దర్యాప్తులో వెల్లడైన అంశాలను ప్రస్తావిస్తూ, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని సెక్షన్ 66 (2) కింద కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ సమాచారాన్ని పంపినట్లు ఆ వర్గాలు పిటిఐకి వెల్లడించాయి. పిఎంఎల్ఎ కింద జరిపిన సోదాలు, దర్యాప్తులో లభించిన సాక్ష్యాల ఆధారంగా, అవినీతి నిరోధక చట్టం, ఇతర చట్టాల నిబంధనల కింద విజయన్, వీణ, ఆమె భర్త, మాజీ మంత్రి అయిన రియాస్, అలాగే మరికొందరిపై పోలీసు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఇడి కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కేరళకు చెందిన మైనింగ్ సంస్థ సిఎంఆర్ఎల్, వీణకు చెందిన (ప్రస్తుతం మూతపడిన) 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్' సంస్థకు 'ఐటి కన్సల్టెన్సీ సేవల' ముసుగులో రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపిస్తోంది. రాజధాని తిరువనంతపురంలో విజయన్‌తో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్న వీణ నివాసంలో ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ జూన్‌లో సోదాలు నిర్వహించి, ఆ తర్వాత ఆమెను విచారించింది. వీణపై జరిపిన సోదాల సమయంలో కొన్ని 'చేతిరాత' గల పత్రాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో దుబాయ్‌కి జరిగిన కొన్ని నిధుల బదిలీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని ఆ సంస్థ ఆగస్టులో ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ స్పందిస్తూ ఇడి ఇప్పుడు రియాస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తన కుమార్తెపై ఇడి నమోదు చేసిన కేసును విజయన్ రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు.

## ఎంపిఎస్‌సి ప్రశ్నా పత్రం లీక్

### మహారాష్ట్రలో అభ్యర్థుల నిరసన

**ఛత్రపతి శంభాజీనగర్ :** ప్రశ్న పత్రాల లీక్‌లు, పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలపై మహారాష్ట్రకు చెందిన ఛత్రపతి శంభాజీనగర్‌లో ఎంపీఎస్‌సీ అభ్యర్థులు భారీ సంఖ్యలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల నియామక పరీక్షల నిర్వహణపై ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి చౌక్ వద్ద గుమికూడిన నిరసనకారులు... మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) లో అత్యున్నత పదవుల్లో ఎటువంటి అవినీతి మరక లేని వారిని అధికారులను తక్షణమే నియమించాలని కోరారు. ఇటువంటి నిరసన ప్రదర్శనే సోమవారం పూణేలో జరిగింది. 'తుకారాం ముండే (రాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్) వంటి సచ్ఛీలురులను ఎంపీఎస్‌సీకి నియమించాలి. విద్యార్థులు తమకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నారు. రైతు కుటుంబాలకు చెందిన మేము తల్లిదండ్రులను ఆశలను నెరవేర్చేందుకు ఇక్కడకు చదువుకునేందుకు వచ్చాము' నిరసనలో పాల్గొన్న అభ్యర్థి ఒకరి తెలిపారు. కోవిడ్19 మహమ్మారి తర్వాత నిర్వహించిన పరీక్షల గురించి అభ్యర్థులకు అనుమానాలున్నాయని, వాటిపై కూడా విచారణ జరపాలని మరొక అభ్యర్థి కోరారు. 'మేము ఏమి చేస్తున్నామో మాకు తెలుసు. పరీక్షలకు హాజరయ్యేందుకు నేను నాలుగేళ్లుగా చదువుతున్నాను. కానీ డబ్బులు పెట్టినవారు ప్రయోజనం పొందారు' అని అన్నారు. ఎంపీఎస్‌సీపై తమకు నమ్మకం పోయిందని మరొక అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు ద్రోహం జరిగింది. వరుస సీటు నంబర్లు ఉన్న అభ్యర్థులకు నియామక పత్రాలు అందుతున్నాయి. ఇది యాదృచ్ఛికం కాకపోవచ్చు' అని తెలిపారు.

## స్కూల్‌లో మౌలిక సాదుపాయాల కోసం కలెక్టరేట్‌కు విద్యార్థుల పాదయాత్ర

### మూడు నెలలుగా విద్యుత్తు లేకపోవడంతో హాస్టల్ చీకటిమయమైందని విద్యార్థినుల ఆవేదన



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో, పాఠశాల హాస్టల్ సౌకర్యాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, నెలల తరబడి విద్యుత్తు లేకపోవడం, అపరిశుభ్రమైన ఆహారం, మెస్ ఉన్నాయని ఫిర్యాదు చేస్తూ 45 మందికి పైగా బాలికలు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి గంటల తరబడి నడిచారు. పాఠశాల ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమ శాఖ నుండి ఎటువంటి సమాధానాలు రాకపోవడంతో, బటౌలీలోని శివ్‌పూర్‌లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు అంబికాపూర్‌లోని జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్లు పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. గత మూడు నెలలుగా విద్యుత్తు లేకపోవడంతో తమ హాస్టల్ చీకటిమయమైందని విద్యార్థినులు ఆరోపించారు. అంతేకాకుండా, నాసిరకం ఆహారం, అపరిశుభ్రమైన మెస్‌తో పాటు, పాఠశాలలో ఉపాధ్యాయుల తీవ్ర కొరత ఉందని, దీని కారణంగా సాధారణ ఫిజిక్స్, కెమిస్ట్రీ తరగతులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని వారు తెలిపారు. ఈ ఆకస్మిక నిరసన స్థానిక యంత్రాంగం అంతటా భయాందోళనలు సృష్టించడంతో, గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత్ శుక్లా బైల్‌కోటా వద్ద వారిని అడ్డగించారు. అప్పటికే ఆ బాలికలు దాదాపు ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. శుక్లా హామీలు ఇస్తూ వారిని వారించేందుకు ప్రయత్నించారు. అయితే, పట్టుదలగా ఉన్న విద్యార్థులు చర్చలకు నిరాకరించి, కలెక్టర్ అజిత్ వసంత్‌ను స్వయంగా కలవాలని పట్టుబట్టారు. అప్పుడు అధికారులు వారిని మిగిలిన దూరం కలెక్టరేట్‌కు తరలించడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి, తక్షణమే సరిదిద్దుతామని వారికి హామీ ఇచ్చారు. విద్యుత్ అంతరాయాన్ని ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, హాస్టల్ మెస్‌లో కఠినమైన పరిశుభ్రతను పాటించేలా చూడాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి అతిథి ఉపాధ్యాయులను నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోపాలపై విచారణ జరిపి, సవివరమైన నివేదికను సమర్పించేందుకు వసంత్, జాయింట్ కలెక్టర్ శారదా అగర్వాల్, సీతాపూర్ ఎస్‌డిఎం ఫగేష్ సిన్హా, అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్ రాజ్‌పుత్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ హాస్టళ్లలో వారం రోజుల్లోగా భౌతిక తనిఖీలు నిర్వహించాలని నోడల్ అధికారులను కూడా ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో గిరిజన విద్యార్థులు హాస్టల్ సమస్యను లేవనెత్తుతూ కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర చేయడం ఇది మూడవసారి. వసంత్ ఇచ్చిన హామీల తర్వాత, విద్యార్థులను బస్సులో వారి హాస్టల్‌కు తిరిగి పంపించారు. తీవ్రమైన అలసట, డీహైడ్రేషన్, ఒత్తిడి కారణంగా, విద్యార్థులలో ఒకరు కలెక్టరేట్ ప్రాంగణంలో స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయారు. ఆమెను వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు.

## సత్యానిదే విజయం

### రాహుల్‌పై మోదీ విమర్శలు



**వదోదర:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్రమోదీ ఎదురుదాడి చేశారు. విపక్షాల అబద్ధాలను యువత ఆకాంక్షలు, గళం అధిగమిస్తాయని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించే వారు అన్నిచోట్ల ఉంటారని, కానీ యువత సత్యాన్నే అనుసరిస్తుందని, దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని తెలిపారు. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా చివరికి సత్యానిదే విజయమని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చాత్రోంకి గూంజ్ పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న విషయాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. గుజరాత్‌లోని వదోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మంగళవారం మాట్లాడారు. అదేసమయంలో అభివద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మోదీ మాట్లాడుతూ 'దేశంలో ప్రభుత్వాల పని సంస్కతిలో వచ్చిన మార్పునకు వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశ కూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి' అని పీఏ పాలనపై మోదీ ఆరోపించారు. పదేళ్లలో వారు 50 వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము 50 వేల రైలు బోగీలు నిర్మించామని చెప్పారు. యువత గురించి మాట్లాడిన ప్రధాని... ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. 'ఇప్పుడు ఎన్నో కుటుంబాలు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి' అని వివరించారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

## క్రీడా కోటా ప్రభుత్వ ఉద్యోగాలు నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ గుట్టురట్టు

### వెయ్యికి పైగా జారీ... ఇద్దరి అరెస్టు



**పూణే:** క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులకు కురాష్ టోర్నమెంట్ల పేరుతో వెయ్యికి పైగా నకిలీ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ఒక రాకెట్‌ను పూణే పోలీసులు ఛేదించి... ఇద్దరిని అరెస్టు చేశారని ఒక అధికారి మంగళవారం తెలిపారు. అరెస్టు అయిన నిందితులు మహారాష్ట్ర కురాష్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి అసలు జరగని రాష్ట్ర స్థాయి పోటీల కోసం రికార్డులను తప్పుగా సష్టించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసపూరిత పత్రాలను ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కనీసం 60 మందిని పోలీసులు గుర్తించారని ఆ అధికారి తెలిపారు. కురాష్ అనేది మధ్య ఆసియాలో ఉద్భవించిన ఒక రకమైన నిటారుగా నిలబడి చేసే జాకెట్ రెజ్లింగ్. ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్రీడ అని, మహారాష్ట్ర కురాష్ అసోసియేషన్ అధ్వర్యంలో 2012 నుంచి మహారాష్ట్రలో దీనిని ఆడుతున్నారని పోలీసులు తెలిపారు. క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులకు కురాష్ వంటి క్రీడలలో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు అందిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఒక అధికారి తెలిపారు. 'ఫిర్యాదు అందిన తర్వాత మేము విచారణ ప్రారంభించాము. ఆర్టీఐ దరఖాస్తు ద్వారా పొందిన పత్రాలను కూడా పరిశీలించగా మాకు అనేక వ్యత్యాసాలు కనిపించాయి' అని ఆయన అన్నారు. 2016 నుంచి 2019 మధ్య జరిగిన పోటీలను ఇండియన్ కురాష్ అసోసియేషన్‌తో సంబంధం లేని సంస్థలు నిర్వహించాయని, సర్టిఫికెట్లపై ఉన్న సంతకాలను స్కాన్ చేసి అతికించారని విచారణలో తేలిందని ఆ అధికారి తెలిపారు. పోలీసుల ప్రకారం, 2016 నుంచి 2022 మధ్య పోటీలు జరిగినట్లు చూపించే రికార్డులను సష్టించడం కోసం ఇద్దరు నిందితులు తొమ్మిది నుంచి పది సంవత్సరాల క్రితం తేదీలతో జిల్లా స్థాయి సంఘాల నుంచి నకిలీ భాగస్వామ్య పత్రాలను పొందారు. కనుగొన్న వ్యత్యాసాలలో 2016 17 లో జారీ చేసినట్లుగా చెబుతున్న సర్టిఫికెట్లలో జిల్లా పేరు ఉస్మానాబాద్‌కు బదులుగా ధరాశివ్ అని పేర్కొనడం కూడా ఉంది. వాస్తవానికి ఆ పేరు 2023 లో మాత్రమే మార్చబడింది. అదేవిధంగా పూర్వపు ఔరంగాబాద్ జిల్లాకు చెందిన సర్టిఫికెట్లలో ఛత్రపతి శంభాజీనగర్ అని పేర్కొనడం కూడా కనిపించిందని ఆ అధికారి తెలిపారు. మహిళల కేటగిరీకి చెందిన సర్టిఫికెట్లపై పురుషుల పేర్లు ఉన్నట్లు... అలాగే అనేక సర్టిఫికెట్లకు సీరియల్ నంబర్లు లేనట్లు కూడా పోలీసులు గుర్తించారని ఆయన వివరించారు. ఈ రాకెట్ 2016 తర్వాత ప్రారంభమైనట్లు కనిపిస్తోందని, వెయ్యికి పైగా సర్టిఫికెట్లు పంపిణీ చేసి ఉండవచ్చని తెలిపారు. ఇలాంటి సర్టిఫికెట్లను వివిధ ప్రభుత్వ శాఖలకు తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 60 మందిని పోలీసులు గుర్తించారని, అయితే దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు. నిందితులను విచారిస్తున్నామని, ఈ రాకెట్ పరిధిని నిర్ధారించడానికి పోలీసులు ఇతర ఆధారాలను సేకరిస్తున్నారని ఆయన చెప్పారు. పోలీసు శాఖకు చెందిన సిబ్బంది ఎవరైనా డూప్లికేట్ లేదా నకిలీ సర్టిఫికెట్లు పొందారా అనే విషయాన్ని కూడా పోలీసులు ధ్రువీకరిస్తున్నారని తెలిపారు.

# ప్రపంచ ఎగుమతుల్లో చైనా గణనీయ వృద్ధి

**బీజింగ్:**ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది మొదటి ఎనిమిది నెలల్లో చైనా విదేశీ వాణిజ్య ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి సాధించింది.పశ్చిమాసియాలో యుద్ధంవల్ల ఏర్పడిన ఒడిదొడుకులను ఇతరదేశాలకంటే బలంగా చైనా తట్టుకుని నిలబడింది. ఎగుమతులూ దిగుమతులూ గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయని, ఎగుమతులకంటే చిన్న దేశాలకు ఆసరా కల్పించేవిధంగా గణనీయమైన దిగుమతులకు చైనా అవకాశం ఇచ్చిందని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ విభాగం తెలియజేసినట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. ట్రంప్–జిన్‌పింగ్ సమావేశానికి కొద్దిరోజులు ముందుగా ఈ సమాచారం వెలువడింది. వారి సమావేశంలో వాణిజ్యం అతి కీలకమైన అంశంగా ఉంటుంది. ఇటీవలినెలల్లో ఎలక్ట్రిక్ వాహనాలు,పారిశ్రామిక యంత్రాలు,సెమీకండక్టర్ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా చైనా ఎగుమతి చేయడంతో గణనీయవృద్ధికి ఆజ్యం పోసింది. సప్లయ్ చైన్‌లో చైనా దూకుడు ప్రదర్శిస్తుండగా, కృత్రిమ మేధ సంబంధిత మౌలిక సదుపాయాలు,పారిశ్రామిక ఆటోమేషన్‌లో చైనా కీలక పాత్రధారిగా మారిందని బిఎన్‌పి పారిబాస్ అసెట్ మేనేజ్‌మెంట్ లో ఆసియా–పసిఫిక్ విభాగం మార్కెట్ వ్యూహకర్త ఒకరు చెప్పారు. అమెరికా–చైనా మధ్య తీవ్రమైన వాణిజ్యపోటీ ఉంది. ఇరుదేశాలమధ్యా వాణిజ్య ప్రతిష్టంభన ఇటీవలికాలంలో నెలకుంది. అమెరికాకు కీలకమైన ఖనిజాలను చైనా ఎగుమతులు నిలిపివేయగా,అత్యాధునిక టెక్ వస్తువులను చైనాకు అమెరికా విక్రయించడంలేదు. చైనా–యూరోపియన్ యూనియన్ మధ్య కూడా తీవ్రమైన వాణిజ్యలోటు ఉంది. దీనిపై త్వరలో సమావేశం జరుగనున్నది.అన్నిటికంటే ముఖ్యంగా ఈ ఏడాది ఆగస్టునెలలో హైటెక్ వస్తువులు,ఆటోమొబైల్స్‌కు భారీ డిమాండ్ ఉండటంతో చైనా 25 శాతం మేరకు ఎగుమతుల వృద్ధి సాధించిందని పిటిఐ పేర్కొంది. వాణిజ్య మిగులు కూడా రికార్డుస్థాయిలో పెరిగింది.చైనా ఆర్థికవేత్తలు ముందుగా వేసిన అంచనాలకు అనుగుణంగానే ఈ వృద్ధి నమోదైంది.ఆగ్నేయాసియా,లాటిన్ అమెరికా,ఆఫ్రికా దేశాలకు అత్యధికంగా ఎగుమతులు చేయడం ద్వారా అమెరికా విధించే అధిక సుంకాలను చైనా తట్టుకుని నిలదొక్కుకుంది. గత నెలలో చైనాకు అమెరికా ఎగుమతులు 13.3 బిలియన్ డాలర్లు మాత్రమేకావడంతో చైనాకు 29.2 బిలియన్ డాలర్ల మిగులు ఏర్పడింది. యూరోపియన్ యూనియన్‌కు 6.6శాతం, ఆగ్నేయాసియాకు 30.2 శాతం, లాటిన్ అమెరికా దేశాలకు 17.5 శాతం వంతున చైనా ఎగుమతులు చేసింది. దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, నిలకడగా ఎగుమతులు పూర్తిస్థాయిలో ఆధిక్యత సాధిస్తాయని,దీనివల్ల ఈ ఏడాదిలో సరికొత్త రికార్డుస్థాయి వాణిజ్య మిగులుకు దారితీస్తుందని ఐఎన్‌జి దచ్‌బ్యాంకులో గ్రేటర్ చైనా ఆర్థికవేత్త లిన్ సాంగ్ చెప్పారు.ఎగుమతులకంటే దిగుమతుల్లో గణనీయమైన పెరుగుదల ఉన్నట్లు చైనా కస్టమ్స్ ఏజన్సీ పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఎగుమతులు–దిగుమతులు కలిపి 17.6 శాతం వృద్ధి చెందాయి.ధనరూపేణా ఈ వృద్ధి 5.13 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. ఒక్క ఎగుమతులు మాత్రమే గత ఏడాదితో పోలిస్తే 14.6 శాతం వృద్ధి (20.17 ట్రిలియన్ యువాన్లు) సాధించాయి. ఒక్క ఆగస్టునెలలోనే చైనా వస్తు వాణిజ్యం 4.65 ట్రిలియన్ యువాన్లుగా నమోదైంది.అదేవిధంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టునెలలో చైనా ప్రపంచ దిగుమతులు 28.2 శాతం పెరిగాయి.జులైనెలలో ఈ వృద్ధి 27.5 శాతంగా నమోదైంది. వాణిజ్య మిగులు జులై నెలలో 112.5 బిలియన్ డాలర్లు ఉండగా, ఆగస్టునెలలో 119.1 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందింది. గత ఏడాది మొత్తానికి చైనా వాణిజ్య మిగులు 1.2 ట్రిలియన్ డాలర్లకు పెరగడంతో అమెరికాసహా ఇతర పెట్టుబడిదారీ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

**రికార్డుస్థాయిలో వాణిజ్య మిగులు**



## పెట్రియాట్ క్షిపణులుసహా
# ఉక్రేన్‌కు బ్రిటన్ 135 మి.డాలర్ల ప్యాకేజీ

**లండన్:**ఒకవైపు శాంతి చర్చలకు సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఉక్రేన్ గగనతల రక్షణకు 135 మిలియన్ల డాలర్ల సహాయం అందజేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది.ఈ నేపథ్యంలో మరోవైపు ఉక్రేన్‌పై రష్యా క్షిపణి దాడులు పునరుద్ధరించింది. ఉక్రేన్ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పెట్రియాట్ క్షిపణుల కొనుగోలుకు నిధులు సమకూరుస్తామని,మొత్తం 135 మిలియన్ డాలర్లు (100 మిలియన్ పౌండ్లు) ఆర్థిక సహాయం అందజేస్తామని బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. శీతాకాలానికి ముందుగానే రష్యాలో కీలక ప్రాంతాలు,మరిన్ని రిఫైనరీలపై దాడులు చేసేందుకు ఉక్రేన్ సన్నద్ధమవుతున్న తరుణంలో బ్రిటన్ ప్రభుత్వం ఈ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ఇటీవల బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్, ఆ దేశ రక్షణమంత్రి వెస్ స్ట్రీట్ ఇద్దరూ కలిసి ఉక్రేన్ రాజధాని కీవ్‌లో పర్యటించి అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సంప్రదింపులు చేశారు. శీతాకాల భయం ముంచుకువస్తున్నందువల్ల తమ దేశానికి అదనపు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేసిన తర్వాత బ్రిటన్ ప్రభుత్వం మంగళవారం ఈ ప్రకటన చేసింది.గడచిన జూన్ రెండో వారం తర్వాత ఫ్రాన్స్ వేదికగా జరిగిన జి–7 సమావేశంలో కూడా ఉక్రేన్‌కు ఆర్థిక సహాయం చేయాలని యూరోపియన్ యూనియన్ దేశాలు గట్టిగా నిర్ణయించుకున్నాయి.జెలెన్‌స్కీ చాలా ధైర్యవంతుడనీ, రష్యాను గట్టి దెబ్బ తీస్తున్నారని డోనాల్డ్ ట్రంప్ కూడా ఆయనను అభినందించారు. ఆ తర్వాత ఉక్రేన్ సరిహద్దులకు వందల కి.మీ దూరంలో ఉండే రష్యా కీలక రిఫైనరీలపై ఉధృత దాడులు మొదలయ్యాయి. ఉక్రేన్‌కు కీలకమైన ఆయుధాలు సరఫరాచేస్తే సహించబోమని బ్రిటన్‌కు ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. దీనిపై బర్న్‌హామ్ తీవ్రంగా స్పందిస్తూ, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రేన్‌కు యుద్ధ సహాయాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. ఈ హెచ్చరికలు,ప్రతిహెచ్చరికల మధ్య 100 మిలియన్ పౌండ్ల ఆర్థిక ప్యాకేజీని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

**క్షిపణి దాడులు పునరుద్ధరించిన రష్యా ఐదుగురు మృతి:63 మందికి గాయాలు**

మూడు రోజుల కాల్పుల విరమణ తర్వాత ఉక్రేన్‌పై రష్యా తిరిగి దాడులు ప్రారంభించింది.రాజధాని కీవ్ నగరంసహా మూడు జిల్లాలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో ఐదుగురు మరణించారు. మరో 63 మంది గాయపడ్డారు. రాజధాని కీవ్‌లో ముగ్గురు మరణించారు. మరో 19 మంది గాయపడ్డారు. మంగళవారం తెల్లవారకముందుగానే ఈ దాడులు జరిగాయి. ఈ క్షిపణి దాడులవల్ల మొత్తం ఐదు జిల్లాలలో నష్టం వాటిల్లినట్లు ఎమర్జెన్సీ విభాగం ప్రకటించింది.



ఉక్రేన్ వ్యాప్తంగా ప్రజా మౌలిక సదుపాయాలపై రష్యా క్షిపణులతో దాడులు చేసిందని ఉక్రేన్ అధికారులు చెప్పారు. రెండు బాలిస్టిక్ క్షిపణులు,31 క్రూయిజ్ క్షిపణులు,142 డ్రోన్లతో ఉక్రేన్ వ్యాప్తంగా 29 ప్రాంతాలపై రష్యా దాడులు చేసింది. హోలోసివిస్కీ జిల్లాలో 26 అంతస్తుల నివాసిత భవనం ఈ దాడుల్లో తీవ్రంగాధ్వంసమైంది.సోలోమెన్‌స్కీ జిల్లాలో ఐదు అంతస్తుల భవనంపై క్షిపణి దాడి చేయడంతో నివాసితులు శిథిలాల్లో చిక్కుకున్నారు.సహాయ బృందాలు పది మందిని సజీవంగా బయటకు తీశాయి. ఇదిలా ఉండగా రష్యాలో రెండు ఎస్‌యు–35ఎస్ యుద్ధ విమానాలు గగనతలంలో ఒకదానితో మరొకటి ఢీకున్నాయని రష్యన్ మీడియా ప్రకటించింది. ఈ ప్రమాదంలో ఒక పైలట్ మరణించారు.

# సౌదీపై హౌతీల భీకర దాడి

**దుబాయ్:**ఇరాన్ మద్దతుగల హౌతీ సైన్యాలు సౌదీ అరేబియాపై భీకర దాడులు చేశాయి. ఈ దాడుల్లో 73 మంది గాయపడ్డారు. ఈ చర్యలను సౌదీఅరేబియా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలో పలు పౌర, ఆర్థిక కేంద్రాలపై క్షిపణులు,డ్రోన్లతో హౌతీసైన్యాలు దాడులు చేశాయి.ఈ దాడుల్లో మహిళలు,పిల్లలు గాయపడ్డారు. అబ్హా అంతర్జాతీయ విమానాశ్రయం,కింగ్ ఖలీద్ వైమానిక స్థావరం, ప్రధాన చమురు కేంద్రం ఆరామ్‌కోలను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేశారు. పలు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. ఇంధన కార్యకలాపాలను చాలా గంటలసేపు నిలిపివేశారు. జిజాన్‌లోని కీలక చమురు శుద్ధికేంద్రానికి కూడా నష్టం వాటిల్లింది.దీంతో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 98 డాలర్లు పైగా పెరిగింది. సైదీ నగరాలైన అభాలోని జాజాన్,నజ్రీన్,ఖమీష్ ముసైత్‌లలో ఉన్న ఆర్థిక,పౌర మౌలిక సదుపాయాలపై దాడులు జరిగినట్లు సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్ మల్కీ చెప్పారు. హౌతీలను అడ్డుకునేందుకు సంకీర్ణ బలగాలు అవసరమైన కార్యాచరణ చర్యలు తీసుకుంటాయన్నారు.

# అమెరికాపై కెనడా ప్రతీకార సుంకాలు

**తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధం**
**ఉత్పత్తులను నిషేధిస్తాం జాగ్రత్త: జమైసన్ గ్రీర్ హెచ్చరిక**

**ఒట్టావా:**అమెరికాతో తాడో పేడో తేల్చుకునేందుకే కెనడా ప్రభుత్వం సిద్ధపడింది. అ మెరికా నుండి దిగుమతయ్యే బిలియన్ డా లర్ల విలువైన వస్తువులపై కెనడా విధించి న భారీ సుంకాలు మంగళవారం నుండి అ మలులోకి వచ్చాయి. దీంతో ఈ రెండు దే శాలమధ్యా సమీప భవిష్యత్తుల్లో ఒక సానుకూల వాణిజ్య ఒప్పందం కుదిరే వాతావరణం కనిపించడం లేదు. అమెరికా–కెనడా మధ్య ప్రపంచంలోనే అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఈ వాణిజ్యం విలువ 2025 ఆర్థిక సంవత్సరం లో 900 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అమెరికా విధించిన సుంకాల కారణంగా ఆగస్టునెలలో 41 వేలమంది కెనడియన్లు ఉద్యోగాలు కోల్పోయారు. అమెరికాపై ఆధారపడటం తగ్గిస్తామని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రతిజ్ఞ చేశారు. ఇరువైపులా భారీగా సుంకాలు విధించుకోవడంతో ఈ దేశాల వ్యాపారులు నానా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐతే ఒక పోల్ సర్వేలో అమెరికాపై కెనడా ప్రతీకార సుంకాలను ప్రజలు సమర్థించారు.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడా నుండి దిగుమతయ్యే వివిధ రకాల వస్తువులపై ఆగస్టు నెలాఖరులో యాభైశాతానికి పైగా సుంకాలు అమలులోకి తెచ్చారు. కార్లు ,టక్కులపై 25 శాతం సుంకాలతోపాటు పాల ఉత్పత్తులు, మద్యం, హాకీస్టిక్స్, పెర్ఫ్యూమ్స్‌పై కూడా యాభైశాతం సుంకాలు వేశారు. ఈ విషయంలో రెండు దేశాలమధ్య వివాదం చెలరేగింది. ఇప్పు డు కెనడా కూడా ప్రతీకార సుంకాలతో ట్రంప్‌ను సవాలు చేసింది. ఉక్కు, కాటన్ టీ షర్టులు, ఫర్నేచర్ సహా దాదాపు 20 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా వస్తువులపై 50 శాతం మేరకు సుంకాలు వర్తిస్తాయి. తాజా చేపలు,ఎండ్రకాయలపై కూడా సుంకాలు కెనడా విధించినప్పటికీ దేశంలోని సముద్ర ఆహార ఉత్పత్తుల వి భాగం నుండి వ్యతిరేకత ఆరవడంతో ఆ సుంకాలను ఉపసంహరించింది. తాము ఒక ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటున్నట్లు అమెరికా–కెనడా అధికారులు గతనెలలో ప్రకటించారు. కానీ ఆగస్టు నెలలో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆ తర్వాత వాటిలో పురోగతి కనిపించలేదు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ గతవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, అమెరికాతో శాశ్వతమైన వాణిజ్య ఒప్పందాన్ని, ఇరుదేశాలకు ప్రయోజనకరమైన ఉత్తమమైన ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అమెరికా సిద్ధంగా ఉంటే తాజా నిర్ణయాలన్ని రద్దు చేసుకుని కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా ఒక ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మరోవైపు అమెరికా తరపున చర్చల్లో పాల్గొన్న వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్ మాట్లాడుతూ, నిర్ణయం తీసుకోవాల్సింది కెనడా ప్రభుత్వమేననీ,వారికి ఒక అత్యుత్తమమైన ఆఫర్ ఇచ్చామని, కానీ వారు దానిని నిశితంగా పరిశీలించి వెనుదిరిగారంటూ ''ఇప్పుడు బంతి వారి కోర్టులోనే ఉంది'' అన్నారు. కొన్ని కెనడియన్ ఉత్పత్తులను అమెరికా నిషేధించే ప్రమాదం కూడా ఉందని జమైసన్ గ్రీర్ కెనడాకు ఒక హెచ్చరిక చేశారు.కెనడాకు చెందిన విమాన తయారీ సంస్థ బంబార్డియర్ తన ఉత్పత్తులను దక్షిణ ప్రాంతానికి తరలించకపోతే ఆ సంస్థతో వ్యాపారాన్ని నిలిపివేస్తామని డోనాల్డ్ ట్రంప్ సోమవారం ఒక హెచ్చరిక చేసిన మరునాడే కెనడా సుంకాలు అమలులోకి వచ్చాయి.



# చరమగీతం పాడాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. శాసనసభను ప్రజాస్వామ్య దేవాలయంగా భావించి సభ్యులంతా గౌరవప్రదంగా వ్యవహరించాలని సాంబశివరావు కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కన్నీళ్లు పెట్టుకున్న ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. స్పీకర్ ఏనాడూ తన పదవి దర్పాన్ని ప్రదర్శించలేదని, ధర్మరాజులోని ధర్మం, భూమాతలోని సహనం కలిగిన వ్యక్తిగా ఆయన అన్నారు. ఆవేశంలోనైనా వ్యక్తిగత దూషణలు, మహిళలను ఉద్దేశించిఅసభ్య పదజాలం ఉపయోగించడం తీవ్రంగా అభ్యంతరకరమన్నారు.ప్రజా సమస్యలను చర్చించాల్సిన సభలో సభ్యులు వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. చొక్కాలు విప్పి ఘర్షణలకు దిగడం కూడా శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. 'లా మేకర్స్ కాస్తా లా బ్రేకర్స్‌గా మారుతున్నారు' అని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాలకృష్ణయ్య, గౌతు లచ్చన్న, ఎస్.జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు వంటి నేతలను చూసి సభా సంప్రదాయాలను నేర్చుకునేవారమని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం సభలో ఎలా మాట్లాడాలి అనే దానికంటే పత్రికల్లో ఎలా రావాలనే దానిపై దృష్టి పెడుతున్న పరిస్థితి ఏర్పడడం బాధాకరమన్నారు. ఆ ఘటనకు సంబంధించి కచ్చితంగా సభా నియామవళి, చట్ట ప్రకారంగా పాత సాంప్రదాయాలు , పాత పద్ధతులు ఎలా ఉన్నాయో వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కూనంనేనిసాంబశివరావు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్లమెంటరీ భాషపై సభ్యులకు శిక్షణ ఇవ్వాలని, ఏ పదాలు సభలో ఉపయోగించవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. హేట్ స్పీచ్‌లపై ఉన్న కమిటీని సమర్థంగా వినియోగించి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సభలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించినా, పోలీసులు అతిగా వ్యవహరించినా వీడియో ఫుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. గతంలో శాసనసభల్లో ఇలాంటి ఘటనలపై తీసుకున్న చర్యలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ద్వేషపూరిత ప్రసంగాలు, అనుచిత ప్రవర్తనకు ఇదే చివరి రోజు కావాలని శాసనసభ ప్రజలకు పాఠాలు నేర్పించే ప్రజాస్వామ్య దేవాలయం, బడిలా ఉండాలి అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# బిఆర్ఎస్ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మధుసూదనచారి, ఎల్.రమణ, దాసోజు శ్రావణ్‌లతో పాటు మరికొందరు మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతుండగా అడ్డుకోవడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే వారు అక్కడి నుంచి కదలకపోవడంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మార్షల్స్, బిఆర్ఎస్ సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. కొద్దిసేపు అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది.అనంతరం మార్షల్స్ బలవంతంగా వారిని శాసన మండలి ప్రాంగణం నుంచి బయటికి తీసుకువచ్చి పోలీసు వ్యాన్‌లోకి ఎక్కించి తరలించారు.

# నీ తల్లిని కాదు'

(మొదటి పేజీ తరువాయి)


ప్రాంగణంలో సోమవారం జరిగిన ఘటనలు, ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్రస్థాయి వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలకు కెసిఆర్ నైతిక బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ధనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. ఈ గందరగోళం మధ్య బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి 22ఎ నిషేధిత భూముల జాబితాపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టడంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఒకే ఊదుటున బిఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వైపు దూసుకరావడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు స్పీకర్ సభను వాయిదా వేశారు.

**'ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి'**

సభ ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేశపడటంపై స్పీకర్ తీవ్రంగా స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. 'మీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి' అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'సభలో లొల్లిపెడితే నేను భయపడను, మీరు చేసేది తప్పు. నాకున్న ఎనిమిది మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వారితో పాటు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి కూడా నా సోదరీమణులే. వారి పట్ల నాకు గౌరవం ఉంది. వారి పట్ల పోలీసుల వ్యవహార శైలిపై నివేదిక కోరాను. రిపోర్టు రాగానే చర్యలు తీసుకుంటాం. కానీ ముందు నా తల్లిని అవమానించినందుకు ఏమి సమాధానం చెబుతారు?' అని హరీశ్ రావును స్పీకర్ నిలదీశారు. కానీ ముందు తన సంగతేంటో చెప్పాలని అన్నారు. తన తల్లిని దూషించిన దానికి సమాధానం చెప్పు హరీశ్ రావు అంటూ స్పీకర్ నిలదీశారు.

# సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)



సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ''ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డి సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తోంది. ఈ ఇద్దరు సభ్యులు మహిళల ఎదుట చొక్కాలు విప్పి అనుచితంగా, అసభ్యకరంగా, సమాజం తలదించుకునేలా ప్రవర్తించడాన్ని కూడా ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఇలాంటి ప్రవర్తన శాసనమండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదని, శాసన సభాపతి గౌరవం, అధికారం రాజ్యాంగ బద్ధ హోదాకు తీవ్ర భంగం కలిగించిందని ఈ సభ భావిస్తోంది. ఇది తెలంగాణ శాసనసభ గౌరవం, సభా హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కలిగించే చర్యగా ఈ సభ పరిగణిస్తోంది. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఏవైనా సరే, సభాపతి హోదాలో ఉన్న వ్యక్తి గౌరవాన్ని, అధికారాన్ని తగ్గించే ఉద్దేశంతో సభ్యులు ప్రవర్తించడాన్ని సమర్థించబోమని ఈ సభ స్పష్టం చేస్తోంది. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటాన్ని సహించేదిలేదని సభ అభిప్రాయపడుతుంది. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు బాధ్యత స్వీకరించి, ఈ సభ హుందాతనం, సభా మర్యాదలను పరిరక్షించేందుకు, శాసనసభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. తాతా మధుసూదన్, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ శాసనమండలి సభ్యులుగా ఉన్నందున, ఈ తీర్మానం ప్రతితో పాటు సభ ముందు ఉంచిన ఆధారాలు, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు, వాటికి సంబంధించిన కార్యకలాపాల వివరాలను తెలంగాణ శాసనమండలి చైర్మన్‌కు పంపించాలని సభ తీర్మానిస్తోంది. ఈ అంశంపై శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలి'' అని కోరుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహా సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదిస్తున్నట్లు స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరి ప్రకటించారు.

**దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు : మంత్రి దామోదర్ రాజ నర్సింహా**

అంతకు ముందు మంత్రి దామోదర రాజ నర్సింహా మాట్లాడుతూ ''దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు... దళితుల చరిత్ర అంటే పోరాటాల చరిత్ర.. ఆత్మగౌరవ చరిత్ర. ఆత్మగౌరవమే మా అలంకారం.. ఆత్మగౌరవమే మా స్ఫూర్తి. ఆ ఆత్మగౌరవంతోనే ఈ స్థాయికి వచ్చాం'' అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే యువత తిరగబడుతుందని, తెలంగాణ యువతను, ముఖ్యంగా దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు.తరతరాలుగా వివక్ష, అవమానాలను ఎదుర్కొంటూ, పోరాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులతో ఈ స్థాయికి వచ్చామని అన్నారు. ఇలాంటి ఘటనలు తమను భయపెట్టలేవని, మరింత బలంగా, మరింత ఆత్మగౌరవంతో నిలబడేలా చేస్తాయని స్పష్టం చేశారు.కుల వివక్ష, అసమానతలు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా తరతరాలుగా పోరాటాలు జరిగాయని, ఆ పోరాటానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఆత్మగౌరవంతో జీవించడం, సమానత్వంతో జీవించడం, ఎవరి ముందు తలవంచకపోవడమే అంబేద్కర్ చూపిన మార్గమని తెలిపారు.స్పీకర్‌ను, ఆయన తల్లిని అవమానించే విధంగా మాట్లాడటం అత్యంత హేయమైన విషయమని మంత్రి తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు, అభిప్రాయ భేదాలు సహజమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, విధానాలను విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కానీ వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను అవమానించడం, ఒక తల్లిని దూషించడం అత్యంత దిగజారుడుతనమని మంత్రి పేర్కొన్నారు. స్పీకర్ పదవి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, అది రాజ్యాంగబద్ధమైన పదవి అని మంత్రి అన్నారు. శాసనసభ, స్పీకర్ పదవి, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగ సంస్థలను, వాటి అధిపతులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**సభాపతి పీఠాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదు : ఎన్. పద్మావతి రెడ్డి**

మహిళా పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బిఆర్ఎస్ నేతలు, సభ్యులు వ్యవహరించడం సభ్యసమాజం తలదించుకునే ఘటన అని కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూఒక మహిళగా, ప్రజాప్రతినిధిగా ఇలాంటి అంశంపై శాసనసభలో మాట్లాడాల్సి రావడమే తీవ్ర బాధ కలిగిస్తోందన్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులను అవమానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. 10 మంది పురుషులు చొక్కాలు విప్పి మహిళా పోలీసుల వైపు దూసుకొస్తే అక్కడ విధుల్లో ఉన్న యువ మహిళా కానిస్టేబుళ్లు ఎంతటి మానసిక వేదన, భయానికి గురై ఉంటారో ఊహించుకోవాలని అన్నారు. ఆ దృశ్యాలను చూడటానికే భయమేస్తోందని, విధి నిర్వహణకు వచ్చిన ఆడబిడ్డలు ఇలాంటి అవమానాన్ని ఎదుర్కోవడం తనను కలచివేసిందన్నారు. నల్లచొక్కాలు ధరించడంపై ఎవరికీ అభ్యంతరం లేదని, సభా నియమాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి సమావేశాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సభాపతి గౌరవం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, అది మొత్తం శాసనసభ గౌరవమని పద్మావతి రెడ్డి పేర్కొన్నారు. మహిళా పోలీసులపై అవమానకరంగా ప్రవర్తించిన వారితోపాటు సభాపతి, మహిళా ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలనిసభాపతిని కోరారు.

# గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

జూలై 29న నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 2,76,085 మంది విజయవంతంగా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించారు. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు గడువును సద్వినియోగం చేసుకోవాలని బోర్డు సూచించింది.ఈ నియామక ప్రక్రియలో తొలిసారిగా ఎఎస్‌పిఎఫ్, ఫైర్ సర్వీసెస్ శాఖల్లో మహిళలకు 33.3 శాతం అంటే మూడో వంతు రిజర్వేషన్ కల్పించారు. అలాగే పోలీసు నియామకాల్లో ఎస్సీ అభ్యర్థులకు గ్రూప్1, గ్రూప్2, గ్రూప్ 3 రిజర్వేషన్లను తొలిసారిగా అమలు చేస్తున్నారు. అభ్యర్థుల ధ్రువీకరణలో భాగంగా ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా పకడ్బందీగా చేపడుతున్నారు. ఇప్పటికే 95 శాతానికి పైగా అభ్యర్థుల ఆధార్ వెరిఫికేషన్ పూర్తయినట్లు బోర్డు వెల్లడించింది. దరఖాస్తుల గడువు పొడిగించినప్పటికీ చివరి నిమిషంలో సర్వర్ సమస్యలు, అధిక ట్రాఫిక్ కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని బోర్డు హెచ్చరించింది. అర్హత ఉన్న అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తులు, నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం బోర్డు అధికారిక వెబ్‌సైట్ సంప్రదించాలని పేర్కొంది.

# ఘోర అవమానం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయామనే ఉక్రోషంతో, తిరిగి రాష్ట్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలనే దుర్బుద్ధితోనే బిఆర్ఎస్ ఈ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజం దశాబ్దాలుగా పోరాడిందని,అలాంటి తెలంగాణలో మళ్లీ ఫ్యూడల్ మనస్తత్వం, దొరలు, జాగీర్దారులు, జమీందారులు, పెత్తందారుల ఆలోచనా విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**ఇదొక పెద్ద కుట్ర...**

సభలో జరిగిన రచ్చ ఆషామాషీగా జరిగలేదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని భట్టి విక్రమార్క అన్నారు. 'ఫామ్ హౌస్ కాన్స్పిరసీ'లోనే ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు పథకం చేశారని ఆయన ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన రూల్స్ ప్రకారమే టీషర్ట్‌పైన నినాదాలు రాసుకుని వస్తే నిలిపివేశారని వివరించారు. ఆ నిబంధనలు అమలు చేసినందుకే సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక మహిళను, ముఖ్యంగా సభాపతి తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరమన్నారు. తాము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సభాపతి స్థానాన్ని గౌరవించామని గుర్తు చేశారు. బిఆర్ఎస్ అనుసరిస్తున్న విధానం 'స్పిరిట్ ఆఫ్ డెమోక్రసీ'ని పూర్తిగా దెబ్బతీసే విధంగా ఉంటుందని ఆరోపించారు.ఇలాంటి కుట్రదారులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. 'ఫామ్‌హౌస్ కుట్ర'ను శాసనసభ పూర్తిగా ఖండించాలని కోరారు.

**ఆ 'గాయాల పట్టీలు' కనిపించలేదు....?**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు గాయాలు జరిగినట్టు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టీలు కట్టుకున్నారని, 'ఇవాళ' (మంగళవారం) వారిని సభలో చూస్తే ఆ పట్టీలు కనిపించలేదని, గాయాలు కూడా లేవన్నారు. అనిరుథ్‌రెడ్డి మాట్లాడుతూ,విజయరమణారావు కెసిఆర్ సూచన మేరకే వీదిరౌడిల్లాగా ప్రవర్తించారని మండిపడ్డారు. టి.రామ్మోహన్ రెడ్డి శాసనసభకు రాకుండా జీతభత్యాలు పొందుతున్న కెసిఆర్‌ను బర్తరఫ్ చేయాలని, మట్ట రాగమయి, యశ్వసిని రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ లు వ్యవహరించిన తీరు బాధకరమన్నారు. మహి ళా పోలీసుల ఎదుటే షర్టులు విప్పడం విచారకరమన్నారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కౌశిక్ రె డ్డిపైన కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. దానంనాగేందర్ మాట్లాడుతూ స్పీకర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఎమ్మెల్సీలపైన చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్యానల్ స్పీకర్లుగా కూనంనేని,కడియం, బాలునాయక్,కౌసర్**

వర్షకాల శాసనసభ సమావేశాల ప్యానల్ స్పీకర్ల జాబితాను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ప్యానల్ స్పీకర్లుగా సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,బాలు నాయక్, కౌసర్ మొయినుద్దీన్‌లను ప్యానల్ స్పీకర్లుగా ప్రకటించారు.

**మాజీ ఎమ్మెల్యేల మరణం పట్ల శాసనసభ సంతాపం...**

మాజీ ఎమ్మెల్యేలు వంగ సుబ్బారావు, కొమ్మిడి నర్సింహరెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, జి.సిద్ధయ్య మరణం పట్ల శాసనసభ సంతాపం వ్యక్తం చేస్తూ కొద్ది మౌనం వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

**''పాలిటెక్నిక్'' విలీన అంశాన్ని విరమించుకోవాలి..**
**అసెంబ్లీలో సిపిఐ వాయిదా తీర్మానం...**
**తిరస్కరించిన స్పీకర్...**

శాసనసభలో వాయిదా తీర్మాన నోటీసు ఇచ్చిన సిపిఐ ఎల్‌పి నేత కూనంనేని సాంబశివ రావు పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.ఈ అంశంపై చర్చించేందుకు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అత్యవసర ప్రజాప్రాముఖ్యత కలిగిన ఈ నిర్దిష్ట విషయంపైన చర్చకు అనుమతించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ లో విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవడంతో పాటు, దీనికి సంబంధించిన జిఒ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలన్నారు. కాగా ఈ తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు.

# ఫామ్‌హౌస్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

డిసిపి జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన చికి త్స కోసం హైదరాబాద్ తరలించారు. ఎర్రవల్లిలో ని కెసిఆర్ ఫాంహౌజ్ వద్దకు డప్పు చప్పులకు పిలు పు నిచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ నేత సతీష్ మాదిగ స్వ యంగా డప్పు వాయిస్తూ అనుచరులతో ర్యాలీగా తరలివచ్చి హంగామా సృష్టించారు. అలాగే ఎమ్మెల్యేలు వేముల వీరేశం, అనిల్ కుమార్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్ తమ అనుచరులతో ఎర్రవల్లి సమీపంలోకి అడుగు పెట్టగా, పోలీసులు వారిని ఎక్కడికక్కడే అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్‌ను దూషించిన సంఘటనలో గులాబీ అధిపతి కెసిఆర్ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఎర్రవల్లి దారులన్నీ పోలీస్ మయం కాగా, అరెస్టులను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసుల స్వల్ప లాఠీచార్జి చేశారు. అయితే ఎర్రవల్లికి తరలివస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులను దామరకుంట, మర్కుక్, వరదరాజపూర్ తదితర గ్రామాల శివారులలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సాయంత్రం వరకు ఎర్రవల్లి శివారులో ఉద్రిక్త వాతావరణం కనిపించగా, పోలీసులు 144 సెక్షన్ విధించినప్పటికీ ఆయా పార్టీల శ్రేణులు తరలివచ్చి గొడవలకు దిగడంతో పలువురు నేతలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరమాల్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, ఆమె సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడం కనిపించింది.

**నిమ్స్‌లో తూంకుంట నర్సారెడ్డికి పరామర్శ**

నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట మాజీ డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితర కాంగ్రెస్ నేతలు మంగళవారం పరామర్శించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ వద్ద ఉదయం జరిగిన నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తల దాడిలో నర్సారెడ్డి తీవ్రంగా గాయపడటంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న నాయకులు, అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. నర్సారెడ్డికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆయన త్వరగా కోలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.

# ఫైనల్లో ఎదురీదుతున్న సౌత్

## తిలక్ అజేయ అర్ధశతకం

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ పట్టుబిగించగా.. సౌత్ జోన్ ఎదురీదుతోంది. చిదంబరం స్టేడియంలో ఈస్ట్ బౌలర్ల ధాటికి ఓపెనర్లు తేలిపోగా దేవ్దత్ పడిక్కల్(62) అర్ధ శతకంతో మెరిశాడు. మహమ్మద్ షమీ(2–17), ముకేశ్ కుమార్(2–36)లు ఆరంభంలోనే దెబ్బకొట్టినా.. పడిక్కల్, కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్) నిలబడడంతో ఈస్ట్ కాస్త కోలుకుంది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆరు వికెట్లు కోల్పోయిన సౌత్ 466 పరుగులు వెనకబడి ఉంది. ఈస్ట్ జోన్తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తడబడుతోంది. చిదంబరం స్టేడియంలో ఇషాన్ కిషన్(270) రికార్డు డబుల్ సెంచరీతో భారీ స్కోరందించగా.. ఈస్ట్ బౌలర్లు ముకేశ్ కుమార్(2–36), మహమ్మద్ షమీ(2–17)లు ఆదిలోనే సౌత్ను తీసి దెబ్బతీశారు. మూడో రోజు తొలి సెషన్లోనే రికీ భుయి(1)ని ముకేశ్ పెవిలియన్ పంపగా.. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్(32)ను శిఖర్ మోహన్ ఔట్ చేశాడు. అంతే.. 70 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. ఓపెనర్లు విఫలమైనా దేవదత్ పడిక్కల్ (62) అర్ధ శతకంతో మెరిశాడు.



### తిలక్ నిలబడ్డాడు..

శ్రీలంక పర్యటనలో సెంచరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఈస్ట్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే.. అతడిని ముకేశ్ వెనక్కి పంపి రెండో వికెట్ సాధించాడు. ఆపై షేక్ రషీద్(27), స్మరణ్ రవిచంద్రన్(23)లను షమీ బోల్తా కొట్టించాడు. అంతే.. 174కే ఈస్ట్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్), శ్రేయాస్ గోపాల్(26)లు కీలక భాగస్వామ్యంతో ఆదుకున్నారు. టీ సెషన్లో నింపాదిగా ఆడిన వీరు ఆరో వికెట్కు 70కి పైగా రన్స్ జోడించారు. అయితే.. గోపాల్ను ఖరేషి ఔట్ చేసి సౌత్కు షాకిచ్చాడు. అయినా సరే తిలక్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడాడు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి సౌత్ ఆరు వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్లో 466 పరుగులు వెనకబడి ఉంది. మరొక్క రోజే ఆట మిగిలి ఉండడంతో ఈస్ట్ జోన్ టైటిల్ను ముద్దాడడం లాంఛనమే.



## కాషాయం కథ ముగిసె
## ఆసియాడ్లో నీలం జెర్సీతో టీమిండియా

భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్కప్ ముందు నీలం రంగు స్థానంలో కాషాయంను ప్రవేశపెట్టడంపై విమర్శలు రాగా.. ఆ టోర్నీలో అదే జెర్సీతో ఆడిన టీమిండియా నిరాశపరిచింది. దాంతో.. రాబోయే టోర్నమెంట్లలో మునపటి బ్లూ కలర్నే కొనసాగించాలని భారత జట్టు నిర్ణయించుకుందని సమాచారం. త్వరలో జరుగనున్న 20వ ఆసియా క్రీడల్లో హర్మన్ప్రీత్ సింగ్, సలీమా టెటె సారథ్యంలోని జట్లు తమకు అచ్చొచ్చిన నీలంతోనే బరిలోకి దిగనుందని హాకీ ఇండియా వర్గాలు చెబుతున్నాయి. భారత హాకీలో కాషాయం కథ ముగిసింది. ఆగస్టులో జరిగిన ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ వరల్డ్ కప్లో ఆరెంజ్ జెర్సీతో ఆడిన టీమిండియా..ఈసారి సంప్రదాయ నీలం రంగుకే ఓటేయనుంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో నీలం రంగు జెర్సీతోనే భారత పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయని సమాచారం. ఈ మెగా ఈవెంట్లో తొలి ప్రధాన్య కిట్ రంగుగా నీలం ఉండనుందని హాకీ ఇండియా తెలిపింది.

## అఫ్గాన్తో టి–20లకు సుందర్ ఫిట్
## బుమ్రాపై నిర్ణయం ఆరోజే




శ్రీలంక పర్యటనకు దూరమైన భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్నెస్ సాధించాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్తో జరుగనున్న టీ20 సిరీస్కు ఎంపికైన ఈ స్పిన్ ఆల్రౌండర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో ఫిట్నెస్ నిరూపించుకున్నాడు. దాంతో.. మూడు మ్యాచ్ల సిరీస్లో సుందర్ ఆడడం ఖాయమైంది. మరో నాలుగు రోజుల్లో తొలి మ్యాచ్ ఉన్నందున ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ స్పీడ్స్టర్ ఫిట్నెస్పై సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నిర్ణయం వెలువడనుంది. అఫ్గనిస్థాన్తో టీ20 సిరీస్కు మరో నాలుగు రోజులే ఉంది. స్వదేశంలో జరుగుతున్న ఈ సిరీస్కు ఎంపికైన ఆటగాళ్ల ఫిట్నెస్ కోసం నిరీక్షిస్తున్న భారత జట్టుకు గుడ్న్యూస్. స్పిన్ ఆల్రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్నెస్ నిరూపించుకున్నాడు. గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమైన సుందర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో నిర్వహించిన ఫిట్నెస్ పరీక్షలో గట్టెక్కాడు. అయితే.. ఇప్పటికీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లోనే ఉన్న జస్ప్రీత్ బుమ్రా, పేస్ ఆల్రౌండర్లు హర్షిత్ రానా, నితీశ్ కుమార్ రెడ్డిల ఫిట్నెస్పై స్పష్టత రాలేదు. ఈ ముగ్గురు ఫిట్గా ఉన్నారా? లేదా? అనే విషయంపై సెప్టెంబర్ 9న బీసీసీఐ ప్రకటన చేయనుంది. సెప్టెంబర్ 13వ తేదీన కాబూల్లో తొలి టీ20తో సిరీస్ మొదలవ్వనుంది.



## పేగుల ఆనారోగ్యంతో
# రొమ్ము కేన్సర్ ముప్పు!

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా కాంప్రిహెన్సివ్ కేన్సర్ సెంటర్ శాస్త్రవేత్తలు నిర్వహించిన తాజా పరిశోధనలో ఒక కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పేగుల్లో ఉండే సూక్ష్మ జీవుల సమతుల్యత (గట్ మైక్రోబయోమ్) దెబ్బతినడం వల్ల బైల్ యాసిడ్లు (పిత్త ఆమ్లాలు) శరీరంలో అధికంగా పేరుకుపోతాయని, ఈ పరిస్థితి రొమ్ము కేన్సర్ ఇతర అవయవాలకు వేగంగా వ్యాపించడానికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని వారు గుర్తించారు. ఈ పరిశోధన భవిష్యత్తులో రొమ్ము కేన్సర్ వ్యాప్తిని అడ్డుకునే కొత్త చికిత్సా మార్గాలకు దారి తీసే అవకాశముందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మన పేగుల్లో కోట్లాది ప్రయోజనకరమైన సూక్ష్మ జీవులు నివసిస్తుంటాయి. వాటినే గట్ మైక్రోబయోమ్ అని పిలుస్తారు. జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థ, శరీర జీవక్రియలను సమతుల్యం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే అనారోగ్యకరమైన ఆహారం, యాంటీబయోటిక్స్ అధిక వినియోగం లేదా ఇతర కారణాల వల్ల ఈ సూక్ష్మ జీవుల సమతుల్యత దెబ్బతింటే దానిని గట్ డిస్బయోసిస్ అంటారు. ఈ పరిస్థితిలో బైల్ యాసిడ్ల రసాయన కూర్పును నియంత్రించే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో బైల్ యాసిడ్లు అధికంగా పేరుకుపోతాయి. ఇవి జీర్ణక్రియకు అవసరమైనవే అయినప్పటికీ, పరిమితికి మించి ఉంటే శరీర జీవక్రియ, రోగనిరోధక వ్యవస్థపై



ప్రతికూల ప్రభావం చూపుతాయి.

**హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్...** తాజా అధ్యయనం ప్రధానంగా హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ (హెచ్ఆర్+) రొమ్ము కేన్సర్పై దృష్టి సారించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము కేన్సర్ రకం. ఈ కేన్సర్ ప్రారంభ దశలోనే శరీరంలోని లింఫ్ గ్రంథులు, ఊపిరితిత్తులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఒకసారి ఇతర అవయవాలకు వ్యాపించిన తర్వాత చికిత్స మరింత క్లిష్టమవుతుంది. ఇప్పటివరకు గట్ డిస్బయోసిస్ ఉన్న రోగుల్లో చికిత్స ఫలితాలు అంతగా ఆశాజనకంగా ఉండవని తెలిసినా, దానికి కారణమైన జీవశాస్త్రీయ ప్రక్రియ స్పష్టంగా తెలియలేదు. ఈ కొత్త అధ్యయనం ఆ లోటును పూరించింది. గట్ మైక్రోబయోమ్ దెబ్బతినడం వల్ల బైల్ యాసిడ్లు పెరగడం, అవి వాపును ప్రేరేపించడం, చివరకు కేన్సర్ కణాల వ్యాప్తిని వేగవంతం చేయడం అనే పూర్తి ప్రక్రియను శాస్త్రవేత్తలు వివరించారు.

**అందుబాటులో ఉన్న మందులు ప్రయోజనకరమేనా?...** బైల్ యాసిడ్ సీక్వెస్ట్రెంట్స్ అనే మందులు తీసుకున్న మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్ రోగులు ఇతరులతో పోలిస్తే ఎక్కువకాలం జీవించినట్లు పరిశోధకులు గమనించారు. ఈ మందులు ఇప్పటికే అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్డిఏ) ద్వారా ఇతర జీవక్రియ సంబంధిత వ్యాధుల చికిత్సకు ఆమోదం పొందాయి. అయితే ఈ మందులే నేరుగా కేన్సర్ వ్యాప్తిని అడ్డుకుంటున్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి మరిన్ని పరిశోధనలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**భవిష్యత్ చికిత్సలపై ఆశలు...** రొమ్ము కేన్సర్ చికిత్సల్లో తాజా అధ్యయనం ఒక కొత్త దిశను సూచిస్తోంది. గట్ మైక్రోబయోమ్ను ఆరోగ్యంగా ఉంచడం, బైల్ యాసిడ్ల స్థాయిలను నియంత్రించడం ద్వారా కేన్సర్ ఇతర అవయవాలకు వ్యాపించే ప్రమాదాన్ని తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాకుండా, పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తిరిగి పెంపొందించే చికిత్సలు లేదా ఇప్పటికే అందుబాటులో ఉన్న బైల్ యాసిడ్ను తగ్గించే మందులను ఉపయోగించడం ద్వారా మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్ను నివారించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, భవిష్యత్తులో పెద్ద స్థాయిలో జరిగే క్లినికల్ పరీక్షలు ఈ ఫలితాలను ధృవీకరిస్తే, రొమ్ము కేన్సర్ చికిత్సలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచి, వేలాది మంది రోగుల ప్రాణాలను కాపాడే అవకాశముంది.

## టీనా మక్లో అసాధారణ సాహసం

అమెరికాలో, 1971 నవంబర్ 24న జరిగిన డి.బి. కూపర్ విమాన హైజాకింగ్ ప్రపంచ చరిత్రలో ఇప్పటికీ అంతుబట్టని అతిపెద్ద రహస్యాల్లో ఒకటిగా నిలిచింది. 'డాన్కూపర్' అనే పేరుతో విమానంలో ప్రయాణించిన ఓ వ్యక్తి తన వద్ద బాంబు ఉందని ప్రకటించి, రెండు లక్షల డాలర్లు, నాలుగు పారాచూట్లను డిమాండ్ చేశాడు. అనంతరం డబ్బుతో పాటు పారాచూట్ ధరించి విమానం నుంచి దూకి అదృశ్యమయ్యాడు. అతను బతికాడా? మరణించాడా? ఆ డబ్బు ఏమైంది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం దొరకలేదు. అయితే ఈ సంఘటనలో రహస్యమయమైన హైజాకర్ కంటే ఎక్కువగా గుర్తుంచుకోవాల్సిన వ్యక్తి అప్పటికి కేవలం 22 ఏళ్ల వయస్సు గల విమాన సిబ్బంది సభ్యురాలు 'టీనా మక్లో'. అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఆమె ప్రదర్శించిన ధైర్యం, సంయమనం, సమయస్ఫూర్తి వందలాది ప్రాణాలను కాపాడింది. హైజాకర్తో గంటల తరబడి ప్రశాంతంగా మాట్లాడటం, అతని



డిమాండ్లను పైలట్లకు, అధికారులకు చేరవేయడం, ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా పరిస్థితిని నియంత్రించడం ఆమె అసాధారణ మానసిక స్థైర్యానికి నిదర్శనం. సియాటిల్లో ప్రయాణికులను విడుదల చేసిన తర్వాత కూడా హైజాకర్ టీనాను విమానంలోనే ఉండాలని ఆదేశించాడు. ఆ తర్వాత విమానం ప్రయాణిస్తుండగా, ఆమెను మిగిలిన సిబ్బందితో కలిసి కాక్పిట్లోకి పంపించి, తాను రాత్రి చీకట్లో విమానం నుంచి దూకిపోయాడు. సంక్షోభ సమయంలో భయాన్ని జయించి ప్రశాంతంగా వ్యవహరించే ఒక వ్యక్తి, ఎన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందనే వాస్తవం టీనా కథ రుజువు చేస్తుంది. కొన్ని రహస్యాలు ఎప్పటికీ ఛేదించబడకపోవచ్చు. కానీ వాటి వెనుక నిలిచిన ధైర్యవంతుల గాథలు మాత్రం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

# పల్లా సుధీర్రెడ్డి కన్నుమూత

### స్వగ్రామం పడమటిపల్లిలో అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన సిపిఐ నేతలు



పడమటిపల్లిలో....

**ప్రజాపక్షం/హైదరాబాద్/దేవరకొండ :** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్రెడ్డి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. సుధీర్రెడ్డి మరణ వార్త తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ్మ, సిపిఐ ఎమ్మెల్సీ, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయదేవి, హైదరాబాద్ నగర కార్యదర్శి స్టాలిన్లు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. సుధీర్రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం పల్లా సుధీర్రెడ్డి భౌతిక కాయాన్ని స్వగ్రామం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పడమటిపల్లి కి తరలించారు. పడమటిపల్లిలో మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణలు పాల్గొని సుధీర్రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్ మృతి కలచివేసిందన్నారు. ఆయన మృతి నర్సింహారెడ్డి కుటుంబానికి, పార్టీకి తీరని లోటన్నారు. కుమారుడిని బతికించుకోవడం కోసం నర్సింహారెడ్డి శ్రమించారన్నారు. సుధీర్ లేని లోటు ఎవరు తీర్చలేరని, నర్సింహారెడ్డి కుటుంబానికి పార్టీ సహకారం ఎల్లవేళల ఉంటుందన్నారు. నర్సింహారెడ్డి మనోధైర్యాన్ని కోల్పోకుండా పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుకుగా పాల్గొనాలని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పూర్తయ్యే వరకు వెన్నంటి ఉన్నారు. సుధీర్రెడ్డి పార్థివదేహానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు బిల్యానాయక్, కిషన్నాయక్, రమేష్నాయక్, టివిఎన్రెడ్డి, ప్రవీణ్రెడ్డితోపాటు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నేతలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్రావు, ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు రవీంద్రచారి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు యాదిరెడ్డి, 'ప్రజాపక్షం' యాడ్స్ జనరల్ మేనేజర్ మదన్, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, వెంకటరమణ, శైలేష్, అంజచారి, విజేందర్రెడ్డి, వెంకటయ్య, కనకాచారి, సుదర్శన్రెడ్డి, జయరాములు, రామస్వామి, ఆంజనేయులు, నవీన్తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో....



## ఉనికి కోల్పోతామనే విమర్శలు

**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయుసి, ఆర్ ఎల్ సి సమక్షంలో ఆగస్టు 27న యాజమాన్యంతో చేసుకున్న చారిత్రాత్మక ఒప్పందంపై పలు కార్మిక సంఘాలు కార్మికుల్లో ఉనికి కోల్పోతామనే అక్కసుతో విమర్శలు చేస్తున్నాయని ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్కుమార్ ఆరోపించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ3 ఏరియాలో మంగళవారం నాయకులు గంగాధర్, ఎం.సురేష్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య, వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎమ్మార్సీ రెడ్డి హాజరై మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యంతో కుదిరిన 23 ఒప్పంధాలను సింగరేణి కార్మికులకు వివరించారు. ఈసందర్భంగా ఏఐటియుసి చేసిన ఒప్పందలకు ఆకర్షితులై దాదాపు 20 మంది కార్మికులు యూనియన్లో చేరారు. వారికి ఏఐటియుసి జెండాలు కప్పి రాజ్కుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో సిహెచ్పి పిట్ సెక్రటరీ గంధం. శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు,కమిటీ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీ వర్క్ కమిటీ మెంబర్స్,క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు

**ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎఐటియుసి 4వ రాష్ట్ర మహాసభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మహాసభలో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు కలిసి కట్టుగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'ప్రజాపక్షంతో' పలు రంగాలకు నాయకత్వం వహిస్తున్న నేతలు మాట్లాడారు. ఆయా రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.**

### లేబర్ కోడ్లతో సింగరేణి కార్మికులకు తీవ్ర నష్టం

**వాసిరెడ్డి సీతారామయ్య,**
**ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు**



'కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో బొగ్గు గని కార్మికులకు వేజ్ బోర్డు అనేది కష్టతరంగా మారనుంది. ఇప్పటివరకు దాదాపు 1973 నుండి కార్మిక వర్గం 11 వేజ్ బోర్డులు తీసుకున్నారు. దీనివలన భారతదేశంలో బొగ్గు గని కార్మికుల వేతనాలు న్యాయ సమ్మతంగా పెరిగాయి. ఈ లేబర్ కోడ్ల ద్వారా వేజ్ బోర్డులు లేకుండా చేయాలని, కార్మిక సంఘాల ఎన్నికలు పెట్టి గుర్తింపు కార్మిక సంఘంతోనే వేజెస్ గురించి మాట్లాడాలని నిర్ణయించడం జరుగుతుంది. గతంలో ఐదు సంఘాలతో మాట్లాడేవాళ్లు కాబట్టి బార్గేనింగ్ కెపాసిటీ ఉండేది. ఇప్పుడు ఎన్నికలు పెట్టి ఏ సంఘానికి 51 శాతం వస్తదో ఆ సంఘంతోటే మాట్లాడతాం అంటున్నారు. 51శాతం అనేది ఏ సంఘానికి రాదు. కాబట్టి కార్మిక సంఘాలు లేకుండా ప్రభుత్వమే ఏదో కమిటీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా జీతాలు పెంచినట్టు చూపించాలనేది ప్రయత్నం చేస్తున్నారు. దీని వలన కార్మికులకి తీరని నష్టం జరుగుతుందన్నారు.

### స్కీం వర్కర్లకు కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించాలి


**పి.ప్రేంపావని,**
**శ్రామిక మహిళా ఫోరం అధ్యక్షురాలు**



'స్కీమ్ వర్కర్లను వర్కర్లుగా గుర్తిస్తూ, వర్కర్ హోదా కల్పించాలని ప్రధానమైన డిమాండ్. వర్కర్గా గుర్తించినప్పుడు వారికి కనీస వేతనాలు, కనీస సామాజిక భద్రతా చర్యలు ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలి. స్కీమ్లో పనిచేసేటి వాళ్ళచేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారే తప్ప వాళ్ళకి వర్కర్స్ హోదా కల్పించడం లేదు. స్కీమ్ వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, ఇవ్వాలి. 60 ఏళ్ళకు రిటైర్మెంట్ చేసిన తర్వాత వాళ్ళకి ఒక రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ తో పాటు రూ.5 వేల పెన్షన్,జీవిత భీమా ఇవ్వాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు కోడిగుడ్లు, నిత్యవసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి. ప్రతి విద్యార్థికి రూ .25 మెస్ బిల్లు చెల్లించాలి. వంట కార్మికులకు ప్రమాద భీమా, ఉచిత వైద్య సేవలు అందించాలి.'

### కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనమివ్వాలి

**ఎం.నర్సింహా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్**



కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేత నం రూ.26 వేలు చెల్లించాలి. 4 పండగ సెలవులు, 4 జాతీయ సెలవులు, 15వరకు వచ్చే ఆర్జిత సెలవులు మొత్తం కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం 23 సెలవులను అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, టెక్నికల్ సిబ్బంది, ఫోర్త్ క్లాస్ సిబ్బందికి కూడా రెగ్యులర్ ఉద్యోగి యొక్క బేసిక్ వేతనం ఇవ్వాలని అవుట్సోర్సింగ్ మార్గదర్శకాలలో ఉంది. అవుట్సోర్సింగ్ గైడ్లైన్స్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగి యొక్క బేసిక్ వేతనం దానికి సమానమైన పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు కూడా దానికి అనుగుణంగా ఉంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే నిబంధన ఉంది. భవిష్యత్తులో సమానపనికి సమాన వేతనం అందించాలని పెద్దఎత్తున పోరాటం చేయబోతున్నాం.

### సంక్షేమ బోర్డు ద్వారానే క్లెయిమ్లు చెల్లించాలి

**పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,**
**భవన నిర్మాణ కార్మిక సంఘం**



భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టాన్ని అమలు చేయడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమయింది. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఈ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇప్పుడు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును నాచురల్ డెత్, యాక్సిడెంట్ డెత్, టెంపరరీ డిజబిలిటీకి సంబంధించి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పింది. మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అసలు సంక్షేమ బోర్డు ఏర్పడ్డదే ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం. దీంట్లో వేల కోట్ల రూపాయలు సెస్ ద్వారా వసూలైన డబ్బులు గాని, భవన నిర్మాణ కార్మికులు అందులో పేరు నమోదు చేసుకునే సందర్భంలో కట్టే డబ్బుల ద్వారా వేల కోట్ల రూపాయలు సంక్షేమ బోర్డులో జమ అయి ఉన్నాయి. ఆ డబ్బులు కార్మికుల సంక్షేమం కోసం నేరుగా సంక్షేమ బోర్డు నుంచే వాడాలి. దాదాపు 400 కోట్ల రూపాయలు ఒక ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేసింది. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీని రద్దు చేసి సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు లబ్ధి చేకూర్చాలని కోరుతున్నాం.

### మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేమాలి

**వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**
**తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్యూనియన్**



రాష్ట్రంలో మునిసిపల్లో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు సుమారు 60 నుండి 65 వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని ప్రధాన డిమాండ్, పర్మనెంట్ చేసేంతవరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరుతున్నాం. తగ్గించిన వేతనాలన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెంచి ఇవ్వాలని, యథావిధిగా పాత పద్ధతిలో జీతాలు ఇవ్వాలని కోరుతున్నాం. జీతాలు తగ్గడంతో సుమారు 60వేల మంది కార్మికులంతా భయాందోళనలో గురవుతాఉన్నారు. తగ్గించిన వేతనాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తా ఉన్నాం.'

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/చండూరు :** పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన చండూరు మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటకు చెందిన పనస రాములు (55), తండ్రి నరసింహా వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.



## 104 గ్రాముల గంజాయి స్వాధీనం

### ఇద్దరు యువకుల అరెస్ట్ : సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్

**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో గంజాయితో ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్, మట్టపల్లి గంగరాజుల వద్ద గంజాయి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకొని 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నింధితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండి చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగుతూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ ఐలయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని శెట్టిపాలెం శివారు అద్దంకి నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి సుమారు 1:30నిమిషాలకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో సదరు వ్యక్తిని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మిర్యాలగూడలోని షాబునగర్‌కు చెందిన నక్క రవి(45) గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గాలిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## కత్తితో దాడి.. ముగ్గురు రిమాండ్

**ప్రజాపక్షం/మునుగోడు:** వ్యక్తిని కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఈ నెల 6న బోనాల పండుగ రోజు అదే గ్రామానికి చెందిన యానుగుల కృష్ణమూర్తి, కోనేటి భూమయ్య ఇద్దరు పక్క గ్రామమైన పేరేపల్లిలో మద్యం సేవించేందుకు వెళ్లారు. అదే బెల్ట్ షాపుకు కృష్ణాపురం గ్రామానికి చెందిన వద్దేపల్లి వేణు వెళ్లగా వేణుకు, కృష్ణమూర్తికి మధ్య ఉన్న పాత వ్యక్తిగత గొడవలతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం దాడికి దిగారు. అనంతరం వేణు కృష్ణాపురం గ్రామానికి తిరిగి వస్తుండగా భూమయ్య కొడుకు విజయరామరాజు నా తండ్రితో గొడవ పెట్టుకుంటావా అంటూ కత్తితో వేణుపై దాడి చేశాడు. ఈ దాడిలో వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు వేణు సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు కోనేటి భూమయ్య,యానుగుల కృష్ణమూర్తి, కోనేటి విజయ రామరాజు ముగ్గురిని అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు తెలిపారు.

## సొసైటీ ట్రిబ్యునల్ కోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మండలం నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక పట్ల గత నెల 5 సొసైటీ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను అమలు చేయాలని చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు మంగళవారం రాష్ట్ర హ్యాండ్లూం, టెక్స్‌టైల్స్ కమీషనర్ ఆదేశాల మేరకు నేలపట్ల గ్రామంలోని సొసైటీ కార్యాలయానికి నోటీసలు అంటించారు. నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక చెల్లదని కొంతమంది డైరెక్టర్లు ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. పిల్లలమర్రి శ్రీనివాస్‌కు ముగ్గురు సంతానం ఉన్నారు. సొసైటీ ఎన్నికల నియమావళి ప్రకారం డైరెక్టర్‌గా పోటీ చేయడానికి ఇద్దరి కన్న ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న వారు పోటీకి చేయరాదనే నిబంధన మేరకు విచారించిన ట్రిబ్యునల్ కోర్టు పిల్లలమర్రి శ్రీనివాస్ డైరెక్టర్ ఎన్నిక, చైర్మన్ ఎన్నికపై మధ్యంతర స్టే గత నెల 5న ఇచ్చిందని ఎడిఓ గోపాల్ తెలిపారు. అదేవిధంగా పిల్లలమర్రి శ్రీనివాస్‌కు వాట్సప్ ద్వారా, సొసైటీ కార్యదర్శికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ట్రిబ్యునల్ కోర్టు నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సొసైటీలో మధ్యంతర స్టే ఆర్డర్ ఆదేశాలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని సొసైటీ కార్యదర్శికి సూచించారు. ఆయనతోపాటు డైరెక్టర్లు గంజి శ్రీనివాసులు, తడక కోటేశ్వర్‌లు ఉన్నారు.



# పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం



ఓటరు జాబితా పరిశీలకురాలు ఎ.శ్రీ దేవసేన

**ప్రజాపక్షం/నల్లగొండ/సూర్యాపేట :** పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఎన్నికల సంఘం ముఖ్య ఉద్దేశమని నల్గొండ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఏ.శ్రీదేవసేన అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తోందని ప్రశంసించారు.అయితే మ్యాపింగ్ కాని ఓటర్లకు, పేర్లు, చిరునామాల్లో తేడాలున్న వారికి ఇచ్చిన నోటీసులపై బీఎల్ఓలకు సరైన అవగాహన లేక ఓటర్లు ఇబ్బంది పడుతున్నారని, పత్రికలు, ఛానళ్ల ద్వారా అవగాహన కల్పించాలని, 80ఏళ్లు పైబడిన వారికి ఇంటి వద్దే విచారణ జరపాలని, రెండు చోట్ల ఓటున్న వారికి ఒకే చోట ఉండేలా చూడాలని కోరారు. పరిశీలకురాలు శ్రీదేవసేన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని, అనర్హులు తొలగిపోవాలని, ఇందుకు అధికారులు, పార్టీల ప్రతినిధులు కలిసి పనిచేయాలన్నారు. నోటీసులు అందుకున్న వారికి అవసరమైన ధ్రువపత్రాలపై బీఎల్ఓ, బీఎల్ఏ కలిసి వెళ్లి అవగాహన కల్పించాలని, హియరింగ్ కేంద్రాల వద్ద ఇరువురు ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రేషనలైజేషన్ తర్వాత జిల్లాలో 1861 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి కేంద్రానికి బీఎల్ఓను, మొత్తం 5889 మంది బీఎల్ఏలను నియమించామని తెలిపారు. జిల్లాలో 15,16,253 మంది ఓటర్లు ఉండగా 13,16,860 మంది మ్యాపింగ్ పూర్తయిందని, 13,57,618 ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేశామన్నారు. మహిళా పురుష నిష్పత్తి 1017గా ఉందని, 762 మంది సీనియర్ సిటిజన్లు, 28,718 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, 2,28,939 మందికి నోటీసులు జారీ చేసి విచారణ కొనసాగుతోందని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఈవీఎం గోదాం పరిశీలన**

జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఎన్నికల గోదాంను జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాంను తెరిపించి అందులో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలించారు. గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లు, ఇతర విషయాలను కలెక్టర్ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

**అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యం**

అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ.శ్రీ దేవసేన తెలిపారు. మంగళవారం సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ.శ్రీ దేవసేన, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. చిన్న సమస్య అయినప్పటికి ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, నియోజక వర్గాలు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓ, బిఎల్ఏ నియామకం, సర్‌లో భాగంగా ఓటర్ల మ్యాపింగ్, మ్యాపింగ్ కాని వివరాలన్నింటిని వివరించారు. జిల్లాలో రేషనలైజేషన్ తర్వాత 1212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి బిఎల్ఓను నియమించడం జరిగిందని, అలాగే 4,286 మంది బిఎల్ఏలు ఉన్నారని, 10,08, 252 మంది ఓటర్లు ఉండగా, 9,11,945 ఎన్యుమరేషన్ ఫామ్స్‌ను డిజిటలైజేషన్ చేశామన్నారు. మ్యాపింగ్ కానీ, ఓటరు జాబితాలో చిరునామా, వయసు తదితర విషయాలలో తేడాలున్న 1,94,106 మంది ఓటర్లను గుర్తించి వారికి నోటీసులు జారీ చేశామని, విచారణ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. నోటీసుల జారీ, హియరింగ్‌పై ఈనెల 5, 6 తేదీలపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ప్రచార దినాల ద్వారా ఈ దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కరిస్తున్నారని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు మంచి అవగాహన కల్పించారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, ఆర్‌డిఓలు వేణుమాధవరావు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహశీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



**ఓటర్లకు అవగాహన కల్పించాలి**

సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ధృవపత్రాలు సమర్పించాలో ముందే వారికి అవగాహన కల్పిస్తే హియరింగ్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని నల్లగొండ జిల్లా ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఎ.శ్రీదేవసేన అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తిలక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి సర్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓ, బిఎల్ఏలతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కానీ ఓటర్లు, జాబితాలో తేడాలున్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, హియరింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఓటరుకు నోటీసు ఎందుకు వెళ్లిందో, అందుకు ప్రతిగా వారు ఎలాంటి ధృవపత్రాలు సమర్పించాలో హియరింగ్‌కి ముందే తెలియజేస్తే హియరింగ్ రోజు వాటిని తీసుకొని హాజరవుతారన్నారు. నోటీసుల ప్రక్రియ సవ్యంగా నిర్వహించేందుకు బిఎల్ఏలు, బిఎల్ఓలు ఇల్లుల్లు తిరగాలని అప్పుడే నోటీసులు జారీ చేసిన వారందరి సమస్యను సులభంగా పరిష్కరించవచ్చన్నారు. ఆర్‌డిఓ వేణుమాధవరావు, తహశీల్దార్ సాయి గౌడ్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** స్పీకర్ గడ్డం ప్రసాద్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అత్యంత నీచమైన పదజాలంతో మాట్లాడి దళిత సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను తీవ్రంగా అవమానించారని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం శాసనసభ స్పీకర్‌పై చేసిన అసభ్యకర వ్యాఖ్యలను నిరసిస్తూ మిర్యాలగూడ పట్టణంలో దళిత సంఘాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బహుజన ఆత్మగౌరవ నిరసన ర్యాలీ జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు డప్పు చప్పుళ్లతో భారీగా తరలివచ్చిన నాయకులు, కేటీఆర్, హరీష్‌రావు, తాతా మధుసూదన్‌ల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతిలో భారత రాజ్యాంగ పుస్తకాన్ని పట్టుకుని మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవి అత్యున్నతమైనదని, అటువంటి స్థానంలో ఉన్న దళిత నేతను దూషించడం బీఆర్ఎస్ పార్టీ నేతల అహంకారానికి, దళిత వ్యతిరేక నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సభకు రాకుండా ఫామ్‌హౌస్‌కే పరిమితమై, ఎమ్మెల్యేలను సభ బయట గందరగోళం సృష్టించడానికి పురమాయిస్తున్నారని ఆరోపించారు. సభలోకి నల్ల చొక్కాలపై నిబంధనలకు విరుద్ధంగా రాతలు రాసుకొచ్చి భద్రతా సిబ్బందిపై దౌర్జన్యానికి దిగడం, కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి నేరుగా పోలీసులపై చేయి చేసుకోవడం దారుణమన్నారు. కానీ ఈసారి మాత్రం ఎమ్మెల్సీ తాతా మధుపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని కోరారు. మొదటి నుంచీ బీఆర్ఎస్ పార్టీకి దళిత వ్యతిరేక డీఎన్ఏ ఉందనడానికి గతంలో డిప్యూటీ సీఎం పదవి నుంచి డాక్టర్ రాజయ్యను అకారణంగా తొలగించడం, సీనియర్ సభ్యులు కడియం శ్రీహరిని అసెంబ్లీలోనే బెదిరించడమే నిదర్శనమన్నారు. స్పీకర్‌ను అవమానించిన వారిపై వెంటనే చర్యలు తీసుకుని సభా గౌరవాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల, పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** వరకట్న వేధింపులు,ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులకు 3 సంవత్సరాల 6 నెలల జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిడమనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన కేసులో కారంపూడి శ్రీను, కారంపూడి ఉషారాణి, కారంపూడి సత్యనారాయణలను నిందితులుగా గుర్తించారు.ఎస్‌సి ఎస్‌టి ప్రత్యేక సెషన్స్ కోర్టు (2 అదనపు జిల్లా సెషన్స్ జడ్జి) తీర్పులో ఐపిసి 323, 504, 494 సెక్షన్ల కింద నిర్దోషులుగా ప్రకటించగా, ఐపిసి 498ఏ, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ 1989 సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్) కింద దోషులుగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు, వెయ్యి రూపాయల జరిమానా, అట్రాసిటీ కింద 6 నెలల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాలని, అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి ఎస్ఐ ఎం.శోభన్, మిర్యాలగూడ ఎస్‌డిపిఓ పి.వెంకటగిరి, వాదనలు వినిపించిన అదనపు పీపీలు ఎస్.శోభారాణి, ఆర్.అఖిల, సమన్వయంతో పనిచేసిన అధికారులు ఎస్.రాఘవరావు, జి.రవి, డి.విజయ్ కుమార్, శ్రీను నాయక్, ఆర్.రవీందర్ రాథోడ్, హెచ్.పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్లను ఎస్‌పి అభినందించారు.

**వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి**

వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ కోరారు. జిల్లాలో డీజేలకు అనుమతి లేదని, లౌడ్ స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరుపక్కల విగ్రహాలను ప్రతిష్ఠించాలని, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. సోషల్ మీడియాలో ఇతర మతాల మనోభావాలు దెబ్బతీసే పోస్టులపై కఠిన చర్యలు ఉంటాయని, ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు.విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు. 24 గంటలు ఇద్దరు వాలంటీర్లు ఉండాలి, భక్తులకు క్యూలైన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మద్యం, పేకాట, అసభ్య నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు నిషేధం. పాయింట్ బుక్ నిర్వహించాలి, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే 112కు సమాచారం ఇవ్వాలి.

# తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి




మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నప్పటికి విద్యుత్ అంతరాయం, మోటార్ల మరమ్మత్తులు, పైపులైన్ లీకేజీల కారణంగా అప్పుడప్పుడు సరఫరాకు అంతరాయం ఏర్పడుతున్నదని తెలిపారు. భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా గతంలో వినియోగంలో ఉన్న దోసపహాడ్ ప్రాజెక్టును పునరుద్ధరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. మిషన్ భగీరథ అధికారులతో ఇప్పటికే ఫీల్డ్ విజిట్ నిర్వహించి పట్టణంలో నీటి సరఫరాకు సంబంధించిన సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అవసరమైన నిధుల కోసం ప్రభుత్వ స్థాయిలో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన సమయంలో వాటర్ ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీటిని అందిస్తున్నామని తెలిపారు. వర్షాలు లేకపోవడంతో బోర్లు ఎండిపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో నీటి సమస్య ఏర్పడిందన్నారు. ఈ విషయంపై మూసీ అధికారులతో మాట్లాడి సద్దల చెరువు నింపినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి షఫీఉల్లా మాట్లాడుతూ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ పాలకవర్గం కట్టుబడి ఉందన్నారు. తాగునీటి సరఫరా సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ జాతీయ రహదారి 65 కింద ఉన్న 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే మార్గానికి కనెక్టివిటి కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సరఫరా సమస్యపై ఇప్పటి నుంచే ప్రత్యేక దృష్టి పెట్టకపోతే రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లు మాట్లాడుతూ తమ వార్డుల్లో ఎన్నికల్లో ఓడిపోయిన కౌన్సిలర్లు పెత్తనం చేస్తున్నారని, అలాంటి జోక్యాన్ని అడ్డుకోవాలని కోరారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు డాక్టర్ వి. రామ్మూర్తి, కొండపల్లి దిలీప్ రెడ్డి మాట్లాడుతూ పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా విషయంలో సూర్యాపేట ఎమ్మెల్యే జోక్యం చేసుకొని సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరారు. సుందరయ్య నగర్‌లో లీకేజి సమస్యను పరిష్కరించాలని మూడు నెలలుగా అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సరఫరా సజావుగా జరిగేలా చూడాలని కోరారు. 38వ వార్డు కౌన్సిలర్ గండూరి రమేష్ మాట్లాడుతూ పట్టణ రోడ్లపై పశువులు సంచరిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎయిర్‌టెల్ సంస్థ రోడ్లపై గుంతలు తీసి పనులు పూర్తి చేసి వెళ్లిపోయినా వాటిని పూడ్చలేదని, సంబంధిత సంస్థపై చర్యలు తీసుకొని గుంతలను వెంటనే పూడ్చించాలని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే సరుకులను అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎజెండాలో పొందుపరిచిన పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు ఇఇ కిరణ్, పబ్లిక్ హెల్త్ డిఇలు రమాదేవి, అనిల్, ప్రణయ్ రెడ్డి, మేనేజర్ బుచ్చిబాబు, ఆర్‌ఓ జ్ఞానేశ్వరి, గౌస్, ప్రసాద్ పాల్గొన్నారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వికలాంగు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బిఆర్ఎస్ నాయకులు రమనగోని రఘు అన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మొదటి అంతస్తులో ఉండడంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వికలాంగులు, వృద్ధులు మెట్లు ఎక్కి వెళ్ళాలంటే ఎలా వెళ్తారని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగులకు కార్యాలయం కిందనే సంతాకాలు, ఫోటో తీసుకునే ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా రిజిస్ట్రేషన్ అధికారి స్పందించి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

## బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సోమవారం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆందోళనతో ఎమ్మెల్యేలను ప్రభుత్వం అరెస్ట్ చేసి పోలీస్ కేసులు నమోదు చేయడం పట్ల మునుగోడులో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండలం పంతంగి, అంకిరెడ్డిగూడెం, చౌటుప్పల్ మునిసిపల్ బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బిఆర్ఎస్ జిల్లా నాయకలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్, పంతంగి సర్పంచ్ కాకి శ్రీలత సుందరయ్య, నాయకులు రమనగోని రఘు, సతీష్, మల్లేష్, తదితరులు ఉన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై పోలీసులు వారిని విడుదల చేశారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు తరలిన శ్రేణులు





**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలు మంగళవారం యాదగిరిగుట్టలో జరుగుతున్న సందర్భంగా గుండాల మండల నుండి మహాసభలకు ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను ఆధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ శ్రేణులు తరలివెళ్ళారు.

## సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయ్ రాములు సతీమణి మృతి

### నివాళులు అర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**ప్రజాపక్షం/అమరచింత :** సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె.విజయ్ రాములు సతీమణి కే.జ్యోతి క్యాన్సర్ మహమ్మారితో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత నెల రోజులుగా క్యాన్సర్ వ్యాధితో హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం జ్యోతి మృతి చెందింది. కుటుంబ సభ్యులు ఆమె భౌతికకాయాన్ని అమరచింతలోని స్వగృహానికి తీసుకువచ్చారు. ఆమె మరణంతో సిపిఐ శ్రేణులు తీవ్ర విషాదానికి గురయ్యారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ, సిపిఐ (ఎం), సిపిఐ మాస్ లైన్, కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి నాయకులు హాజరై మృతురాలి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపి నివాళులు అర్పించారు. జ్యోతి అంతిమ యాత్రలో కూనంనేనితో పాటు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ స్లీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ, సిపిఐ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



# ఫారెస్ట్ అధికారుల నీడన అటవీ సంపద దోపిడీ

- మామడ అడవుల్లో జోరుగా అక్రమ ఇసుక విక్రయాలు
- విచ్చలవిడిగా చెట్ల నరికివేత
- మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అటవీ శాఖ యంత్రాంగం
- ఉన్నతాధికారులు, కలెక్టర్ తక్షణమే స్పందించి విచారణ జరిపించాలని స్థానికుల డిమాండ్






**ప్రజాపక్షం/నిర్మల్/మామడ :** నిర్మల్ జిల్లా మామడ మండల పరిధిలోని దిమ్మదుర్తి, బందల ఖానాపూర్ అటవీ ప్రాంతాల్లో ఫారెస్ట్ అధికారుల తీరుపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తమవుతున్నాయి. అడవికి కాపలాగా ఉంటూ అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి అటవీ సంపదను నాశనం చేస్తున్నారని గ్రామస్థులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు.ఒకప్పుడు పచ్చని చెట్లతో, అరుదైన వృక్షాలతో నిండి అలరిస్తూ, అనేక జీవరాశులకు నిలయంగా ఉన్న ఈ అటవీ ప్రాంతం నేడు కొందరు అవినీతి అధికారుల స్వార్థానికి బలవుతోందని పక్క గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అటవీ ప్రాంతం గుండా ప్రవహించే వాగులు, వంకల నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. దిమ్మదుర్తి, బందల ఖానాపూర్ అడవి మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను పెద్ద ఎత్తున నిల్వ చేసి (డంప్ చేసి), రాత్రివేళల్లో ట్రాక్టర్లు, లారీల ద్వారా పక్క ప్రాంతాలకు తరలిస్తూ అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. స్థానిక గ్రామస్థులు లేదా యువకులు ఈ అక్రమ రవాణాను చూసి ప్రశ్నిస్తే, అధికారులు సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారని లేదా ఎలాంటి చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్నారని తెలుస్తోంది. అటవీ రక్షణ కోసం కేటాయించిన వాహనాలు, సిబ్బందిని ఈ అక్రమ వ్యాపారుల రక్షణకే ఉపయోగిస్తున్నారని, ఇసుక దందా ద్వారా రోజుకు లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇసుక దందాతో పాటు అడవిలోని విలువైన వృక్షాలను రాక్షసంగా నరికివేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పచ్చని చెట్లను నరికివేసి అక్రమ కలప వ్యాపారులకు విక్రయిస్తున్న దాఖలాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అడవి మధ్యలో చెట్లను నరికివేస్తుంటే అధికారుల కంట పడకపోవడం వెనుక భారీ మొత్తంలో ముడుపులు అందుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ అధికారులు నిజంగా అడవికి కాపలా కాస్తున్నారా? లేక తమ స్వార్థ ప్రయోజనాల కోసం చెట్లను అమ్ముకుంటున్నారా? అని సమీప గ్రామాల ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిరాదారణ వల్ల అటవీ విస్తీర్ణం వేగంగా తగ్గిపోతోందని, ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తీవ్ర పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయని పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడు అన్న చందంగా అటవీ శాఖ అధికారుల ప్రవర్తన తయారైందని, అటవీ సంపద రక్షణను పూర్తిగా గాలికి వదిలేసి అక్రమ సంపాదనకే ప్రాధాన్యం ఇస్తున్నారని పక్క గ్రామాల ప్రజలు తీవ్రంగా నిరసిస్తున్నారు.ఇప్పటికైనా నిర్మల్ జిల్లా అటవీ శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులైన అధికారులను, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని అటవీ సంపదను కాపాడాలని దిమ్మదుర్తి, బందల ఖానాపూర్, సమీప గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బైంసా ప్రభుత్వ కళాశాలలో పిజి ప్రవేశాలు

**ప్రజాపక్షం /భైంసా :** పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ అండ్ పిజి కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య,కోఆర్డినేటర్ డా. యు. రవికుమార్ తెలిపారు. కళాశాలలో ఎం.ఎ. ఇంగ్లీష్ (60 సీట్లు), ఎం.కామ్. జనరల్ (60 సీట్లు) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.టిజి సిపిజిఇటి–2026 అర్హత సాధించిన విద్యార్థులు సెప్టెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లలో కళాశాల కోడ్ 059 పిజికెయును మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు.అనుభవజ్ఞులైన అధ్యాపకులు,డిజిటల్ లైబ్రరీ,అధునాతన సదుపాయాలు ఉన్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీట్ల కేటాయింపు 14న జరగనుంది. వివరాలకు: (https://cpget.tgche.ac.in). వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

## డంపింగ్ యార్డులో యంత్రాల చోరీ



**ప్రజాపక్షం / రామకృష్ణాపూర్ :** క్యాతనపల్లి మున్సిపాలిటి పరిధిలోని ఆర్‌కె 1 సమీపంలో గల డంపింగ్ యార్డులో గుర్తుతెలియని వ్యక్తులు యంత్రాలను అపహరించారు. యంత్రాలు కనిపించకపోవడంతో మున్సిపల్ సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. చోరీకి గురైన యంత్రాల విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమిషనర్ ఫిర్యాదు మేరకు రామకృష్ణాపూర్ పట్టణ ఎస్‌ఐ జాడి శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను త్వరలోనే గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## ప్రీ ప్రైమరీ పాఠశాల ప్రారంభం



**ప్రజాపక్షం/మావల:** మావల మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డిఇఒ మాధవితో కలిసి మంగళవారం ప్రారంభించారు. పాఠశాలకు వచ్చిన అధికారులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, ఆట వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో మావల సర్పంచ్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పదకొండేళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు బాలిక

**ప్రజాపక్షం/ మెదక్ :** పదకొండు ఏళ్ల క్రితం ఇంటి నుంచి తప్పిపోయిన మతిస్థిమితం లేని బాలికను జిల్లా సంక్షేమ శాఖ అధికారులు తల్లిదండ్రుల ఆచూకీ గుర్తించి వారికి అప్పగించడం జరిగిందని డి డబ్ల్యుఒ హేమభార్గవి తెలిపారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలానికి చెందిన బాలిక ఇన్నేళ్లుగా మెదక్ జిల్లాలోని బేతాని సంరక్షణ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతోంది.బాలికకు ఆధార్ లేకపోవడంతో పలుమార్లు దరఖాస్తు తిరస్కరణకు గురైంది. చివరకు మాదాపూర్ ఆధార్ కేంద్రంలో నమోదు చేయడంతో ఆధార్ నంబర్ లభించింది. దాని ఆధారంగా తల్లిదండ్రుల వివరాలు గుర్తించి, వారిని పిలిపించి బాలికను అప్పగించారు. తమ కుమార్తె తిరిగి దొరకడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది నాగరాజు, శ్రీనివాస్, సరిత, మంజుల, బేతాని ఆశ్రమ సోషల్ వర్కర్ వీరబాబు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల కూతురుసహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ఎడపలి:** చిన్నపాటి కుటుంబ కలహాలు ఒక పసి ప్రాణాన్ని, కన్న తల్లిని పొట్టనబెట్టుకున్నాయి. మనస్థాపానికి గురైన తల్లి, తన నాలుగేళ్ల కూతురితో సహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ పట్టణంలోని అస్మీ కాలనీకి చెందిన ఇమ్రాన బేగం(32) గృహిణి, ఆమె భర్త ఆసిఫ్ ఉపాధి నిమిత్తం దుబాయ్‌లో ఉంటున్నారు. వీరికి నాలుగు సంవత్సరాల వయస్సు గల కూతురు నేహా అజ్జిన్ ఉంది. గత కొంతకాలంగా ఇమ్రాన బేగం కుటుంబ విషయమై తీవ్ర మనస్థాపంతో బాధపడుతూ ఉంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఎస్‌ఐఆర్ ఫారమ్ నమోదు చేసుకొని వస్తానని ఇంట్లో వారికి చెప్పి పాప నేహా అజ్జిన్ ను తీసుకొని బయటకు వెళ్లింది. ఆ తరువాత ఎంతకూ తిరిగి రాకపోవడం, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ కావడంతో కంగారు పడిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతకడం ప్రారంభించారు. అయితే సాయంత్రం ప్రాంతంలో ఎడపల్లి మండలంలోని జానకంపేట్ గ్రామంలోని అశోక్ సాగర్ చెరువులో ఇమ్రానబేగం, ఆమె నాలుగేళ్ల కూతురి మృతదేహాలు తేలి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను వెలికి తీశారు. కుటుంబ కలహాల కారణంగానే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ విజయ్ బాబు తెలిపారు. తల్లి, కూతురు ఒకేసారి శవమై తేలడంతో అస్మీ కాలనీలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి.

## అక్రమ డిప్యుటేషన్లు నిలిపివేయాలి



**ప్రజాపక్షం / మెదక్:** ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో మెదక్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్లు చేపట్టడాన్ని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రణీద్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం జారీ చేసిన జిఒ 25 ప్రకారం సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా డిఇఒ ఇష్టానుసారంగా మండలాలు దాటి ఉపాధ్యాయులకు స్థానాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని మండిపడ్డారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన నాయకులు, జిల్లా డిఆర్ఒ ద్వారా వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్దుబాటు ఉత్తర్వులను పునఃపరిశీలించి వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి.ఐలయ్య,నాయకులు మల్లేశం పాల్గొన్నారు.

## రుణ లక్ష్యాల సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలి


అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందేలా చర్యలు

కలెక్టర్ భవేష్ మిశ్రా




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను వంద శాతం సాధించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా బ్యాంకర్లను ఆదేశించారు.అర్హులైన రైతులు, విద్యార్థులు, యువత, మహిళా స్వయం సహాయక సంఘాలు,చిన్న వ్యాపారులకు రుణాలు సకాలంలో అందేలా బ్యాంకర్లు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన డిసిసి, డిఎల్‌ఆర్‌సి సమావేశంలో 2026–27 వార్షిక రుణ ప్రణాళిక, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు, ప్రాధాన్యతా రంగాలకు ఆర్థిక సహాయం, సామాజిక భద్రతా పథకాల అమలుపై కలెక్టర్ సమీక్షించారు.2026–27 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలోని బ్యాంకులకు రూ.7,952.87 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు రూ.2,331.18 కోట్లు (29.31 శాతం) సాధించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాధాన్యతా రంగాలకు నిర్దేశించిన రూ.6,661.73 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,847.71 కోట్లు (27.74 శాతం) సాధించారని పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన విద్యార్థులకు అధిక సంఖ్యలో రుణాలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో బ్యాంకు ఖాతాలు లేని ప్రతి ఒక్కరికీ సెప్టెంబర్‌లోగా ఖాతాలు తెరవాలని సూచించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కాస్మోటిక్ ఛార్జీల జమ కోసం లక్ష్యంగా పెట్టుకున్న 3,500 ఖాతాల్లో ఇప్పటికే 1,022 కొత్త ఖాతాలు ప్రారంభించినట్లు తెలిపారు.పిఎంఇజిపి, పిఎంఎఫ్ఎంఇ, పిఎం విశ్వకర్మ, పిఎం స్వనిధి, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ తదితర పథకాల అమలును కలెక్టర్ సమీక్షించారు. రుణ లక్ష్యాల సాధనకు జిల్లా పరిశ్రమల శాఖ బ్యాంకర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం బి. రామ్‌గోపాల్, ఆర్‌బీఐ ఏజీఎం,ఎల్‌బీఓ ఎస్. రాములు,పీడీ డీఆర్‌డీఏ విజయలక్ష్మి ,ఆర్‌ఎం నవీన్ పురం,సీఎం క్రెడిట్ ఆర్‌బీఓ ఆదిలాబాద్ పియూష్, వివిధ బ్యాంకుల అధికారులు,నాబార్డ్,ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఆర్థిక భరోసానే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం / మెదక్ :** పట్టణంలో సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అనారోగ్యం, వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ మన్సూర్ అహ్మద్, గౌస్ ఖురేషీ, కాంగ్రెస్ నాయకులు భూపతి రాజ్, మధుసూదన్ రావు, ఉమర్, బాల్ రాజు, మైసాన్, చేదల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ర్యాలీ

వందశాతం అక్షరాస్యత సాధనకు కృషి చేయాలి

జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లా కేంద్రంలో పాఠశాల విద్యాశాఖ, జిల్లా వయోజన శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నవ భారత సాక్షరతా కార్యక్రమం (ఎన్‌ఐఎల్‌పి), ఉల్లాస్ అవగాహన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. చదువుకుందాం రండి... చదువు నేర్పుదాం రండి అనే పిలుపుతో విద్యార్థులు,ఉపాధ్యాయులు,అధికారులు భారీ ర్యాలీ చేపట్టారు.జుమ్మేరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మహాత్మా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. గాంధీ కూడలి వద్ద విద్యార్థులు భారీ మానవహారంగా ఏర్పడి, అక్షరాస్యత ప్రాముఖ్యతను తెలిపే ప్లకార్డులను ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు చేశారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న మాట్లాడుతూ... అక్షరాస్యత అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని ఉద్ఘాటించారు.15 సంవత్సరాలు దాటి చదువుకు దూరమైన ప్రతి నిరక్షరాస్యుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని వివరించారు. జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా విలీన విద్య సమన్వయకర్త ప్రవీణ్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ డిపిఎం శోభారాణి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు రవి బాబు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు,మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



**ప్రజాపక్షం / కాగజ్ నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని సిర్పూర్ మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలతో పాటు 420 హా మీలు నెరవేరుస్తామని కాంగ్రెస్ నమ్మబలికిందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటై వెయ్యి రోజుల పాలన పూర్తయినా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. హా మీ లు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన బిఆర్‌ఎస్ పోరా టం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.

## జోగిపేటలో ఆర్‌డిఒ కార్యాలయానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ జోగిపేట :** జోగిపేట తహసీల్దార్ కార్యాలయం పక్కన నూతనంగా ఆర్‌డిఒ కార్యాలయానికి మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. మొత్తం 3 కోట్ల 33 లక్షల రూపాయలతో జి+1 ఆర్‌డిఒ కార్యాలయం, రెసిడెన్స్ క్వార్టర్స్ నిర్మాణం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), జగన్ మోహన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పడిగే సత్యం, తహసీల్దార్ మధుకర్‌రెడ్డి, కౌన్సిలర్లు కౌషిక్, రాజశేఖర్, మర్రి అరుణకుమారి, మాజీ కౌన్సిలర్లు దుర్గేష్, హరికృష్ణ గౌడ్, అల్లే శ్రీకాంత్, పిట్ల లక్ష్మ ణ్, తుపాలకు సునీల కుమార్, కో ఆప్షన్ మెంబర్ డేవిడ్, అందోల్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు పట్లోళ్ల ప్రవీణ్, అన్న కాంగ్రెస్‌నాయకులు బేగరి అనిల్ కుమార్, గుర్రం కృష్ణ, మానుసాని పల్లి మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు కృష్ణ, ఆర్‌ఎన్‌ఎబి అదికారులు డిఇ రవీందర్, ఎఇ శశాంక్, నాయకులు గూడెం చందు మోదిని రాజు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు

డిజెలపై నిషేధం అమలు

సిపి సాయిచైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని సిపి సాయిచైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. వినాయక చతుర్థి ఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. సిపి సాయిచైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు, జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాలపై సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదన లు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామన్నారు. సిపి సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు అధికార యంత్రాంగం తరపున పూర్తిస్థాయిలో సహాయ సహకారాలందిస్తామని, జిల్లాలో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలు జరుగుతాయని, ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని, జిల్లా ప్రతిష్టను పెంపొందించాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఎలాం టి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థనాలయాల వద్ద సిసి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాల పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ప్రశాంతతకు భంగం కలిగిస్తూ అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గణేష్ ఉత్సవాలు, జండా బాలాజీ వేడుకల సందర్భంగా నిర్ణీత రోజుల్లో మద్యం విక్రయాలు జరగకుండా పకడ్బంధీ చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, శిక్షణ కలెక్టర్ సురేష్, డిఆర్ఒ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్‌డిఒలు రాజేంద్రకుమార్, విజయకుమారి, ఎసిపిలు ప్రకాష్, వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, మస్తాన్‌అలీ, వివిధ శాఖల అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


## నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

కలెక్టర్ కె. హరిత



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** వినాయక చవితి వేడుకలు, నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తుతో పాటు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఎస్‌పి నితిక పంత్ తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండపాల వద్ద భద్రతా చర్యలు పకడ్బందీగా ఉండాలని, నిమజ్జన స్థలాలను గుర్తించి అవసరమైన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, అగ్నిమాపక, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని నిమజ్జన ప్రాంతాల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఉత్సవాలు విజయవంతం అయ్యేలా చూడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు యువరాజ్ మార్మట్, ఎం. డేవిడ్, సబ్ కలెక్టర్ హర్ష చౌదరి, డిఆర్ఒ దాసరి వేణు, ఆర్‌డిఒ లోకేశ్వర రావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జోస్టిన్ జోల్, డిఎస్‌పిలు అశోక్, వహిదొద్దీన్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఉత్తమ్ ఝాడే, డిపిఒ భిక్షపతి, డిఎంహెచ్ఒ నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్లు తిరుపతి, అంజయ్య, తహసీల్దార్లు మధుకర్, రియాజ్ అలీ పాల్గొన్నారు.

## అర్ధరాత్రి పశువుల తరలింపు



**ప్రజాపక్షం / రెబ్బెన :** కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల ప్రధాన రహదారిపై అర్ధ రాత్రి వేళ పశువులను తరలిస్తున్న వాహనాల రాకపోకలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. రెబ్బెన మీదుగా మంచిర్యాల వైపు రాత్రి సమయాల్లో వరుసగా వాహనాల్లో పశువులను తరలిస్తుండటంతో స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రద్దీ తక్కువగా ఉండే సమయాన్ని ఎంచుకుని ఒకటి వెనుక మరొకటిగా వాహనాలు వెళ్తుండటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పశువుల రవాణాకు అవసరమైన అనుమతులు, పశువైద్య ధ్రువపత్రాలు, వాహనాల సామర్థ్యానికి మించి తరలిస్తున్నారా? అన్న అంశాలపై స్పష్టత కొరవడింది. అన్ని రకాల పత్రాలు సక్రమంగా ఉంటే రాత్రివేళల్లోనే తరలించాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సంబంధిత రవాణా ఎక్కడి నుంచి ఎక్కడికి సాగుతోంది, నిబంధనలకు లోబడే జరుగుతోందా? అనే వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. రాత్రివేళల్లో సాగుతున్న ఈ అక్రమ రవాణా అనుమానాలపై అధికారులు స్పందించి ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

‘మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి ‘వాల్తేరు వీరయ్య’ సక్సెస్ తర్వాత చిత్రం ‘కాకా’తో రాబోతున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయిలో హై-ఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు.’

# రీల్

## 18న ‘పిఠాపురంలో.. అలా మొదలైంది’ విడుదల



ప్రేయసి రావే’ ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన ‘పిఠాపురంలో& అలా మొదలైంది’ చిత్రం 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్ మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. డా. రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్, మణిచందన, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని మహేష్ చంద్ర సినిమా టీమ్ మరియు ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రేమ, సునిశితమైన హాస్యం, సెంటిమెంట్, తండ్రీకూతుళ్ల అనుబంధం వంటి భావోద్వేగ అంశాలతో పాటు యువతకు ఒక మంచి సందేశాన్ని అందించేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు. హాస్య బ్రహ్మ, డా. బ్రహ్మానందం వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్ ఇందులో కీలక పాత్రలో నటించారు. ఇరుముడి, విశ్వనాథం అండ్ సన్స్, మా ఇంటి బంగారం తరహా లోనే మా సినిమా కూడా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం అవుతుందని మహేష్ చంద్ర చెప్పారు. జయవాహిని, అన్నపూర్ణమ్మ, దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, జూనియర్ పవన్ కళ్యాణ్, జెడివి ప్రసాద్, కేఏ పాల్ రాము, జబర్దస్త్ శేషు ఇందులో ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి స్టోరీ డెవలప్మెంట్ డైలాగ్స్ : శ్రీరామ్ ఏదోటి, ఎడిటర్: బి సత్యనారాయణ, మ్యూజిక్ : జీసీ క్రిష్.

## నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్

### ‘సర్దార్ 2’ ప్రీరిలీజ్‌లో హీరో కార్తి



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన ‘సర్దార్’ మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ ‘సర్దార్ 2’తో థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మ ణ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందద్భంగా హీరో కార్తి మాట్లాడుతూ ‘సర్దార్’ సినిమాకు ఇక్కడ చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉంది. ‘సర్దార్ 2’ నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్. ఇలాంటి స్పై క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. నిజానికి గూఢచారులకు ఎలాంటి గుర్తింపు ఉండదు. కానీ వాళ్ల పని వాళ్లు చాలా నిజాయితీతో, ఏదీ ఆశించకుండా చేస్తారు. ‘సర్దార్ 2’ చూసే ముందు ‘సర్దార్’ సినిమా మరొకసారి చూడమని కోరుతున్నాను. ఆ సినిమా చూస్తే మీరు ‘సర్దార్ 2’కి ఇంకా స్ట్రాంగ్‌గా కనెక్ట్ అవుతారు అన్నారు . ఎస్.జె. సూర్య, డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడారు. హీరోయిన్ మాళవిక మోహన్. హీరోయిన్ ఆశిక రంగనాథ్. నిర్మాత రవిశంకర్ , డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ , నిర్మాత నాగవంశీ ,నిర్మాత అనిల్ సుంకర పాల్గొన్నారు.

## ‘కడలి’ పాత్ర ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది



వైష్ణవి చైతన్య

బేబీ’ జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్’. దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతుండటం విశేషం. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 11న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో కథానాయిక వైష్ణవి చైతన్య ‘మీడియా’తో చిట్ చాట్ నిర్వహించారు. ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్‌గా, కామ్‌గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను పోషించిన కడలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి. ప్రతి ఒక్కరిలోనూ కడలి పాత్ర ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదోక సమయంలో వారి కోసం వారు నిలబడాలి. అందుకే కడలి పాత్ర నా మనసుకు బాగా దగ్గరైంది. కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే అన్నారు. ఆదిత్య, కడలి పాత్రల మధ్య జరిగే చిన్న విషయాలకు ఎంత ఇంపార్టెన్స్ ఉందో చూపిస్తారు. ఆదిత్య యూనిక్ డైరెక్టర్. నాకు బాగా ఇష్టమైన దర్శకులలో ఆయన ఒకరు. దర్శకుడు ఆదిత్యతో నాకు ముందు పరిచయం లేదు. ఎపిక్ కథ చెప్పడానికి వచ్చినప్పుడే మొదటిసారి కలిశాను. కానీ, అప్పటికే 90s వెబ్ సిరీస్ చూసి ఉన్నాను. ఆ సిరీస్ నాకు ఎంతగానో నచ్చింది.బేబీ, ఎపిక్ సినిమాలు దేనికవే ప్రత్యేకమైనవి. ఒత్తిడి లేదు కానీ, ఛాలెంజింగ్ గా తీసుకొని ఎపిక్ సినిమా చేశాము. ఈ సినిమాలో మమ్మల్ని చూస్తున్నప్పుడు బేబీ గుర్తుకు రాకపోతే మేము విజయం సాధించినట్టే. ఎపిక్ ఖచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం మాకు మొదటి నుంచి ఉంది. మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్‌లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు. ఆ ఇద్దరు ప్రైవేట్ గా మాట్లాడుకునే మాటలు ఏవైతే ఉంటాయో, ఆ సంభాషణల మీద నడిచే సినిమా.

## 11న శ్రీలత..సాంగ్ రిలీజ్



ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా ‘ఇడుపు కాయితం‘. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్‌టైనింగ్ డ్రామాగా ఇడుపు కాయితం సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. 11న ‘శ్రీలత..’ లిరికల్ సాంగ్ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ’శ్రీలత..’ సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. అప్పటి నుంచి ఈ పాట వైరల్‌గా మారి మ్యూజిక్ లవర్స్ కు ఫేవరేట్ సాంగ్ అయ్యింది. ప్రేక్షకుల కోరిక మేరకు ‘శ్రీలత..’’శ్రీలత..’ పాటను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మంచి మెలొడీ ట్యూన్‌తో ఈ పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. ఇడుపు కాయితం సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు నటిస్తున్నారు.

## ‘ఇరుముడి’ సినిమా సందేశం ఏమిటి?

నవంబర్ వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాలలో స్వామియే శరణం అయ్యప్ప శరణు నినాదాలు మిన్నంటూతాయి. అనేక చోట్ల అయ్యప్ప భక్తులు ఎంతో నిష్టగా శ్రద్ధగా కనిపిస్తుంటారు. మండల దీక్షలో భక్తి పరవశంతో గడుపుతా రు. మాల ధారణ వేసుకోకున్నా అయ్యప్ప స్వామిని ఆరాధించే అనేక మందిలో నేను ఒకడిని. హరివరాసనం స్వామి జేసుదాసు పాట ఆ సమయంలో వింటే ఒళ్ళు పులకించి పోతుంది. కేవలం అయ్యప్ప మాల ధారణ భక్తులే కాదు ఆ పాటకు ఎంతోమంది పరవశిస్తారు. సినిమాల విషయానికొస్తే, భారతదేశంలోనే అత్యధికంగా ప్రతి ఏటా విడుదలయ్యే బాలీవుడ్ చిత్రాల తర్వాత తెలుగు చిత్రాలదే ద్వితీయ స్థానం. డైరెక్షన్ మొదలుకొని జూనియర్ ఆర్టిస్టుల వరకు కలుపుకొని 24 క్రాఫ్ట్ లుగా సినిమా నిర్మాణాన్ని చెప్తారు.

### ఆ 24 క్రాఫ్ట్ ల్లో ఒకటైన కథ

అనేది సినిమాకు ప్రాణవాయువు లాంటిది. అసలు సినిమా అనేదే ఒక సృజనాత్మక ప్రక్రియ. అనునిత్యం తమ సృజనతో అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న తెలుగు డైరెక్టర్లు ఉన్నారు, అంతర్జాతీయ అవార్డు అందుకునే స్థాయిలో తెలుగు పాట ఎదిగింది. కథాంశము సినిమాకు పెద్ద ముడి సరుకు. కథా రచయిత దాన్ని సృష్టించే తపస్వి. సినిమాను చూసి సమాజం అట్లా ఉంది అనుకోవాలా? లేక సమాజాన్ని చూసే సినిమా కథ అలా ఉంటుందని అనుకోవాలా?? అనేది అప్రస్తుతం. భాష ఏదైనా కానీ సినిమా అనేది సమాజాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన మాధ్యమం. కాబట్టి సినిమా నిర్మాతలు దర్శకులు కథా రచయితలు తమ కర్తవ్యాన్ని మరింత బాధ్యతగా నిర్వర్తించాలి. క్విడ ప్రోకో లాగా ఉండాలి.

అసలే రోజురోజుకు పలుచబడుతున్న టీచర్ గౌరవాన్ని ఇరుముడి సినిమా మరింత తగ్గించినట్టయ్యింది. అఫ్కోర్స్.. పిల్లలు బాగా చదవాలనే ఉద్దేశంతో కఠినంగా ఉండే టీచర్లు అక్కడక్కడ ఉంటారు. దండం దశగుణం భవేత్ అనేదాన్ని నమ్మే వాళ్ళు ఉన్నారు. విద్యార్థులను సక్రమంగా క్రమశిక్షణగా ఎదిగేటట్టు చేయాలనే తపనే ఉపాధ్యాయుడికి ఉంటుంది అంతే తప్ప ఎలాంటి దురుద్దేశం ఏ టీచర్‌కు ఉండదు. ముఖ్యంగా మహిళా టీచర్లు మరింత ప్రేమగా సహానుభూతిగా విద్యార్థుల పట్ల వ్యవహరిస్తారు. తమ సొంత పిల్లల కంటే కూడా విద్యారులను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే ఉపాధ్యాయులు ప్రపంచవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నారు. ఉంటారు కూడా. ఉద్యోగ నిర్వహణలో కఠినంగా ఉన్నందుకుగాను సస్పెన్షన్కు గురి అయిన ఒక మహిళా టీచర్ స్వతహాగా స్త్రీ అయి ఉండి కూడా తల్లి లాంటి పాత్రలో ఉండి కూడా స్కూలు పిల్లలని ఎమ్మెల్యే పక్కలోకి తార్చడమనేది జుగుప్సాకరమైన అంశం. ఎమ్మెల్యేకు అమ్మాయిలను తార్చడము కథకు అవసరమనుకుంటే మరో రకంగా కూడా చూపెట్టవచ్చు. మేధస్సును ఎంతోమదిస్తే కానీ ఒక కథ పుట్టించని కథా రచయిత ఒక గురువు వద్ద చదువుకున్న శిష్యుడే కదా! కథలో మహిళా టీచర్ ను పాత్రదారిని చేయడం ఒక ఉపాధ్యాయుడిగా తట్టుకోలేకపోతున్నాను. ఎంతో భక్తి శ్రద్ధలతో అయ్యప్పను ఆరాధించే కథానాయకుడిని, ఎంతోమందికి ఇరుముడి వేసే గురు స్వామిని కూడా తాగుబోతులుగా చూపించడం సబబు కాదు. ప్రాణప్రదంగా తన కూతురును ప్రేమించే కథానాయకుడు కూతురు ముందే మందు తాగడం చూపించడం ఏ రకంగానూ సరియైనది కాదు. దీనికి తోడు సినిమా చివర్లో కథానాయకుడు ఇతరులను, గురు స్వామిని వరుసగా చంపుతూ వెళ్లడం, చనిపోయిన తన కూతురుకు పుష్పవతి అయిన సందర్భంలో చేయించే మంగళ స్నానం సీన్ లో సినిమా కావాల్సినంత సెంటిమెంట్‌గా ఆకట్టుకోలేకపోయింది.

గొల్లెపల్లి నరసింహ రిటైర్డ్ ప్రిన్సిపల్
8106 820 393



# హామీలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

అయితే స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను, ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని ఆరోపించారు. యువకులు, విద్యార్థులు, కవులు, రచయితలు, పాత్రికేయులు సహా అనేక వర్గాలు నిర్బంధానికి గురవుతున్నాయని అన్నారు. వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా వంటి మేధావులను జైళ్లలో నిర్బంధించిన సందర్భాలను ఆయన ప్రస్తావించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ, న్యాయ వ్యవస్థలపై కూడా రాజకీయ ప్రభావం పెరుగుతోందని, ప్రతిపక్షాలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని ఒక మతరాజ్యంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు సుదీర్ఘ పోరాటం చేశారని నెల్లికంటి సత్యం గుర్తుచేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి రైతులు ఆందోళన చేసినప్పటికీ వారిని తీవ్రవాదులు, ఖలిస్తానీలు, అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసే ప్రయత్నం జరిగిందని అన్నారు. చివరకు రైతుల ఉద్యమం ముందు కేంద్రం దిగివచ్చి వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. యువత, విద్యార్థులు నిర్వహించే పోరాటాలు కేవలం ఒక సమస్యకు పరిమితం కావని, దేశంలో నెలకొన్న అసంతృప్తికి అవి ప్రతిబింబాలని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడితే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని ఆశించినా ఆ పరిస్థితి పూర్తిగా ఏర్పడలేదన్నారు. బీబీనగర్, చౌటుప్పల్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదని ఆరోపించారు. బీబీనగర్, చౌటుప్పల్ ప్రాంతాలు మరో పటాన్‌చెరువుగా మారకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమల్లో 80 శాతం ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

**రెండు లక్షల ఉద్యోగాలు.. నిరుద్యోగ భృతి ఎక్కడ?**

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తి చేసుకున్నా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని నెల్లికంటి సత్యం విమర్శించారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ స్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు.

**‘యువత పోరాడితేనే మార్పు’**

దేశంలో నిరుద్యోగం, పేదరికం, అవినీతి, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని సత్యం పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, మౌలిక హక్కుల పరిరక్షణ కోసం యువతరం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏఐవైఎఫ్ అంటేనే సమరశీల పోరాటాల వేదిక అని పేర్కొంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. దేశాన్ని, సమాజాన్ని మార్చే శక్తి యువతరానికి ఉందని, ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

**ఉద్యోగాలు అడిగితే దిమాగీ నక్సల్స్ అంటారా? :ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా**



దేశానికి భవిష్యత్తుగా చెప్పుకునే యువతకు ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత కల్పించడంలో 12సంవత్సరాలుగా విఫలమైన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించే యువతనే దిమాగీ నక్సల్స్ గా ముద్ర వేయడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగాలు, అభివృద్ధి, అచ్చే దిన్ పేరుతో యువతలో ఆశలు రేకెత్తించిన కేంద్ర ప్రభుత్వం, 12 ఏళ్ల తర్వాత కూడా కోట్లాది యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల్లో జాప్యం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ వంటి సమస్యలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా జెన్ జీ యువత విద్య, పరీక్షలు, ఉద్యోగాలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై పెద్ద ఎత్తున ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో, ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రధాని మోదీ దిమాగీ నక్సల్స్ అంటూ విమర్శకులను ముద్ర వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన వైఖరి అని అన్నారు. ఉద్యోగం కావాలి అని అడిగే యువకుడు దిమాగీ నక్సల్ కాదు, పేపర్ లీక్ ఎందుకు? అని ప్రశ్నించే విద్యార్థి దేశద్రోహి కాదు, నా భవిష్యత్తు ఏమిటి? అని నిలదీసే జెన్ జీని అణచివేయలేరు అని వారు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ 1947 స్వాతంత్ర్య పోరాటాన్ని నేటి తరం చూడకపోవచ్చు,పాల్గొనకపోవచ్చు కానీ 2026 సంవత్సరంలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పోరాటం మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించందని, 56 అంగుళాల ఛాతీతో 12 సంవత్సరాలుగా విశ్వగురువు అని విర్రవీగిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కసారిగా విద్యార్థులు, యువత పోరాటానికి దిగివచ్చారని ఇది 60కోట్ల యువత ఆక్రందన పోరాటం ఉద్యమ విజయమన్నారు. ఈ బహిరంగ సభలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నానబాల రామకృష్ణ, లింగం రవి, తీర్పారీ వెంకటేశ్వర్లు,కునుకుంట్ల శంకర్ , టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, యుగంధర్, చేపూరి కొండల్, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బొలగానీ సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య,ఉప్పల ముత్యాలు,కుసుమని హరిచంద్ర, ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నహీం, ఆఫీస్ బేరర్స్ బద్దుల శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, సుద్దాల సాయికుమార్, సునీల్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, బంగారు, గోపగాని రాజు, ప్రణయ్, కంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



### భారీ యువజన ప్రదర్శన

ఏఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్ట లోని లక్ష్మీ నర్సింహా ఫంక్షన్ హాల్ నుండి బస్టాండ వరకు భారీ ఎత్తున యువజన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై పోరాడుదామని, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు నినదించారు. బహిరంగ సభలో ఏఐవైఎఫ్ యాదాద్రి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ స్వాగతం పలకగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ బహిరంగ సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ యువజన ప్రదర్శన, బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలాల నుండి వేలాది మంది యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.



## దురుసు ప్రవర్తన

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే వారి పైనే కేసులు నమోదు చేశారని తెలిపారు. మంగళవారం ఉదయం శాసన సభ ప్రారంభమైన వెంటనే హరీశ్ రావు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ‘కౌరవ సభ’గా మారిందని, రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. స్పీకర్ పదవి పట్ల తమకు పూర్తి గౌరవం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని, ఒక వేళ అలా భావించి ఉంటే వాటిని వెనక్కి తీసుకుంటూ తాతా మధు ఇప్పటికే క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. సభ్యుడు విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా అరెస్టు చేయడం సరైంది కాదని హరీశ్ రావు అన్నారు. ఒకే తప్పుకు ఎన్ని శిక్షలు విధిస్తారని ఆయన ప్రశ్నించారు.

## తెలంగాణ బియ్యం

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యంతోపాటు ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ రాష్ట్రానికి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు..దీంతో తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకునే ప్రతిపాదనపై ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యం కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ఇందుకోసం ఫిలిప్పీన్స్ ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, భారతీయ ఎగుమతిదారులు, తెలంగాణ రైస్ మిల్లర్ల మధ్య సమన్వయం అవసరమని ఇరువురు అభిప్రాయపడ్డారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానం, రవాణా, ధృవీకరణ ప్రక్రియలతోపాటు శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపైనా సమావేశంలో చర్చించారు. అదేవిధంగా తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆసక్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో బలమైన సామర్థ్యం ఉందన్నారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఫిలిప్పీన్స్‌కు దీర్ఘకాలం విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. ఈ సందర్భంగాడిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా లారెల్‌కు ఉత్తమ్ ప్రత్యేక ఆహ్వానం అందించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com